ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! | సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డా॥ ప్రణవ్‌పండ్యా**
సంపాదకులు
**బి.సి హెచ్.వి. సుబ్బారావు (అశ్విని)**
ఉప సంపాదకులు
**ముక్కామల రత్నాకర్**
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 22 - సంచిక 2
**జులై 2017**

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**94407 69798**

## శక్తి సాధన

అస్తిత్వం మొత్తం శక్తిలో ఇమిడి ఉంది. జడచేతనాలు అన్నీ శక్తికి వివిధ రూపాలే. నిద్రాణమైన దీని నిష్క్రియత కొన్ని చోట్ల కనిపిస్తుంది. జీవితంలో వివిధ రూపాలు దీనివల్లనే వ్యక్తం అవుతాయి. పశుపక్షులలో, వృక్ష వనస్పతులలో దీని చైతన్యమే ప్రవహిస్తోంది. గతి-ప్రగతి, వికాసం-విస్తరణ ఇలా అనేక రూపాలలో శక్తి కనిపిస్తుంది. వాస్తవానికి జీవితం, జగత్తు శక్తిమయములు. శక్తి లేనిదే ఇక్కడ ఏదీ లేదు.

శక్తిలీలలోని ఈ రహస్యం మానవ జీవితంలో ఎంతో లోతైనది. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలు ఇవన్నీ శక్తి ప్రవాహాల వివిధ రూపాలు. మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా, సహస్రార చక్రాలలో మహాశక్తి తన రహస్యాలను నిక్షేపించింది. ఇక కుండలినీ మహాశక్తి మానవ జీవితానికి అధిష్ఠానం. జగన్మాత అయిన ఆదిశక్తి ఈ పరమరూపంలో తనను తాను ప్రతిష్ఠించుకుని మానవ జీవితాన్ని సర్వశ్రేష్ఠం చేస్తోంది.

శక్తిలీలలోని ఈ రహస్యాన్ని వ్యక్తి తెలుసుకోకపోతే శక్తి సముద్రం సమీపంలో ఉండి కూడా దీనుడిగా, దుఃఖితుడిగా, దయనీయుడిగా మిగిలిపోతాడు. చుట్టూ నీళ్ళు ఉన్నా దాహంతో విలవిలలాడే వ్యక్తి అతడు. ఈ రహస్యాన్ని తెలుసుకునేందుకు సాధన చేసిన వ్యక్తి ఆదిశక్తి సంతానంగా గౌరవం పొందుతాడు. అతడి కణకణంలో శక్తి సముద్రం ప్రవహిస్తూ ఉంటుంది.

అసాధ్యాన్ని సుసాధ్యం చేసే ఈ శక్తిసాధన మహావిద్య గాయత్రీమహామంత్రంలోని 24 అక్షరాలలో నిక్షిప్తమై ఉంది. అనుభవం పొందినవారు ఈ సత్యాన్ని తెలుసుకుంటారు. గాయత్రీ మహాశక్తి సాధనలో పూర్తిగా లీనమైన శక్తి సాధకులు శక్తి కేంద్రాలుగా, శక్తి ప్రసార కేంద్రాలుగా రూపొందకుండా ఉండలేరు. జీవితంలో, జగత్తులో ఉన్న అనేక రహస్య శక్తులు అందడంతో వారి జీవితాలు కృతార్థములు అవుతాయి.

# విషయసూచిక


1. **సంపాదకీయం:** శక్తి సాధన 3
2. **విషయసూచిక** 4
3. **యుగనిర్మాణ చిత్రావళి-28:** ఇంద్రియముల విశృంఖలత యొక్క దుష్పరిణామం 5
4. **గాయత్రీ మహావిజ్ఞానం-1:** భూమిక 6
5. **గాయత్రీ మహావిజ్ఞానం-2:** వేదమాత గాయత్రి ఉత్పత్తి 7
6. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-61:** శ్రీకృష్ణ జన్మభూమిలో అఖండజ్యోతి స్థాపన 10
7. **గురుపౌర్ణమి ప్రత్యేకం:** శాశ్వతమైన సమయోచిత బోధనా పర్వం - గురుపౌర్ణమి 13
8. **21వ శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు - 8:** ఆలోచనల క్రాంతి యొక్క చిన్న నమూన 18
9. **సమయదానమే యుగధర్మము - 7:** ప్రామాణికత-ప్రఖరతలే సర్వత్రా అభీష్టము 22
10. **అశ్వమేధ యజ్ఞం-దేవ సంస్కృతి దిగ్విజయ యాత్ర-5:** మేధా యజ్ఞములు 24
11. **మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-4:** ధ్యాన తీవ్రతలో దర్శించిన గతము 29
12. **అంతర్యాత్ర - 7 :** జీవితమనే కమలమును వికసింపచేయగలిగే ఐదు వృత్తులు 33
13. **శిష్య సంజీవని-4:** అంతట గురువే నిండి ఉన్నాడు 36
14. **ప్రేమ, స్నేహం, మమతలతో పుష్టిని పొందే ఇంటి భోజనం** 38
15. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మికత యొక్క అసలైన సంపదలు-2 40
16. **నా వారితో నా మాట:** తొమ్మిది సంవత్సరాల మాతృశక్తి శ్రద్ధాంజలి నవసృజన మహాపురశ్చరణ-2 43
17. **ఆయుర్వేద వైద్యం-27:** టమాట (రామములగ) ఒక ప్రకృతిసిద్ధమైన ఆరోగ్య సంరక్షణి 46
18. **అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018** (కౌంట్‌డౌన్-6) 48
19. **వార్తలు:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 50



## యుగశక్తి గాయత్రి

విడి ప్రతి రూ॥ 15/- సం॥ చందా రూ॥ 150/-
3 సం॥ చందా రూ॥ 420/- 10 సం॥ చందా రూ॥ 1300/-

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.



**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


## పండుగలు

**జులై 2017**

**09-07-2017** గురుపూర్ణిమ

**30-07-2017** సంత్ తులసీదాస్ జయంతి

**ఆగస్టు 2017**

**07-08-2017** రాఖీపూర్ణిమ

**15-08-2017** శ్రీకృష్ణ జన్మాష్టమి, స్వాతంత్ర్య దినోత్సవం

**25-08-2017** వినాయక చవితి

**గురువుల చిత్రపటాలు - సజీవ చేతనత్వాలు**

యుగనిర్మాణ చిత్రావళి-28

# ఇంద్రియముల విశృంఖలత యొక్క దుష్పరిణామం



పనిముట్లు, ఉపకరణాలు పనులు తేలికగా చేసుకోవడానికి పనికివస్తాయి. మంచి పనిముట్లతో పని తొందరగా అవుతుంది. పనులు బాగా జరుగుతాయి. జీవనం యొక్క ప్రగతి కొరకు, ఆనందం ఉల్లాసం ఉప్పొంగటానికి శరీరంలో పది ఇంద్రియములు పదకొండవది మనస్సును భగవంతుడు సృజించాడు. వీటిని సక్రమంగా ఉపయోగించుకోగలిగితే మనిషి యొక్క ఉన్నతి, సఫలతల సమస్త ద్వారములు తెరవవచ్చు.

కళ్ళతో అధ్యయనము, సత్ప్రవృత్తుల అవలోకనము; చెవితో సత్‌జ్ఞానమును హృదయంగమము చేసుకొనుటకు, శబ్దముల శ్రవణము, ఇతరులను పరామర్శ చేయుటకు; నాలుకతో రుచి, మంగళకరమైన సత్యములైన వచనముల ఉచ్చారణ, అవాంఛనీయమైన ఆహారమును ఆపుటకు; చేతులతో సత్కర్మలను మాత్రమే చేయుటకు, కాళ్ళతో సన్మార్గం వైపు నడవటానికి; కామేంద్రియములను కేవలం సంస్కారవంతులైన, లోక సేవకులైన, ప్రతిభావంతులైన సంతానాన్ని పొందటం కొరకు – ఈవిధముగా ఇతర ఇంద్రియముల ఉపయోగం శారీరిక, మానసిక సమర్థతను, సాత్వికతను పెంపొందించుట కొరకు; లభించిన సామర్థ్యమును ఆదర్శవంతమైన కార్యక్రమముల కొరకు మాత్రమే ఈ ఉపకరణములను ఉపయోగించి వ్యవస్థితమైన, సంయమపూర్వకమైన, ఉద్దేశ్యపూర్వకంగా ప్రతిభావంతమైన జీవితం జీవించినట్లయితే సామాన్య పరిస్థితులలో జన్మించినా, ఎన్ని అవరోధాలు ఎదురైనా కూడా మనిషి ఆశాజనకమైన సఫలతలు ప్రాప్తించుకోవచ్చు, ఉన్నతి యొక్క ఉన్నత శిఖరం వరకు వెళ్ళవచ్చు.

దుర్బుద్ధి మనలను సంయమం లేనివారిగా విశృంఖలంగా తయారుచేసింది. ఇంద్రియములు ఎందుకు లభించాయి? వాటిని ఏవిధముగా మనము ఉపయోగిస్తున్నాము? ఏ వస్తువునైనా దురుపయోగం చేస్తే దాని సామర్థ్యం కోల్పోతుంది. ఇంద్రియాల దురుపయోగం వలన ప్రతి వ్యక్తి ఒకరి నొకరు మోసం చేద్దామని చూస్తుంటారు. లంచాలు పుచ్చుకునే చెడు అలవాటు పొట్టను, రక్తాన్ని, ఆరోగ్యాన్ని నాశనం చేస్తుంది. రుచిగల పదార్థాలు తింటుంటే చాలా మజాగా ఉంటుందని భావిస్తారు. కానీ ఆ వస్తువులు మన ఆరోగ్యాన్ని పాడు చేయవచ్చు. అవాంఛనీయ పదార్థాలు అనవసరంగా ఎక్కువగా తినడం వలన అవి మన శరీరాన్ని రోగాల బారిన పడ వేస్తాయి. జీవించడమే కష్టం కావచ్చు. సంస్కారవిహీన ఆవేశపూర్వక ఆశయాలు, అసంయమ వ్యర్థ ప్రేలాపనల వంటి అలవాట్లు ఉంటే అతనిని ఎవరు విశ్వసించరు. మిత్రులు తగ్గిపోతారు, శత్రువులు ఎక్కువవుతారు. నాలుకపై అదుపులేక ద్రౌపది పలికిన కటువచనములు మహాభారతానికి నాంది అయ్యాయి. కామేంద్రియం యొక్క దురుపయోగం ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. మస్తిష్కాన్ని, శరీరాన్ని డొల్లచేస్తుంది, ముఖం కాంతివిహీనమవుతుంది, ఉత్సాహం నీరుగారిపోతుంది, మనోబలం నాశనమవుతుంది.

మనస్సు విశృంఖలతతో ఉత్పన్నమయ్యే దుష్పరిణామముల గురించి ఏమి చెప్పాలి? అది మనం ఐతిహాసిక మహాపురుషుల వలే తయారవగలిగే అన్ని అవకాశాలను దూరం చేస్తుంది. వ్యథ–వేదనల అగ్నిలో నిరంతరం మాడిపోయే అసఫల ప్రాణిగా తయారయి, జీవితంలో రోజులు ఎలా గడుస్తాయో అనే దయనీయ పరిస్థితిలోకి నెట్టివేస్తుంది.

ఈ తథ్యములపై ఆలోచిస్తే ఇంద్రియముల విశృంఖలతను వదలివేయడమే కాదు, వాటిని ఉద్దేశ్యపూర్వకంగా సదుపయోగం చేయాలని అర్థమవుతుంది.

*– అనువాదం: ముక్కామల రత్నాకర్*

**ఆందోళన అంటే అనారోగ్యాన్ని ఆహ్వానించడమే**



## గాయత్రీ మహావిజ్ఞానం-1

# భూమిక

గాయత్రి అనే దైవీశక్తితో సంబంధం స్థాపించుకుని జీవన వికాసం అనే మార్గంలో గొప్ప సహాయం పొందవచ్చు. పరమాత్మకు అనేక శక్తులు ఉన్నాయి. వీటి గుణములు సామర్థ్యములు వేరువేరుగా ఉంటాయి. ఈ శక్తులలో గాయత్రి యొక్క స్థానం ఎంతో మహత్త్వపూర్ణమైనది. ఇది మనిషికి సద్బుద్ధి ప్రేరణ ఇస్తుంది. గాయత్రితో ఆత్మ సంబంధం ఏర్పరచుకునే వారిలో నిరంతరం ఒక సూక్ష్మమైన, చైతన్యవంతమైన విద్యుత్తు ధార ప్రవహిస్తుంది. ఇది ప్రధానంగా మనస్సు, బుద్ధి, చిత్తం అంతఃకరణలపై తన ప్రభావం చూపిస్తుంది. బౌద్ధిక క్షేత్రంలో గాయత్రి అనే దివ్య ప్రకాశం ఉదయించడం వలన చెడు ఆలోచనలు, పనికిరాని సంకల్పములు, పతనోన్ముఖ దుర్గుణముల అంధకారము తొలగిపోతుంది. ఈ ప్రకాశం ఎంత ఎంతగా తీవ్రమైన కొద్దీ అంధకారం అంత అంతగా తొలగిపోతుంది.

మనోభూమి సువ్యవస్థితముగా, సత్వగుణములతో సంతులనంగా ఉంచడంలో గాయత్రి యొక్క చమత్కారవంతమైన లాభం అసందిగ్ధమైనది. ఎవరి మనోభూమి ఎంత వరకు వికసిస్తుందో అంత అనుపాతంలో సుఖంగా ఉంటాడు. ఎందుకంటే ఆలోచనలతోనే పనులు జరుగుతాయి. చేసే పనుల పరిణామము సుఖదుఃఖముల రూపంలో ఎదురువస్తుంది. ఎవరి ఆలోచనలు ఉత్తమంగా ఉంటాయో అతను చేసే పనులు ఉత్తమంగా ఉంటాయి, అతని వైపు సుఖశాంతులు తిరిగి వస్తాయి.

గాయత్రీ ఉపాసన వలన అందరికి పెద్ద పెద్ద లాభములు ప్రాప్తిస్తాయి. మా మార్గదర్శనంలో ఇప్పటివరకు అనేకులు గాయత్రీ ఉపాసన చేశారు. వారు ప్రాపంచిక జీవనంలో, ఆత్మిక క్షేత్రంలో ఆశ్చర్యకరమైన లాభములు పొందడం నేను కళ్ళారా చూశాను. ఇందుకు కారణం ఏమంటే వారికి దైవీ వరదానరూపంలో సద్బుద్ధి ప్రాప్తిస్తుంది. దాని ప్రకాశంలో మనిషిని దీనుడిగా, హీనుడిగా, దరిద్రుడిగా నడిపించే దుర్బలతలు చిక్కులు, కష్టములకు కారణం కనిపించకుండా పోతుంది. వెలుగు లేకపోవడమే చీకటి. చీకటి అనేది ఒక వస్తువు కాదు. సత్‌జ్ఞానం లేకపోవడమే దుఃఖానికి కారణం, లేకపోతే పరమాత్మ యొక్క పుణ్య సృష్టిలో దుఃఖం అనేదానికి తావు లేదు. పరమాత్మ సత్-చిత్-ఆనంద స్వరూపుడు. అతని రచన కూడా అలాగే ఉన్నది. మనిషి కేవలం ఆంతరిక దుర్బలత కారణంగా, సత్‌జ్ఞానం యొక్క లేమి వలన దుఃఖముల పాలవుతాడు. లేనిఎడల సురదుర్లభమైన మానవ శరీరము "స్వర్గాదపి గరీయసి". ధరిత్రిమాతపై దుఃఖమునకు ఎటువంటి కారణము లేదు. ఇక్కడ సర్వత్ర, సర్వదా ఆనందమే ఆనందము.

సత్‌జ్ఞానం యొక్క ఉపాసన పేరే గాయత్రీ సాధన. ఈ సాధన చేసే సాధకులకు అనేక ఆత్మిక-ప్రాపంచిక సుఖముల లేమి ఉండదు. ఇది మా సునిశ్చితమైన విశ్వాసము, దీర్ఘకాలీన అనుభవము. ఈ పుస్తకములో అన్ని ఉపయోగకరమైన విషయములు ఇవ్వబడ్డాయి. అయినప్పటికి సందేహముల నివారణ కొరకు శాంతికుంజ్, హరిద్వార్‌కు వ్రాయవచ్చు.

– పండిత శ్రీరామశర్మ ఆచార్య


**ప్రచార రథ చోదకులు & నిర్వాహకులు కావలెను**

*అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞము జనవరి 2018లో 5 నుండి 8 తేదీల మధ్య మంగళగిరి, గుంటూరు జిల్లాలో జరుగనున్నది. ఈ మహాక్రతువు సంపూర్ణ విజయానికై రెండు ప్రచార రథములు (శక్తి కలశాలతో) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో దాదాపు నాలుగు మాసములు ప్రచారాన్ని నిర్వహిస్తాయి. ఈ వాహనములను నడుపుటకై మరియు నిర్వహించుటకై సమయదానీలు కావలసి ఉన్నారు. (1) వాహన చోదకులు (డ్రైవర్లు) (2) ప్రచార నిర్వాహకులు*

*ఆసక్తిగలవారు వారి పూర్తి వివరములను మరియు ఎంతకాలము, ఎప్పటినుండి వారి సమయాన్ని ఇవ్వగల్గెడి దానిని తెలుపుచూ ఈ క్రింది చిరునామాకు తెలియజేయప్రార్థన.*

**గాయత్రీ చేతనాకేంద్రము, హెచ్.పి.రోడ్, మూసాపేట, హైదరాబాద్ - 500 018. తెలంగాణ. ఫోన్: 040-23700722, సెల్: 9949111175**


**కష్టపడుతున్నాను అని అనుకోకూడదు**



### గాయత్రీ మహావిజ్ఞానం-2

# వేదమాత గాయత్రి ఉత్పత్తి

జ్ఞానమును వేదమని అందురు. జ్ఞానము నాలుగు రకములు. 1.ఋగ్వేదము, 2.యజుర్వేదము, 3.సామ వేదము, 4.అధర్వణవేదము. కళ్యాణప్రదము, ప్రభుప్రాప్తి, ఈశ్వర దర్శనము, ఆత్మశక్తి, బ్రహ్మనిర్వాణము, ధర్మభావన, కర్తవ్యపాలన, ప్రేమ, తపస్సు, దయ, ఉపకారము, ఉదారత, సేవ మున్నగునవి ఋగ్వేద అంతర్గతములు. పరాక్రమము, పురుషార్థములు (ధర్మార్థ కామ మోక్షములు) సాహసము, వీరత్వము, రక్షణ, ఆక్రమణ, నేతృత్వము, యశస్సు, విజయము, పదవి, ప్రతిష్ఠ యజుర్వేదాంతర్గతములు. క్రీడలు, వినోదము, మనోరంజనము, సంగీతం, కళలు, సాహిత్యము, స్పర్శేంద్రియపు స్థూల భోగములు, ఈ భోగములను గురించిన చింతన, ప్రియమైన కల్పనలు, ఆటలు, గతిశీలత, రుచి, తృప్తి మున్నగునవి సామవేదాంతర్గతములు. ధనము, వైభవము, వస్తుసంగ్రహణము, శాస్త్రము, ఔషధులు, అన్నము, వస్తువులు, ధాతువులు, గృహములు, వాహనములు మొదలైన సుఖ సాధనములు అధర్వణవేద పరిధిలోకి వస్తాయి.

జీవించి ఉన్న ఏ ప్రాణిని పరిశీలించినప్పటికీ ఆ ప్రాణి స్థూల, సూక్ష్మ, అంతర్గత, బహిర్గత కల్పనలను, గంభీర భావము లను, వైజ్ఞానికశక్తిని విశ్లేషించిన యెడల పైన ఉదహరింప బడిన నాలుగు క్షేత్రములలో ఆ ప్రాణి సమస్త చేతనత్వము పరిభ్రమిస్తూ ఉంటుందని తెలుసుకోవచ్చు. (1) ఋక్-కళ్యాణ ప్రదము (2) యజు-పౌరుషము (3) సామ-క్రీడ (4) అధర్వ-అర్థము-ఈ నాలుగు మినహా ప్రాణుల జ్ఞానధార మరే దిశ లోను ప్రవహించదు. ఋక్ అనగా ధర్మమనియు, యజుః అనగా మోక్షమనియు, సామమునకు కామమనియు, అధర్వ మును అర్థమనియు కూడా చెప్తారు. ఇవియే బ్రహ్మ దేవుని చతుర్ముఖములు.

బ్రహ్మదేవుడికి ఒక ముఖం ఉన్నప్పటికీ నాలుగు విధముల జ్ఞానధారలను పంపిస్తున్నందున బ్రహ్మదేవునకు చతుర్ముఖుడను పేరు వచ్చినది. 'వేదము' అను పదమునకు జ్ఞానము అని అర్థము. ఈవిధంగా బ్రహ్మ ఒక్కటైనప్పటికి, ప్రాణుల అంతః కరణములలో నాలుగు విధములుగా కనిపిస్తుంది. అందువలన వేదము (జ్ఞానము) సులభంగా తెలిసికొనుటకు నాలుగు భాగములుగా విభజింపబడినది. విష్ణుభగవానుని నాలుగు భుజములు కూడా ఇవే. ఈ నాలుగు విభాగములకు సంబంధించి నాలుగు ఆశ్రమములు, నాలుగు వర్ణములు వ్యవస్థీకరింప బడినవి. బాల్యము క్రీడావస్థలోను, తరుణ వయస్సు అర్థావస్థ లోను, వానప్రస్థము పౌరుషావస్థలోను, కళ్యాణావస్థ సన్యాసము లోను ఉంటాయి. బ్రాహ్మణులు ఋగ్వేదము, క్షత్రియులు యజుర్వేదము, వైశ్యులు అధర్వణవేదము, శూద్రులు సామ వేదము. ఈవిధంగా చతుర్వేద విభజన జరిగినది.

సృష్ట్యారంభంలో బ్రహ్మదేవుడు స్ఫురణ మాత్రంగా ఏ చైతన్య శక్తిని ఉత్పన్నం చేశాడో అదియే జ్ఞానము లేక వేదము. దీనిని శాస్త్రజ్ఞులు గాయత్రి అనే నామముతో పిలుస్తారు. నాలుగు వేదములకు "మాత" "గాయత్రి". ఈవిధంగా 'గాయత్రి' వేదమాత అని చెప్పబడింది.

జలతత్త్వమును హిమము (ఐస్)గా, ఆవిరిగా (మేఘము, మంచు, పొగమంచు మొదలైనవి), వాయువుగా (హైడ్రోజన్-ఆక్సిజన్), నీటిగా-నాలుగు విధములుగా చూడవచ్చు. అగ్నితత్త్వమును మంటగా, వేడిగా, ప్రకాశముగా, చలనము గలదిగా చూడవచ్చు. అదే విధముగా జ్ఞాన గాయత్రి యొక్క నాలుగు వేదములు నాలుగు రూపములుగా దర్శనం ఇస్తాయి. గాయత్రీ మాత అయినప్పుడు నాలుగు వేదములు ఆవిడ పుత్రులు.

ఇది సూక్ష్మగాయత్రి యొక్క సూక్ష్మ వేదమాత స్వరూపము. ఇప్పుడు గాయత్రి యొక్క స్థూల స్వరూపాన్ని గురించి విశ్లేషిద్దాం. బ్రహ్మ నాలుగు వేదములను రచించక ముందు '24' అక్షరము లతో కూడిన గాయత్రీమంత్రాన్ని రచించాడు. ఈ మంత్రంలోని ఒక్కొక్క అక్షరం సూక్ష్మతత్త్వంపై ఆధారపడి ఉన్నది. ఇవి పల్లవించుటవలన వేదముల శాఖ ప్రశాఖలు ఉద్భవించాయి.

ఒక వటవృక్ష బీజములో మహావటవృక్షము దాగి

**ఇష్టమయితే ఏది కష్టం కాదు**

ఉంటుంది. అది అంకురముగా, తరువాత వృక్ష రూపములో పెద్దది అవుతుంది. అప్పుడు అది అసంఖ్యాకమైన శాఖలు, కొమ్మలు, ఆకులు, పూలు, పండ్లతో నిండుతుంది. ఈ వృక్షం ఎంతపెద్దదిగా, విస్తారంగా ఉంటుందంటే మూలంలో ఉన్న బీజం కన్నా కోట్ల రెట్లు పెద్దదిగా అవుతుంది. గాయత్రీ యొక్క 24 అక్షరములు కూడా ఇలాంటి బీజములే! అవి ప్రస్ఫుటించి వేదములుగా విస్తారరూపంలో ఉంటాయి. గాయత్రి సూత్రమయితే వైదిక ఋక్కులు దాని విస్తృతమైన వ్యాఖ్యలు.

వ్యాకరణ శాస్త్రములోని పదునాలుగు సూత్రాలు మహేశ్వరుని డమరు నుండి ఉద్భవించాయి. ఒకసారి మహాదేవుడు (ఈశ్వరుడు) ఆనందంతో తన డమరును వాయించాడు. ఆ డమరుక నుండి పదునాలుగు ధ్వనులు వెలువడ్డాయి. అవి అ, ఇ, ఉణ్, ఋ, లుక్, ఏ, ఓంగ్, ఐ, ఔచ్, హ య వ రట్, లణ్ మొదలైనవి. ఈ పదునాలుగు సూత్రాల ఆధారంగా 'పాణిని' మహావ్యాకరణ రచన చేశారు. ఆ వ్యాకరణానికి అనేక వ్యాఖ్యలు అవతరించాయి. అవన్నీ ఒకచోట సేకరించబడి నట్లయితే ఒక పెద్ద సంగ్రహాలయమవుతుంది. గాయత్రీ మంత్రంలోని ఇరువది నాలుగు అక్షరాల నుండి వైదిక సాహిత్యము యొక్క అంగ ప్రత్యంగాలు ప్రాదుర్భవించాయి. గాయత్రి సూత్రమయితే వైదిక ఋక్కులు దాని విస్తృతమైన వ్యాఖ్యలు.

## బ్రహ్మదేవుని స్ఫురణ మాత్రంచే గాయత్రి ప్రాదుర్భావం

అనాది పరమాత్మతత్త్వం ఈ సకల చరాచర సృష్టిని బ్రహ్మదేవుని ద్వారా ఉత్పన్నం చేసినది. సృష్టి చేయాలనే ఆలోచన కలిగినంతనే బ్రహ్మదేవునికి స్ఫురణ కలిగినది. దాని నామము 'శక్తి', శక్తి ద్వారా రెండు రకముల సృష్టి జరిగినది. ఒకటి జడము, రెండవది చైతన్యము. 'జడసృష్టి'ని నడిపించునది ప్రకృతి. చైతన్యసృష్టిని సంచాలన చేసే శక్తి పేరు 'సావిత్రి'.

పురాణాలలో సృష్టి ఆదికాలములో భగవంతుని నాభి నుండి కమలము ఉద్భవించినదని వర్ణింపబడినది. కమలం నుండి బ్రహ్మ ఉద్భవించాడు. బ్రహ్మ నుండి సావిత్రి, బ్రహ్మ సావిత్రిల సంయోగము వలన నాలుగు వేదములు ఆవిర్భవించాయి. వేదముల నుండి అన్ని రకముల జ్ఞానము వెలువడినది. తరువాత బ్రహ్మ ఈ పాంచభౌతిక సృష్టినొనరించినాడు. ఈ అలంకారిక కథా రహస్యమేమంటే 'నిర్లిప్త, నిర్వికార, నిర్వికల్ప పరమాత్మ తత్త్వమనే నాభినుండి అనగా కేంద్రము నుండి అంతఃకరణము నుండి కమలము ఉత్పన్నమై, అది పుష్పమువలె వికసించినది. సృష్టి ప్రారంభమున పరమాత్మకు ఒక ఇచ్ఛ కలిగింది. 'ఏకోఽహం బహుశ్యామ్' అనగా ఒకటి అనేకం కావాలి. ఈ సృష్టి ఆ పరమాత్మ 'ఇచ్ఛ' స్ఫురణ నాభిదేశము నుండి ప్రాదుర్భవించినది. అనగా కమలము యొక్క 'లతిక' ఉత్పన్నం అయి దానికి ఒక మొగ్గ పుష్పించినది.

ఈ కమలపుష్పంపై బ్రహ్మ ఉత్పన్నం అయ్యాడు. ఈ బ్రహ్మ సృష్టి నిర్మాణం యొక్క త్రిదేవ శక్తి ఉత్పత్తి, స్థితి వినాశనం యొక్క కార్యనిర్వహణ చేసే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల రూపంలో దృష్టిగోచరమవుతుంది. ఆరంభములో కమల పుష్పంపై కేవలం బ్రహ్మ మాత్రమే ప్రకటీకరణ చెందాడు. ఎందువల్ల అంటే సర్వప్రథమముగా ఉత్పన్నం చేసే శక్తి యొక్క అవసరం కలిగింది.

ఇప్పుడు బ్రహ్మ యొక్క సృష్టి ప్రారంభమైనది. బ్రహ్మ సృష్టి రెండు రకములు. ఒకటి చైతన్యము. రెండవది 'జడము'. చైతన్యసృష్టి అనగా సకల జీవుల సృష్టి. ఇందులో ఇచ్ఛ, అనుభూతి, అహంభావములు ఉంటాయి. చైతన్యము స్వతంత్ర సృష్టి. దీనినే ఈ విశ్వమునకు 'ప్రాణమయకోశము' అని అంటారు. నిఖిల విశ్వములో ఒక చైతన్యతత్త్వం నిండి ఉన్నది, దీనిని ప్రాణం అని పిలుస్తారు. ఆలోచన, సంకల్పము, భావము, ప్రాణతత్త్వములోని మూడు భాగాలు. సత్వ, రజ, తమము అనేవి వీటి వర్ణములు. ఈ తత్త్వములు ఆధారంగా ఆత్మకు స్థూల, సూక్ష్మ, కారణ దేహములు తయారవుతాయి. అన్ని ప్రాణులకు ఈ ప్రాణతత్త్వం నుండి చైతన్యము మరియు జీవశక్తి ప్రాప్తిస్తుంది.

జడసృష్టి నిర్మాణం కోసం బ్రహ్మ పంచభూతములను నిర్మించాడు. పృథ్వి, జలము, వాయువు, అగ్ని, ఆకాశముల ద్వారా సృష్టిలోని పరమాణుమయ పదార్థం నిర్మించబడినది. పరమాణు ప్రకృతి ఘన, ద్రవ, వాయు రూపాలలో తన గతి విధానాన్ని వ్యక్తీకరిస్తుంది. నదులు, పర్వతాలు, పృథ్వి మొదలైనవి పాంచభౌతికపు క్రీడలు, ప్రాణుల స్థూల శరీరాలు ఈ ప్రకృతి యొక్క పంచభూతముల నుండి తయారైనవే.

**కష్టపడి చేయకండి - ఇష్టపడి చేయండి**

జడ, చైతన్య సృష్టిరెండింటిలోను క్రియ ఉన్నది. ప్రాణమయ చైతన్యసృష్టిలో అహంభావము, సంకల్పము, ప్రేరణ అనేక రూపాలలో వ్యక్తమవుతాయి. జడమయ సృష్టిలో శక్తి, బలము, స్వభావముల ఆధారంగా పరమాణు పదార్థము రూపములో, వర్ణములో, ఆకారములో అనేక విధాలుగా మార్పులు చెందుతూ ఉంటుంది. జడసృష్టికి ఆధారం పరమాణువు. చైతన్యసృష్టికి ఆధారం సంకల్పము. ఈ రెండు ఆధారాలు అత్యంత సూక్ష్మ మైనవి, అత్యంత బలమైనవి. వీటికి నాశనము లేదు కానీ రూపాంతరమున్నది.

జడచేతన సృష్టి నిర్మాణంలో బ్రహ్మయొక్క రెండు శక్తులు పని చేస్తాయి. (1) సంకల్పశక్తి, (2) పరమాణుశక్తి. ఈ రెండింటిలో ప్రథమంగా సంకల్పశక్తి అవసరమైనది. ఏలనన సంకల్పము లేనిదే చైతన్య ఆవిర్భావం జరగదు; చైతన్యము లేనిదే పరమాణువు ఉపయోగింపబడలేదు.

అచైతన్య సృష్టి మనలో అచైతన్యంగా ఉంటుంది. ఎందుకంటే దానిని గురించి ఎవరికి తెలియదు, దాని ఉపయోగం ఏమి ఉండదు. చైతన్యం యొక్క ప్రకటీకరణకు 'జడ' సాధనా సామాగ్రి ఉపయోగపడుతుంది. ప్రారంభంలో బ్రహ్మ చైతన్యాన్ని తయారుచేశాడు. జ్ఞానం యొక్క సంకల్పాన్ని ఆవిష్కరించాడు. పౌరాణిక భాషలో సర్వప్రథమంగా వేదముల ప్రకటీకరణ జరిగింది.

పురాణాలలో బ్రహ్మ యొక్క శరీరం నుండి ఒక సర్వాంగ సుందరి ఉద్భవించినది అని ఉన్నది. ఆయన అంగము నుండి ఉద్భవించినది. కనుక ఆమె ఆయనకు పుత్రిక అయింది. ఈ తరుణి సహాయముతో తన సృష్టి కార్యాన్ని ప్రారంభించాడు. తరువాత రూపవతియైన తరుణిని చూసి మోహించి, మనో వికారమును పొందినవాడై ఆమెను భార్యగా స్వీకరించి రమించాడు. ఈ మైథునము వలన పాంచభౌతిక సృష్టి ఉత్పన్న మయ్యింది. అలంకారిక కథ ఇది. ఈ కథ యొక్క రహస్యాన్ని తెలిసికొనక ప్రాచీనత్వాన్ని అవహేళనతో, అవినీతికరంగా భావించి అశ్రద్ధకు, అవిశ్వాసానికి లోనగుచున్నారు. బ్రహ్మ మానవుడు కాదని, ఆయనచే సృష్టించబడిన శక్తి స్త్రీ కాదని, వారు స్త్రీ పురుషులవలే సంగమించి బీజోత్పత్తి చేయలేదని గ్రహించాలి. సృష్టికార్య స్వరూపాన్ని గూఢంగా కవితా కళా కౌశలాన్ని ఉపయోగించి కథగా చెప్పబడినదని గ్రహించాలి.

బ్రహ్మ ఒక నిర్వికార పరమాత్మ శక్తి. ఇదియే సృష్టినొన రించునది. ఈ కార్యాన్ని నిర్వహించడానికి గాను 'పరమాత్మ శక్తి'కి రెండు భుజములున్నాయి. అవి (1) సంకల్పశక్తి, (2) పరమాణుశక్తి. సంకల్పశక్తి చైతన్య సత్ సంభవము గనుక బ్రహ్మకు పుత్రికయైనది. పరమాణుశక్తి స్థూల క్రియాశీలం తమ సంభవం (**तम-सम्भव**) అవటం వలన బ్రహ్మ యొక్క పత్ని అయింది. ఈవిధంగా గాయత్రి లేక సావిత్రి బ్రహ్మకు పుత్రికగా లేక పత్నిగా ప్రసిద్ధి చెందినది.

## కాళిదాసు

*విక్రమాదిత్య మహారాజు, కాళిదాస మహాకవి ఇరువురు ఉద్యానవనంలో విహరిస్తున్నారు. విక్రమాదిత్యుడు కాళిదాసుతో ఇలా అన్నాడు – 'కవివర్యా! మీరు గొప్ప మేధావులు, ప్రతిభాశాలురు. భగవంతుడు ఎందుకో మీకు అందమైన శరీరాన్ని ఇవ్వలేదు. అద్వితీయమైన మీ బుద్ధి కౌశల్యంతో పోల్చి చూస్తే మీది అందవిహీనమైన రూపం. కాళిదాసుకు వ్యవహార కౌశల్యం ఎక్కువ. వెంటనే సమాధానం చెప్పటం భావ్యం కాదని ఆయన ఊరుకున్నాడు.*

*రాజభవనానికి తిరిగి వచ్చిన తరువాత కాళిదాసు రెండు పాత్రలు తెప్పించాడు. ఒకటి మట్టిపాత్ర. ఇంకొకటి బంగారుపాత్ర. రెంటిని మంచినీటితో నింపాడు. కొంత సేపైన తరువాత కాళిదాసు విక్రమాదిత్యుడిని అడిగాడు – 'రాజా! రెండు పాత్రల నుండి నీరు త్రాగి చూడండి. ఏ పాత్రలో నీరు ఎక్కువ చల్లగా ఉన్నది?' రెండింటిలో నుండి ఒక గుక్క త్రాగి విక్రమాదిత్యుడు చెప్పాడు – 'మట్టిపాత్రలో నీరే చల్లగా ఉన్నది'. కాళిదాసు మందహాసం చేస్తూ ఇలా అన్నాడు – 'నీటి చల్లదనం పాత్ర అందంపై ఆధారపడి ఉండదు. అలాగే మహారాజా! ప్రతిభ అనేది కూడా శరీరా కృతి మీద ఆధారపడి ఉండదు. అది ఆత్మకు సంబంధించిన విషయం.'*

*ఇది విన్న మహారాజుకు తన పొరపాటు తెలిసింది. ఆయన కాళిదాసు గొప్పతనానికి, సమయస్ఫూర్తికి జేజేలు పలికాడు. అటు తరువాత ఎన్నడు కాళిదాసు అందవిహీన మైన శరీరాన్ని గురించి వ్యంగ్యంగా మాట్లాడలేదు.*

**రాజైనా సేవకుడైనా చివరకు మిగిలేది ఆరడుగుల నేలే**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-61

# శ్రీకృష్ణ జన్మభూమిలో అఖండజ్యోతి స్థాపన



మథురలో 'అఖండజ్యోతి' మొదటి మజిలీ హోలీ గేట్ ప్రాంతం దగ్గర ఒక సందులో ఏర్పాటు చేయబడింది. అప్పట్లో ఆ సందుకు ప్రత్యేకంగా ఒక పేరంటూ లేదు. ఒకప్పుడు వల్లభ్‌రామ్ అనే చతుర్వేద బ్రాహ్మణుడు అక్కడ ఉండేవారట. ద్వారకాధీశుని ఆలయాన్ని కొల్లగొట్టాలని చూసిన అధర్మపరులను ఆయన ఎంతో ధైర్యంగా ఎదుర్కొన్నారట. ఆ గొడవలలో ప్రాణాలు సైతం పోగొట్టుకున్నారు. అప్పటి నుంచి ఆ సందును ఆయన పేరుతోనే గుర్తుపట్టేవారు. ఇప్పుడు ఆ పరిసరాలన్నీ మారిపోయాయి. శ్రీరామ్ ఏర్పరచుకున్న స్థావరం రూపురేఖలు కూడా పూర్తిగా మారిపోయాయి. 1941 మార్చి అఖండ జ్యోతి అక్కడే ముద్రించారు. ఉగాది నాడు శ్రీరామ్ అక్కడ యజ్ఞం చేశారు. నగరంలోని ధార్మిక, సామాజిక, సాహిత్య క్షేత్రాలలో అభిరుచి కలిగినవారందరు యజ్ఞంలో పాల్గొన్నారు. ఆర్యసమాజంవారు కూడా వచ్చారు. అప్పట్లో మథురలో ఆర్యసమాజం రెండు శాఖలుగా విడిపోయింది. ఆర్యసమాజం హోలీగేట్, ఆర్యసమాజం చౌక్ అన్న పేర్లతో విడిపోయిన రెండు శాఖలవారు యజ్ఞానికి వచ్చారు. యజ్ఞం అయిపోయాక శ్రీరామ్ తన భావి కార్యక్రమాల గురించి సంక్షిప్తంగా చెప్పారు. ఆయన మాట్లాడడం పూర్తయిన వెంటనే హోలీగేట్ ఆర్య సమాజం సభ్యుడు సత్యప్రకాష్ ఆర్య చేయి పైకెత్తారు. ఏదో మాట్లాడడానికి అనుమతి కోరినట్టు చెయ్యి ఎత్తారు కానీ, ఎటువంటి సంకేతం కోసంగానీ, అనుమతి కోసం కానీ ఆగకుండా వెంటనే మాట్లాడడం మొదలుపెట్టారు. శ్రీరామ్ భావనలు చాలా ఉజ్జ్వలమైనవి అంటూ కొనియాడారు. శ్రీరామ్ ఒప్పుకుంటే తమ కార్యకర్తలంతా వారితో పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. హోలీగేట్ ఆర్యసమాజానికి ప్రధాన పదవిని వారు స్వీకరించాలని కోరుకుంటున్నాను అన్నారు. ఆ శాఖలోని సభ్యులంతా అందుకు సమర్థించారు.

చౌక్ ఆర్యసమాజం వాళ్ళు కూడా ఏమాత్రం తగ్గలేదు. వారి ముఖ్యుడు శ్రీదివ్యానంద్‌గారైతే మొత్తం మథురలోని ఆర్యసమాజానికే నేతృత్వం వహించాలని ప్రస్తావించారు. ఈ ప్రస్తావనలో రెండు శాఖలు విలీనం అవ్వాలనే భావన దాగి ఉన్నట్టు అనిపించింది. ఈ ప్రస్తావన తరువాత హోలీగేట్ సత్యప్రకాశ్ ఆర్యగారు మరో సారి మాట్లాడారు "విగ్రహారాధనకు సంబంధించి శ్రీరామ్ నమ్మకాలు ఆర్యసమాజం మూలసిద్ధాంతాలకు విరుద్ధమైనవి. కాబట్టి అందులో కనుక మీరు కొన్ని సవరణలు చేసుకుంటే, మీ ప్రతి మాట మాలో ప్రతి ఒక్కరికీ శిరోధార్యం" అన్నారు. దయానంద ఆర్య కూడా ఈవిధంగానే మాట్లాడారు.

కానీ అక్కడున్న సనాతన ధర్మ విద్వాంసులు, ఈ ఆర్య సమాజవాదులను వ్యతిరేకించే ప్రయత్నం చేశారు. మెల్లిమెల్లిగా వాదన మొదలవుతోంది అని అనిపించగానే శ్రీరామ్ కలుగ జేసుకున్నారు. ఆయన వెంటనే "సమాజం బాధ్యతలు తీసుకోవాలా లేదా అనేది ఇప్పుడే ఏమీ చెప్పలేను. నాకు ఆలోచించుకోవడానికి సమయం కావాలి. ప్రస్తుతం మనం ఉగాది పండుగ జరుపుకోవడానికి ఇక్కడ కలిశాము. ఇకపై అఖండజ్యోతి మథుర నుండే ప్రకాశించబడుతుంది. పత్రిక ద్వారా భారతీయ సమాజంలో ఔచిత్యభావన స్థాపించగలము అని నేను భావిస్తున్నాను. ఈ పరమాత్మ సృష్టిలో పరస్పర విరోధతత్త్వాలు ఎన్నో ఉన్నాయి. ఒకే సమయంలో ఒకే చోట కలిసి ఉండే ప్రస్తావనే లేని తత్త్వాలు ఉన్నాయి. ఉదాహరణకు అగ్ని, నీరు. అయినా సృష్టిలో రెండిటికీ చోటుంది. అభిప్రాయ భేదాలను వివాదంతో, గొడవతో పరిష్కరించడాన్ని నేను సమర్థించను. ఔచిత్యాన్నే సమర్థిస్తాను. వీలైతే మీరందరు అందుకు సహకరించండి."

శ్రీరామ్ తమ మాటలు ముగించాక ఆర్యసమాజ బాధ్యతలు అప్పజెప్పడం, షరతులు విధించే ప్రకరణ ఆగిపోయింది. శిరోమణి గారు కూడా కార్యక్రమానికి వచ్చారు. అక్కడున్న వారితో అఖండజ్యోతికి సభ్యత్వ రుసుము చెల్లించమని చెప్పే

**కోట్లు కూడబెట్టినా వెంట తీసుకెళ్ళేది ఏమి ఉండదు**

పనిలో మునిగిపోయారు. ఉగాది రోజునే చైత్ర నవరాత్రులలో సాధన, సంస్కారాల చిన్న ప్రక్రియ కూడా మొదలుపెట్టారు శ్రీరామ్. అక్కడున్న భక్తులను నవరాత్రులలో రోజు గాయత్రి మంత్రం 12 మాలలు జపం చేయమన్నారు. ఈవిధంగా నవరాత్రుల్లో 108 మాలలు పూర్తవుతాయి.

నవమి రోజున ఈ సంక్షిప్త అనుష్ఠానానికి పూర్ణాహుతి చేసుకోవాలి. మథుర నుండి అఖండజ్యోతి ముద్రణతో పాటు సాధనకి కూడా ఒక రూపాన్ని అందించి శుభారంభం చేశారు. ఇందులో పాల్గొనడానికి సిద్ధపడ్డవారిని తమ పేర్లు వ్రాయమని కోరారు. ఏడుగురు వ్యక్తులు తమ పేరు నమోదు చేశారు. అందులో నలుగురు ఆర్యసమాజ సభ్యులు. వారు తమ పేర్లు రాయడం చూసి హోలీగేట్ ప్రముఖుడు "మీరు విగ్రహారాధన చేస్తారా? స్వామి దయానందుల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆచరిస్తారా?" అంటూ గదమసాగారు.

ఆ అభ్యంతరాన్ని శ్రీరామ్ ఖండించారు. "అయ్యా! వీళ్ళు పౌరాణిక విధానంలో జపాలు, పూజలు చేయవలసిన అవసరం లేదు. గాయత్రీ మంత్రజపం మాత్రమే చేయమని అడిగాము. గాయత్రీ మంత్రజపం నిత్యం చేయాలని దయానంద్ మహరాజ్ స్వయంగా అన్నారు. సత్యార్థప్రకాశంలో రోజుకు రెండుసార్లు ఉదయము మరియు సాయంత్రం సంధ్యావందనాన్ని తప్పకుండా ఆచరించాలని స్వామీజీ అన్నారు. అలాంటప్పుడు వీరు చేయబోయే సాధన స్వామీజీ సిద్ధాంతాలకు విరుద్ధం ఎలా అవుతుంది. నన్నడిగితే, మీరు కూడా ఈ తొమ్మిది రోజులు, రోజుకు 12 మాలలు గాయత్రీ మంత్ర జపం చేయండి."

తన వాదన నిరూపించుకోవడానికి ఆర్యసమాజ ప్రముఖునికి ఆధారాలు మిగలలేదు. బహుశా మనసులో విగ్రహారాధనకు సంబంధించి ఒకరకమైన పట్టుదల స్థిరపడిపోయిందేమో అన్న అనుభూతి ఆయనకు ఒక్కసారిగా కలిగింది. కంటికి నిజాలు కనిపించటం లేదు. ఆ పశ్చాత్తాపాన్ని దూరం చేసుకోవడం కోసం కాబోలు ఆయన కూడా తొమ్మిది రోజుల సంక్షిప్త అనుష్ఠాన సంకల్పం తీసుకున్నారు.

## సేవ-స్వాధ్యాయం

మథురలో అడుగుపెట్టి అప్పటికి కొన్ని రోజులే అయింది. అఖండజ్యోతి ముద్రణ ఏర్పాట్లు చూసుకోవడం, సందర్శకులను కలవడంతోనే చాలా సమయం గడిచిపోయేది. కుటుంబానికి అంటూ ప్రత్యేకంగా సమయం కేటాయించలేకపోయేవారు. భార్య సరస్వతీదేవి మీద కూడా పని భారం చాలా ఎక్కువైంది. సాంప్రదాయ పద్ధతులు పాటించి, ఇంటిపట్టునే ఉండే మహిళ. పెద్దగా ఎక్కడికీ వెళ్ళేది కాదు. ఇంటి పనులు, వచ్చీ పోయే వారికి నీళ్ళు, పాలు, మజ్జిగ, అల్పాహారం ఏర్పాట్లలోనే మునిగి పోయేది. కొత్త చోటు, పెరిగిన బాధ్యతల వల్ల ఆవిడ అలిసి పోయేది. మధ్యమధ్యలో విశ్రాంతి అవసరం అనిపించేది. ఆవిడ అలిసిపోవడం చూసి శ్రీరామ్ కూడా పనిలో సహాయం చేసేవారు. ఆయనతో అది మాన్పించటం కోసం, విశ్రాంతి అవసరమున్నా కూడా ఆవిడ పని చేస్తూనే ఉండేది. అంతలోనే ఆవిడకి పెద్దగా దగ్గు రావడం మొదలైంది. క్రమేపీ పెరిగింది. ఒకరోజు శ్రీరామ్ పని మాన్పించి వైద్యుని దగ్గరకు తీసుకు వెళ్ళారు. వైద్యం మొదలైంది. ఇంటి పనులన్నిటికీ పనిమనిషిని పెట్టారు.

వైద్యం మొదలుపెట్టాక ఆవిడకు క్షయ అని తెలిసింది. ఊపిరితిత్తులు బాగా దెబ్బతిన్నాయి. ఆస్పత్రిలో చేర్చాలి. మథురలో క్షయ రోగానికి సరైన వైద్యవ్యవస్థ లేదు. ప్రక్కనే ఉన్న 'హాథరస్' అనే బస్తీలో ఒక చికిత్స కేంద్రం ఉందని తెలిసింది. అక్కడ చుట్టాలు కూడా ఉన్నారు. వారి సహాయం అందుతుంది. మూడు, నాలుగు రోజులలో హాథరస్ వెళ్ళే ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు శ్రీరామ్. తాయాజీనీ, పిల్లలను మథురలోనే ఉంచారు. స్వయంగా భార్యను తీసుకుని హాథరస్‌కు బయల్దేరారు.

సుమారు రెండు నెలలు వైద్యం అవసరం అని తెలిసింది. పదిహేను రోజులు మాత్రం ఆస్పత్రిలోనే ఉండాలి. ఆ తరువాత మధ్యమధ్యలో వెళ్ళి చూపిస్తే సరిపోతుంది. ఆస్పత్రిలో భార్య ఉన్నన్ని రోజులు శ్రీరామ్ కూడా అక్కడే ఉన్నారు. తెల్లవారక ముందే వెళ్ళేవారు, చీకటి పడ్డాక ఎప్పుడో తిరిగొచ్చేవారు. రాత్రికి ఆస్పత్రిలో బస చేయడానికి ఏర్పాట్లు లేవు. చుట్టాల ఇంట్లో రాత్రికి పడుకునేవారు. మొదటి రోజునే దినచర్యను నిర్ణయించుకున్నారు. ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో ఉన్నా కూడా సరస్వతిదేవి భర్త చేత సేవలు చేయించుకోవడం అనేది జీర్ణించుకోలేకపోయింది. ఆయనను చేయద్దని వారించేది కూడా. రోగులను చూసుకోవడానికి డాక్టర్లు, కాంపౌండర్లు

**ఎవరితోను పోల్చుకోకు, అలా చేస్తే నిన్ను నీవు అవమానపరచుకున్నట్లే**

ఉంటారు కదా అనేది. కానీ శ్రీరామ్ చేయదల్చుకున్నదే చేసేవారు. మందులు, పథ్యం అన్నీ ఆయనే చూసుకునేవారు. స్వయంగా మందులు వేసేవారు. భోజనం చేయించేవారు. స్నానం చేయించి బట్టలు మార్చేవారు. చాకలి రాని రోజు ఆయనే స్వయంగా బట్టలు ఉతికేవారు.

అన్ని సపర్యలు చేశాక కూడా శ్రీరామ్‌కు చాలా సమయం మిగిలేది. ఆ ఖాళీ సమయంలో ఏం చేయాలి? అక్కడ వాకబు చేస్తే రెండు మంచి గ్రంథాలయాలు ఉన్నట్టు తెలిసింది. వీలు దొరికిన వెంటనే అక్కడికి వెళ్ళి సభ్యత్వం తీసుకున్నారు. పుస్తకాలు తెచ్చుకుని సరస్వతీదేవిగారి దగ్గర కూర్చుని చదువుకునేవారు. ఆవిడ పడుకున్నప్పుడు వాటిని చదివేవారు. ఆవిడ మేల్కున్నప్పుడు మందులు వేసి ఆవిడతో మాట్లాడుతూనే ఉండేవారు. మళ్ళీ విశ్రాంతి తీసుకున్నప్పుడు చదవడం మొదలుపెట్టేవారు. ఆ పుస్తకాలు ఆషామాషీగా చదవడం కాదు, నోట్సు కూడా రాసుకునేవారు. అక్కడున్న పదిహేను రోజుల వ్యవధిలో ఆ రెండు గ్రంథాలయాలలోని ముఖ్యమైన పుస్తకాలన్నిటినీ చదివేశారు. వాటిల్లో రెండువేల కన్నా ఎక్కువ పుస్తకాలే ఉన్నాయి.

పదిహేను రోజుల తరువాత సరస్వతీదేవిని ఆస్పత్రినుండి డిస్చార్జ్ చేశారు. మందులు ఎలా వాడాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అన్నీ చెప్పి ఇంటికి పంపించారు. ఆ తరువాత ఆవిడ పూర్తిగా నయమవడానికి ఆరు నెలలు పట్టింది. శ్రీరామ్ అన్ని జాగ్రత్తలు స్వయంగా తీసుకున్నారు. ఆవిడ నయం అయ్యాక కూడా చాలా కాలం జాగ్రత్తగా చూసుకున్నారు. ఒక సంవత్సరం అయ్యాక ఆవిడ కోలుకుని ఇంటినీ, కుటుంబాన్నీ మళ్ళీ పూర్తిగా చూసుకోవడం మొదలుపెట్టారు.

– *అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## యుద్ధంలో నిలచి పోరాడు - పారిపోవద్దు

*అంగిరామహర్షి గోపమాలునికి తిలకాన్ని దిద్ది నాయనా! నీ అంతఃకరణలో ముక్తి పొందాలనే కోరిక బలంగా ఉన్నది కాబట్టి, నీవు గృహస్థాశ్రమ ధర్మం వంటి కఠోర బాధ్యతను కూడా కర్మఫలం పట్ల ఆసక్తి చూపకుండా నిర్వర్తించగలిగితే తప్పక నీ లక్ష్యం నెరవేరుతుంది. అందువల్ల శ్రవస్తి అనే గ్రామంలో హేమమాలిని అనే కన్యను వివాహమాడి సుఖంగా గృహస్థ జీవితాన్ని గడుపుతూ వ్యవహారిక జీవిత సాధన చేయమని ఆదేశించాడు.*

*గోపమాలుడు మహర్షి ఆజ్ఞను తు.చ. తప్పక ఆచరించసాగాడు. ఒకసారి అతని వద్ద డబ్బులేక గోవులను అమ్మవలసి వచ్చింది. తరువాత అవి వధించబడ్డాయని విని గోపమాలుడు బాగా దుఃఖించాడు. పరితప్త హృదయుడైన గోపమాలుడు ఆ పాపానికి గృహస్థాశ్రమమే కారణంగా భావించి, గృహస్థాశ్రమాన్ని త్యజించాలని నిశ్చయించుకుని అర్ధరాత్రి గుట్టుగా లేచి బయలుదేరాడు. భార్య కూడా భర్తమార్గాన్నే అనుసరించింది. కొంతదూరం వెళ్ళేసరికి ఎదురుగా అంగిరామహర్షి ప్రత్యక్షమైనారు. ఆయన వాత్సల్యంతో ఆ దంపతులను సమీపించి "మీరిద్దరు ఆత్మకళ్యాణాన్ని కోరుకుంటున్నారు. మంచిదే కానీ సామాజిక జీవితంలో ఎదురయ్యే సాధారణ పరిస్థితులతోనే పోరాడలేని అశక్తులు, తపోదీక్షల వంటి కఠోర సాధనలను ఎలా చేయగలరు? మానవుడు కర్మచేస్తూ జీవించాలేగానీ సాఫల్యం-వైఫల్యం, సుఖం-దుఃఖం, మానం-అవమానం వంటి వాటితో బంధించబడుతూ కర్మపట్ల ప్రభావితులు కాకూడదు. వ్యక్తి తననుతాను భగవంతుని ప్రతినిధిగా భావించుకుని లోకసేవలో నిమగ్నం కావాలి. తద్వారా ప్రతిఫలం దానంతట అదే లభిస్తుంది" అని ఆ దంపతులకు తెలియజేశాడు.*

*మహర్షి బోధనలోని వేదాంతతత్త్వాన్ని అర్థం చేసుకొన్న గోపమాలుడు పత్నీసమేతంగా తపోవనంలాంటి తన గృహసీమకు తిరుగుముఖం పట్టాడు. ఆధ్యాత్మికతకు అసలైన నిర్వచనం తెలిసినవారెవ్వరైనా యుద్ధభూమి వంటి జీవితంలో ఎదురు నిలబడి పోరాడాలేతప్ప భయపడి తిరుగుముఖం పట్టరాదు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**చేస్తున్న పని ఇంకా బాగా చెయ్యడానికి ప్రయత్నించు**

# శాశ్వతమైన సమయోచిత బోధనా పర్వం - గురుపౌర్ణమి

## గురువు, జ్ఞానం విడిపోయాయి

దేశమంతటా గురుపౌర్ణమి ఉత్సవాలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్నాం. కానీ ఈ ఉత్సవాల ఆడంబరంలో గురుజ్ఞానం కనిపించకుండాపోయింది. గురుజ్ఞానంలోని ఏకాత్మత లుప్తమై పోయింది. అందుకే గురువు, జ్ఞానం రెండు విడిపోయాయి. ఒకప్పుడు గురువు, జ్ఞానాల సమ్మేళనంతోనే ధర్మానికి అర్థం వెలుగులోకి వచ్చేది. నేడు ఆ కలయిక లేకపోవడం వల్లనే ధర్మం అనర్థకరమైన రూపును దాల్చింది. గురుత్వాన్ని డబ్బుతో తూకం వేస్తున్నారు. ప్రవచనాల హంగును బట్టి జ్ఞానాన్ని కొలుస్తున్నారు. అందుకే నేడు ధర్మోపదేశాలు అర్థరహితంగా, అనుభూతిరహితంగా ఉంటున్నాయి. మునుపెన్నడు లేనన్ని ఉపద్రవాలు నేడు ధర్మం పేరిట సంభవిస్తున్నాయి. ఒకప్పుడు ధర్మానికి అర్థం సాధనల అనుభూతిని బట్టి పేర్కొనేవారు. ఇప్పుడు రాజకీయపరంగా వెతికే విచిత్రమైన స్థితి ఏర్పడింది. గురుశిష్యుల మధ్య అర్థవంతంగా కొనసాగాల్సిన సంవాదం నేడు అనవసరమైన రాజకీయ వివాదంగా మారిపోయింది.

తిరగపడిన దాన్ని మళ్ళీ తిప్పి సరిచేయడానికి పరిస్థితులలో మార్పు అవసరం. పునరావలోకనం అవసరం. ధర్మం పేరిట జరిగే అనర్థాలకు సరైన స్వరూపాన్ని ఇచ్చేందుకు సుదీర్ఘ చర్చలు అవసరం. అందుకు గురుపూర్ణిమకి మించిన శుభముహూర్తం ఏముంటుంది? నిజంగా సద్గురుచరణాల దగ్గర ఉండే జ్ఞానం సంపాదించిన వారందరు ఒక్క విషయాన్ని తప్పకుండా అనుభూతి చెంది ఉంటారు. **ధర్మం అంటే సత్యం మరియు శ్రద్ధ యొక్క సమ్మేళనం. వైజ్ఞానికంగా నిరూపించబడినది - సత్యం. ఈ వైజ్ఞానిక సత్యం పట్ల మనస్ఫూర్తిగా ఉండే నిష్ఠ - శ్రద్ధ. ఈ రెండు కలిసినది ధర్మం.** సత్యం ఏమిటో తెలిశాక, ప్రత్యక్షమయ్యాక, నమ్మకం పెరిగాక శ్రద్ధ కలుగుతుంది. ఒక్కోసారి దీనికి వ్యతిరేకంగా కూడా జరుగుతుంది. ముందు నమ్మకం కలుగుతుంది, అప్పుడు శ్రద్ధ పెరిగి సత్యం ఏమిటో అనుభూతి చెందుతాము. దీనిని నిరూపించే శాస్త్రవాక్యం - *'శ్రద్ధయా సత్యమాప్యతే'*. భావం: శ్రద్ధతో సత్యప్రాప్తి కలుగుతుంది.

## ధర్మం-ఒక వైజ్ఞానిక జీవన విధానం

జంబూద్వీపంలోని భరతఖండంలో భారతీయ ఋషులు అందించిన జ్ఞానం ప్రకారం ధర్మం అంటే అభ్యుదయ వైజ్ఞానిక జీవనశైలి. ఇదేదో దేవదూత పలికిన మాట కాదు. జడమైన, స్థిరమైన, ఖండించకూడని విధానాలు కూడా కాదు. ధార్మికమైన ఈ శాశ్వత సత్యం వైజ్ఞానికంగా నిరూపించబడింది. కర్మ, సత్యాచరణ అనేవి దేశ కాల పరిస్థితులను బట్టి మారుతూ ఉంటాయి.

శాశ్వతమైన, సమయోచితమైన ధార్మిక సత్యాన్ని వైజ్ఞానిక దృష్టికోణంతో పరిశీలించడం నేటి అవసరంగా మాత్రమే కాదు అనివార్యంగా కూడా మారింది. సంప్రదాయవాదానికన్నా ప్రపంచంలోని సత్యం, శివం, సుందరాలను జీవితాలలో నింపు కునే ప్రాచీన ఋషి పరంపర మనది. భారతీయ సంస్కృతి యొక్క మూలతత్త్వాన్ని గుర్తించి, దానిని బలపరచడం నేటి అవసరం. అప్పుడే సమాజంలో సత్ప్రవృత్తుల సంవర్ధన జరుగుతుంది, దుష్ప్రవృత్తుల ఉన్మూలన జరుగుతుంది.

ప్రపంచం, జీవితాల వ్యవస్థ ధర్మం. దీన్ని భారతదేశ ప్రజల జీవన విధానం అని కూడా చెప్పవచ్చు. అంతరిక్షం, కాలం – వీటి ప్రభావమే ప్రపంచం అని వైజ్ఞానికులు నిరూపించారు. ప్రకృతిలోని ప్రతి అణువు, పరమాణువుకు చలనం ఉంటుంది. అందుకే ప్రకృతి పరివర్తనశీలమైనది. కాలంతో పాటు భూగోళం కూడా మారుతోంది. ఖగోళీయ మార్పులను కూడా విజ్ఞానం నిరూపించింది. ధర్మమే కాదు, మరే ఇతర వ్యవస్థ శాశ్వతమైనది కాదు. ఒకప్పుడు గంగానదీ తీరంలో వలే మిగిలిన అన్ని నదుల ఒడ్డున శవదహనాలు చేసేవారు, శవాలను నేరుగా నదులలో వదిలేసేవారు. అప్పట్లో నదులు చాలా వేగంగా ప్రవహించేవి, వాటిలో ఏది వదిలేసినా నదీ జలాలు నిర్మలంగానే ఉండేవి. తరువాత ఎన్నో మార్పులు వచ్చాయి. ఇప్పుడు శవదహనం కాదు కదా చిన్న చిన్న విగ్రహాలు, పూలమాలలు కూడా నీటిలో విసర్జించలేని పరిస్థితి. శ్రద్ధను కూడా వైజ్ఞానికంగా నిరూపించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**జీవితం అప్పగించిన బాధ్యతను స్వీకరించు**

పూర్వం తీర్థయాత్రలకు వెళ్ళేవారు బృందాలుగా ఏర్పడి పాడుకుంటూ, భజనలు చేసుకుంటూ ముందుకు సాగిపోయే వారు. ఇప్పుడు అలా చేస్తే ట్రాఫిక్ జామ్ అవుతుంది. శ్రద్ధ గొప్పది. కానీ సత్యంతో పాటు సమయోచితంగా, అనుకూలంగా కూడా ఉండటం చాలా అవసరం. **పుట్టుకతో కుల మతాలను నిర్ణయించడం వైజ్ఞానికం కాదు. గుణము, కర్మ, వ్యక్తిత్వాలను బట్టి సామాజిక వర్గాలను విభజించాలి.**

చరిత్రకు మచ్చతెచ్చిన అధ్యాయం అంటరానితనం. ఎప్పటికీ అది ధార్మికమైనది అని పేర్కొనలేము. కట్నం చట్టపరంగా నేరం. అదొక సామాజిక రోగం. దానిని ధర్మంలో భాగమని ఎన్నటికీ చెప్పలేము. సాధు-సంతు పరంపర గౌరవప్రదమైనదే. కానీ ఎంతోమంది సాధువులకు వ్యతిరేకంగా ఫిర్యాదులు నమోదయ్యాయి. శ్రద్ధ అచంచలమైనది. అందులో సందేహం లేదు. కానీ శ్రద్ధ కూడా సత్య పరీక్షను ఎదుర్కొని తీరాలి. ఇవన్నీ ధర్మసాధనకు, సమాజంలో సృజనాత్మకతకు అడ్డంకు లవుతాయి. వీటినుండి విముక్తి పొందకుండా భారతదేశాన్ని జగద్గురువును చేయలేము. జగద్గురు పీఠాన్ని ఎక్కించలేం. సరైన పద్ధతిలో గురుపూర్ణిమ జరుపుకోలేము.

### సమానత్వంతో పాటు ఐకమత్యము కావాలి

మన ధర్మంలో, ధార్మిక కర్మకాండలలో కుటుంబ వ్యవస్థను చెక్కుచెదరనిదిగా భావిస్తారు. కుటుంబమే సమాజానికి శక్తి. మన ధర్మానికీ, సంస్కృతికీ మూలమైన ఋగ్వేదంలో భార్యా భర్తలను 'దంపతులు' అంటారు. దంపతులు అన్న పదానికి ప్రతిరూపం ప్రపంచంలో ఎక్కడా లేదు. పరమాత్మ గురించి ఉపనిషత్తుల్లో ఒక విషయం చెప్పబడింది. 'ఒక్కటి' అయిన ఆ పరమాత్మ తనని తాను 'రెండు'గా అంటే సగం 'స్త్రీ'గా, సగం 'పురుషుని'గా విభజించుకోవడం జరిగింది. నిజానికి ఇద్దరు ఒకే అస్తిత్వానికి రెండు రూపాలు. ఇద్దరి ఏకాత్మత యథార్థ మైనది. కాబట్టి ఇద్దరి మధ్య సమానత్వంతో పాటు గాఢమైన ఐక్యత ఉండాలి. **జీవితంలో ఆధునికతను ఆహ్వానించాలి. కానీ ఆధునికత అంటే క్రొత్త పరికరాలు, సాధనోపకరణాలు మరియు ఆధునిక జ్ఞానవిజ్ఞానాలుగా అర్థం చేసుకోవాలి. వాటిని మన సంస్కృతికి అనుగుణంగా ఉపయోగించుకోవాలి. అంతేకాని వాటికోసం మన ధర్మాన్ని, సంస్కృతిని వదిలేయకూడదు.**

భారతీయ ఋషుల ప్రకారం కాలం అఖండమైనది. జీవనం సనాతనమైనది. సనాతనానికి వర్తమాన స్వరూపాన్నే మనం అధునాతనం అంటున్నాం. మన ఆధునికత సనాతన జీవితానికి నూతన రూపం కావాలి. బాహ్య ఆడంబరాల నుండి ముక్తిని, సమయ సద్వినియోగాన్ని ప్రగతి అంటారు. జీవిత విధానాన్ని, నమ్మకాలను కూడా అడపాతడపా బేరీజు వేసుకుంటూ ఉండాలి. ప్రతీసారి సంప్రదాయానికన్నా వివేకానికి ప్రాముఖ్య తనివ్వాలి. ప్రపంచంలోని మిగిలినదేశాలలో నమ్మకాలు, మార్గాలు, మతాలకు సంబంధించి చర్చలు, వాదనల ఆనవాయితి గాని, ఆస్కారం గాని లేదు. కానీ భారతదేశం, భారతీయత ఇందుకు భిన్నమైనవి. మన దగ్గర శాస్త్రార్థం అనే ప్రాచీన పరంపర ఉంది. 'శాస్త్రార్థం'అంటే శాస్త్రాలకు సమయోచిత, యుగాను కూల అర్థాలను వెతకటం. సంప్రదాయాలలో వివేకాన్ని వెతకడం అని కూడా అనవచ్చు.

### ధర్మ వికాసానికి సంవాదనలు అవసరం

ధర్మంలో ఎప్పటికీ సంవాదాన్ని సార్థకంగా ఉంచాలి. ప్రపంచాన్ని రచించినది విశ్వకర్మ అని ఋగ్వేదంలో చెప్ప బడింది. ఋషి వేసే ప్రశ్న - 'మీరు ప్రపంచాన్ని రచించారు. మరి ప్రపంచం లేనప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు? నిర్మాణానికి కావలసిన సామగ్రి ఎక్కడి నుండి వచ్చింది?' 'రాత్రి కాగానే ఎక్కడికి వెళ్ళిపోతారు?' అని సూర్యుడిని ప్రశ్నిస్తారు. ఎలాంటి ఆధారం లేకుండా ఆకాశంలో సూర్యుడు ఎలా వ్రేలాడుతున్నాడు? ఇంద్రుడిని అడిగిన ప్రశ్నలు - భ్రష్టాచారులు ధనవంతులెందుకు అవుతున్నారు? నిజాయితీపరులు నిర్ధనులుగా ఎందుకున్నారు? తర్కం, ప్రతివాదన, ప్రశ్నానుకూల జిజ్ఞాస-ఇవి మన ధర్మానికి సంబంధించిన ముఖ్యమైన, మహిమాన్వితమైన అంశాలు.

యజుర్వేదంలో ఋషి ప్రశ్నలను కూడా దేవత అన్నారు. నమ్మకం, విశ్వాసం, నిరంతర ప్రశ్నల వల్ల ఋషుల ద్వారా సమున్నతపరచబడ్డ ధర్మం ఎప్పటికీ సనాతనమైనది, నిత్యనూతన మైనది. వీటిలో విజ్ఞానసమ్మతమైనవి, కళ్యాణకరమైన సనాతన మైనవీ మాత్రమే నూతన రూపాన్ని ధరిస్తాయి. విజ్ఞాన, వివేకాలనే గీటురాయి మీద నిలవనివి అన్నీ మూఢనమ్మకాలుగా చెప్పబడ తాయి. వాటిని ప్రతి యుగంలో వదిలేయడం జరుగుతుంది. సతీసహగమనం క్రూరమైనది, అమానవీయమైనది. భూత

**నీకు నువ్వే ప్రేరణ ఇచ్చుకోవాలి**

ప్రేతాలు, చేతబడి వంటి అంధవిశ్వాసాలు కూడా అవైజ్ఞానిక మైనవే. నేడు మనం వాటిని మన ధర్మం నుండి తీసిపారేశాం.

మన మూల సాంస్కృతిక, ధార్మిక, తత్త్వజ్ఞానం ప్రపంచాన్ని ఒక్కటిగా భావిస్తుంది. మనందరం ఒకటే, ఒకే ప్రపంచం – ఒకే కుటుంబం. ఈ నమ్మకం మీదనే భారతీయులు సదా జీవిస్తూ వచ్చారు. మనది ప్రజాస్వామ్య ప్రకృతి, సంస్కృతి. కార్ల్‌మార్క్స్ కూడా ఈ విషయాన్ని స్వీకరించాడు. 1853వ సంవత్సరంలో భారతదేశం గురించి ఆయన చెప్పినది– 'భారతదేశం మన భాషలకు, మతాలకు, మార్గాలకు మూలం. యూరోప్ పునర్జాగరణకు ఒక పెద్ద ఆధారం గ్రీకు దార్శనికత. ఈ గ్రీకు దార్శనికతలోని ముఖ్య విషయాలు ఉపనిషత్తులలో మునుపే చెప్పబడి ఉన్నాయి. ప్రపంచానికి భారతదేశం ఎన్నో వరాలనిచ్చింది.' ప్రఖ్యాత మార్క్సవాది, తత్తవేత్త, డా॥ రామ్ విలాస్ శర్మ ఇలా వ్రాశారు. "పునర్జాగరణకాలంలో యూరోప్ యొక్క జ్ఞానవిజ్ఞానాలను ఎంగెల్స్ ప్రశంసిస్తూ అరబ్బుల యోగ దానం గురించి ఉల్లేఖించారు. కానీ అరబ్బులకు భారతదేశం నుండి లభించిందే వారు యూరోప్‌కి అందిస్తున్నారన్న విషయం బహుశా ఎంగెల్స్‌కి తెలియదు కాబోలు."

## ప్రపంచ ఆలోచనలకు మూలం - భారతీయ దార్శనికత

భారతీయ 'ధర్మం మరియు దర్శనం' ఇవి రెండు ప్రపంచ చింతనలకి మూలం, అందుకే ప్రపంచమంతా అనేక రూపాలలో ఆకర్షితమవుతూ ఉంది. మనదేశ జ్ఞానం, స్వాభిమానమును విదేశీ బానిసత్వం కొంత నాశనం చేసింది, మిగిలినది సంప్ర దాయవాదం నాశనం చేసింది. నేడు ప్రపంచంలో సామరస్యం, సమానత్వం, సమైక్యత అవసరం. నేటి ప్రపంచంలో మతాల మధ్య, వివిధ వర్గాల మధ్య ఎంతో హింస రగులుతోంది. ఇలాంటప్పుడు మన దేశం చూపిన ధర్మంలోని మాధుర్యం ఒక్కటే దారి.

ఋషుల ద్వారా ప్రేరితమైన, సమున్నతపరచబడిన ధర్మం విజ్ఞానం మరియు దర్శనాల వేడిలో తపింపబడ్డది ఈ మధురమైన జీవన ప్రణాళిక. దానిని ఆచరిస్తే సమస్త ప్రపంచంలో శాంతి తీసుకునిరావచ్చు. కానీ స్వయంగా మనం ధర్మతత్త్వాన్ని అర్థం చేసుకుని, అవలంభిస్తేనే ఇది కుదురుతుంది. నేర్చుకున్నాకనే నేర్పించగలం. జ్ఞానం సంపాదించాకే పంచగలం. ధర్మం యొక్క శాశ్వతమైన, సమయానుకూలమైన జ్ఞానానికి కూడా ఇదే వర్తిస్తుంది. ఈ సృష్టిని ధరించేది అనగా ప్రపంచాన్ని పోషించేది – ధర్మం. శాశ్వతమైన ప్రకృతి నియమాల్లో ధర్మం యొక్క శాశ్వత తత్త్వం కనిపిస్తుంది, ప్రకృతిలోని మార్పులలో ధర్మం యొక్క సమయోచితత్వం ఉంటుంది.

ప్రకృతి నియమాలు శాశ్వతమైనవి, చిరస్థాయిగా నిలిచి పోయేవి. కానీ మనిషి నిర్మించినవేవీ శాశ్వతమైనవి కావు. మనిషి చేసేవి, ఆలోచించేవి, తయారుచేసేవి అన్ని మారిపోవడం కూడా ప్రకృతి యొక్క శాశ్వత నియమం. మనిషి మనస్సు చంచలమైనది, గతిశీలమైనది. ఆలోచనలు కూడా క్షణక్షణం మారుతుంటాయి. ఆలోచనల మార్పుతో మనస్సులో ధారణలు ఏర్పడతాయి, మారతాయి. మనస్సు మరియు మెదడులో ఏర్పడిన ధారణల ఆధారంగానే మతాలు, నమ్మకాలు ఏర్పడతాయి. సంస్కారాల నిర్మాణం కూడా ఇలానే జరుగుతుంది. మంచి ఆలోచనలు సకారాత్మక ధారణను ఏర్పరుస్తాయి. సమయాన్ని బట్టి అవి అలాగే నిలిస్తే ప్రేమ, శ్రద్ధ జన్మిస్తాయి కానీ ఆలోచనలు కానీ, ధారణలు, నమ్మకాలు, సంస్కారాలు కానీ ఇవన్నీ మారుతూ ఉంటాయి, నాశనం అవుతాయి, మళ్ళీ నిర్మితమవుతాయి కూడా. ఇవన్నీ పరివర్తనశీలమైనవి. మారుతుండటమే వీటి ప్రకృతి.

## ధర్మాన్ని యుగానుకూలంగా బోధిస్తారు మహాపురుషులు

భారతీయ సంస్కృతిలో నిత్య సత్యమైన ధర్మాన్ని సమయాను కూలంగా, యుగానుకూలంగా బోధించడానికి ఆయా సమయాలలో మహామానవులు అవతరిస్తుంటారు. వారు ధర్మం యొక్క శాశ్వత సత్యానికి సంబంధించిన సమయానుకూలమైన రూపాన్ని తమ కాలపు సాధనలలో ప్రకటీకృతం చేస్తారు. భారతీయసమాజం ఈ మార్పులను ఉత్సవంగా జరుపు కుంటుంది. మరోవైపు ఈ ధర్మం ప్రకృతిలో, జీవితాలలో ప్రాథమిక నియమాలుగా మనకి కనిపిస్తూనే ఉంటుంది. మంత్ర ద్రష్టలైన ఋషులు వీటినే ఋక్కులు అన్నారు. ఏర్పడినది ఏ వస్తువైనా మారి తీరుతుంది, తరువాత నాశనం కూడా అవుతుంది. సూర్యుడు చిరస్థాయిగా ఉంటాడని, మార్పు ఉండదని మనకి

**నీకు నీవే ప్రేరణ కావాలి**

అనిపిస్తుంది. కాని విజ్ఞానం, ఆధ్యాత్మికం రెండింటి ప్రకారం సూర్యుని శక్తి ఒకప్పుడు పెరుగుతూ ఉండేది, కాని ఇప్పుడు తగ్గుతూ వస్తోంది. బౌద్ధగ్రంథాల్లో ప్రకృతి నియమాల వ్యాఖ్యానం స్పష్టంగా ఇవ్వబడింది. ఐదవ శతాబ్దంలో దక్షిణ భారత బౌద్ధ విద్వాంసుడు నాగార్జునుడు 'ప్రతీత్య సముత్పాదం' యొక్క రెండవ వ్యాఖ్యానం ఇచ్చారు. దాని ప్రకారం సృష్టిలోని ప్రతి ఒక్క వస్తువు మిగిలిన అన్నింటితోటి సంబంధం కలిగి ఉంటుంది.

నేడు ఇది అర్థం చేసుకోవాలంటే– మనిషి నిర్మించిన ఫాక్టరీల వల్ల ఉష్ణోగ్రత 1 డిగ్రీ పెరిగినా ఎక్కడో ఉన్న గ్లేసియర్లు కరిగి కొన్నిమీటర్లు వెనక్కి వెళతాయి. నదులలో, సముద్రాలలో నీటిమట్టం పెరుగుతుంది. భూమి జలమయం అవుతుంది. జీవరాశులు చనిపోతాయి. మనుష్యులు జీవించడానికి భూమి చాలక బస్తీలలో జనాభా ఎక్కువవుతుంది. రద్దీ పెరుగుతుంది. సామాజిక సంబంధాలు మారిపోతాయి. మనుష్యుల అవసరా లకు అడవులను నరుకుతారు, పంటపొలాలు ఆక్రమిస్తారు. చెట్లు తగ్గుతాయి, ప్రాణవాయువు ఉత్పత్తి తగ్గుతుంది, దానితో విషవాయువులు పీల్చుకోవడం ఎక్కువవుతుంది. అలా ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. ఈ పరస్పర ఆధారమే ధర్మానికి ఆధారం. అందుకే ధర్మంలో సహఅస్తిత్వము, సహ యోగం, సద్భావం, శాంతి, ప్రేమ, అహింసల గురించి చెప్తుంటారు. ఇవే కదా ధర్మానికి మూలాలు. విభిన్న ధర్మ మార్గాలలో ఈ తత్త్వాలనే వివిధ నిష్పత్తుల్లో స్వీకరించి జీవన విధానాలను ఏర్పర్చారు.

ఈవిధంగా సృష్టిలో, ప్రకృతిలో మరెన్నో నియమాలు ఉన్నాయి. ఈ నియమాలన్నిటినీ అర్థం చేసుకుని వాటిని పాటించడమే ధర్మం. భారతదేశంలో ఋషులు ఈ నియమాలనే అన్వేషించి, పరిశోధించారు. వాటిని వ్యవస్థీకరించి వేదాలుగా, శాస్త్రాలుగా రూపొన్నిచ్చారు. ఈ శాశ్వతమైనవాటిని దేశ కాల పరిస్థితులను బట్టి, సమయోచితంగా ఉద్భవించిన వాటితో నియమాలను, ఆచారసంహితలను తయారుచేశారు. ఈ పని ప్రపంచంలో మిగిలిన దేశాలలో కూడా మహాపురుషులు, దేవదూతలు చేశారు. వారు కూడా ప్రకృతి యొక్క శాశ్వత నియమాలను అనుభూతి చెందారు. ఇదంతా జరిగిన కాలంలో ఇప్పటిలాగా సంవాద, సంపర్క సాధనాలు (టెలిఫోన్, ఇంటర్‌నెట్) లేవు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. సంపర్క సాధనాలు, సౌకర్యాలు పెరిగిపోయాయి, కానీ సంవాదనలు, సంభాషణల కోసం మాత్రం వేచి ఉండాల్సిందే. మాట్లాడుకోవడానికి వీలు, తీరిక ఉండట్లేదు. మాట్లాడుకోలేక పోవడం వల్ల వివాదాలు పెరుగుతున్నాయి. దానితోటే విషాదాలు కూడా పెరుగుతున్నాయి.

## మేధో మధనం అవసరం

సంపూర్ణ జీవితంలో, ప్రత్యేకించి ధార్మిక క్షేత్రంలో మళ్ళీ మేధోమధనం అవసరం. నిత్యసత్యమైన ధర్మాన్ని మళ్ళీ అన్ని రంగాల్లో అనుసంధానపరుచుకోవాలి. మళ్ళీ వ్యవస్థీకరించు కోవాలి. దేశ కాల పరిస్థితులకు తగ్గట్టు సామాజిక నియమాలు, ఆచరణల వ్యవస్థ ఏర్పరచాలి. ధర్మపరంగా చూసుకుంటే నేడు మొండితనం, కటుత్వం కన్నా సంభాషణలు, మాటలు అవసరం. ఇందులోనే ప్రపంచం, మానవత్వాల హితం దాగి ఉంది. కొన్ని యుగాల క్రితం ధర్మప్రచారాల ప్రక్రియ ఉండేది. అందరూ తమ తమ పద్ధతుల్లో ఈ పనులు చేసేవారు, అందరికీ అందుకు తగ్గ ఫలితాలు కూడా వచ్చాయి.

కానీ ఇది గతచరిత్ర. అది గతాన్ని గురించి చర్చిస్తుంది. మనిషి ఏదోరకంగా ఇవన్నీ గుర్తుచేసుకుంటూనే ఉన్నాడు. కాని నేటి పరిస్థితులు వేరు. పరిస్థితులలో మార్పుతో పాటు మనిషి జీవితంలో కూడా మార్పువచ్చింది. కాలం మారిన ప్పుడల్లా భూగోళంలో కూడా మార్పులు వచ్చాయి. ఈ మార్పుతో పాటు ధర్మం యొక్క దృష్టాంతంలో కూడా మార్పు రావాలి. పరస్పర సంవాదం చేసుకోవడం సులువుగా మారాలి.

సమగ్ర సంవాదన ఒక్కటే ఇప్పుడు అవసరం. అన్ని కోణాల్లో విస్తారంగా ఆలోచించి చర్చించుకోవాలి. మానవజాతి మొత్తానికీ సమగ్రమైన మానవీయ దృక్పథం కావాలి. మనిషి వికాసానికి, సభ్యతకీ గీటురాయి – వివేకం. అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయాలలో నుండి అతి ఉత్తమమైనదానిని ఎన్నుకోవడమే వివేకం. నేటి పరిస్థితుల్లో అతి ఉత్తమమైనది ధర్మం గురించి చర్చ చేయగల స్థితి ఏర్పడటం. ఈ చర్చ వల్ల విశ్వమానవత్వం కోసం ఏది ధర్మం యొక్క శాశ్వత తత్త్వమో, ఏది సమయోచిత సత్యమో నిర్ధారణ కావాలి.

గురుపౌర్ణమి శుభసందర్భంలో గురువులందరిలో చర్చ

**నిన్ను నువ్వే పరిశీలన చేసుకోవాలి**

జరగాలి. గురుపౌర్ణమిని వ్యాస పౌర్ణమి అని కూడా అంటారు. వ్యాసమహర్షి తమ కాలంలో జ్ఞాన సంపదను అవసరాన్ని బట్టి వర్గీకరించి ఒక సమగ్ర రూపు తీసుకొచ్చారు. ఒకప్పుడు వేదానికి మూడు రూపాలుండేవి. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం. తరువాత మహర్షి అథర్వవేదానికి కొత్త స్వరూపాన్ని ఇచ్చారు. ఈ నాలుగు వేదాలు కాకుండా జ్ఞానానికి సర్వవిద్యా కోశం (ఎన్‌సైక్లోపీడియా) రూపంలో పంచమవేదమైన మహాభారతాన్ని రచించారు. నేడు కూడా ఇలాంటిదే చేయాలి. కాని ధార్మిక సంవాదం జరగాలి అనే సంవేదన ఉదయించినప్పుడే ఇది సాధ్యం. సత్యం, శ్రద్ధ - ఒక చోట కలవాలి.

ఇంతకుముందు కూడా ధర్మం నిరంతరం వికసిస్తూ ఉండేది. దార్శనికత, విజ్ఞానం ఈ వికాసానికి మూలాలు. సత్యాన్ని, శుభకర్మలనే వైదిక సూక్తులలో ధర్మం అన్నారు. ఆ తరువాత యజ్ఞాలు, కర్మకాండలు కూడా ధార్మిక పద్ధతులుగా మారాయి. వైదికకాలం తరువాత ఉపనిషత్తుల దార్శనికతలో ఋగ్వేదంలో ఒకవిధమైన సత్యదర్శనాన్ని రూపొందించారు. సాంప్రదాయ వాదం పోయింది. దార్శనికత నేతృత్వం వహించింది. కపిలుడి సాంఖ్యశాస్త్రం, బాదరాయణుడి వేదాంతం, బుద్ధుని దర్శనం సమస్త ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. నేడు మళ్ళీ ఈ వికాసక్రమాన్ని ముందుకు సాగించాలి. ధర్మంలో సంవాదం సంవేదనకు సంజీవనిని అందివ్వాలి. విశ్వమానవుడికి ధర్మం యొక్క కొత్త అనుభూతిని అందివ్వాలి. ధర్మాన్ని వదిలేయవలసిందిగా కాక వరించతగినదిగా అనగా సర్వశ్రేష్ఠమైనదిగా మార్చాలి. ఈ గురుపూర్ణిమ సందర్భంలో గురువులు, శిష్యులు ఈ మహత్కార్యం కోసం సంకల్పం తీసుకోవాలి.

**ఉభాభ్యామేవ పక్షాభ్యాం యథా ఖే పక్షిణాం గతిః**
**తథైవ జ్ఞానకర్మాభ్యాం జాయతే పరమం పదమ్**

**- యో.వా. 1/1/8**

ఏవిధంగా పక్షులు రెండు రెక్కలతో ఆకాశంలో ఎగురుతాయో, అదేవిధంగా జ్ఞానం మరియు కర్మ - ఈ రెండింటి యోగంతోనే పరమపదాన్ని చేరుకోగలం.

*సేకరణ: అఖండజ్యోతి, జులై 2016*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## తథాగతుడిని ప్రశ్నించిన దేవకన్య

*బోధిసత్వుడు ఒక అందమైన కమలములతో నిండిన సరోవరము దగ్గర కూర్చుని గాలి పీల్చుకున్నాడు. కమలము యొక్క మనస్సు దోచుకునే అందము ఆయనను అత్యధికంగా ఆకర్షించింది. ఇక కూర్చుని ఉండలేక లేచి సరోవరములో దిగి దగ్గరగా ఉన్న కమలము యొక్క సుగంధము పీల్చుకుని ఆనందించాడు. అప్పుడు ఒక దేవకన్య స్వరము వినిపించింది. "నీవు ఏమీ ఇవ్వకుండానే ఈ పుష్పముల సురభి పీల్చుకుని ఆనందిస్తున్నావు. ఇది దొంగతనము. నీవు సువాసనను దొంగిలిస్తున్నావు." తథాగతుడు ఆ మాట విని చకితుడయ్యాడు. అప్పుడే ఒక వ్యక్తి వచ్చి సరోవరములో దిగి నిర్దయగా కమల పుష్పములను త్రుంచుతున్నాడు. చాలాసేపు ఆ వ్యక్తి పుష్పములను త్రుంచాడు, వంచాడు, నలిపాడు. కానీ అతనిని ఎవ్వరూ ఆపకపోగా వద్దు అని కూడా చెప్పలేదు.*

*అప్పుడు బుద్ధదేవుడు ఆ కన్యని ఇలా ప్రశ్నించాడు. "దేవీ! నేను కేవలము వాసన చూశాను. పుష్పములను అపహరించలేదు. అంతమాత్రానికే నీవు నన్ను దొంగ అన్నావు. కానీ ఈ మనిషి ఎంతో కఠోరముగా పువ్వులను త్రుంచి, సరోవరమును పాడుచేసి అందవిహీనముగా చేశాడు. నీవు ఏమీ అనడము లేదేమిటి?" దేవకన్య గంభీరమై ఇలా చెప్పింది "హే తపస్వీ! లోభము, తృష్ణలతో నిండి ఉన్న ప్రపంచంలో ఉన్న మానవుడు ధర్మము మరియు అధర్మములలో తేడా తెలుసుకొనలేదు. అందువల్ల వాని మీద ధర్మరక్షణ భారము లేదు. కానీ ఎవరైతే ధర్మరతులో, సత్యాసత్యాల వివేకము కలవారో, నిత్యము అధికమైన పవిత్రత, మహానత సాధించడానికి నిరంతరము ప్రయత్నిస్తుంటారో వారు చేసే చిన్న తప్పు కూడా మహాపాతకము అవుతుంది.*

*- అనువాదం: లక్ష్మీరాజగోపాలు*

**సంపాదించడమే కాదు, సంపాదనను సద్వినియోగం చెయ్యాలి**

21వ శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు - 8

# ఆలోచనల క్రాంతి యొక్క చిన్న నమూన

నిజానికి శ్రద్ధ, తత్పరత మరియు ప్రామాణికతతోపాటు ఉచ్చస్తరీయ ఉద్దేశ్యములకొరకు ఈనాడు చేయబడే ఏ సామాన్య స్థాయి ప్రయత్నానికైనా అసాధారణ సాఫల్యము లభిస్తుంది. శాంతికుంజ్ ఈ సూత్రాన్నే ఉపయోగించుకుంటున్నది. ఈ తథ్యమును అంగీకరించే ప్రతిభగల వ్యక్తులు అత్యంత ఉత్సాహంతో నవనిర్మాణ క్షేత్రములో ఉత్సాహపూరిత మానసిక స్థితిలో అడుగులు ముందుకు వేయవచ్చు. మరియు తమ సంకల్పాలకు దేవతల వరదానాలు కూడా జోడింపబడి ఉండటం గమనించవచ్చు. అర్జునునికి రథసారథిగా కూడా దైవీశక్తియే ఉన్నది. ఈ విషయమును మనము గుర్తుంచుకోవాలి. శాంతికుంజ్ సూత్రసంచాలకులు కూడా పరోక్షసత్తా యొక్క ప్రతినిధిగా తాను పొందిన సంకేతముల ఆధారంగానే ఈ వనరులన్నీ కూడబెట్టారు.

భవ్యభవనము నిర్మించదలచుకున్నప్పుడు ముందు అతి చిన్న పరిమాణములో దాని నమూనా ఒకటి తయారుచేయబడుతుంది. తాజ్‌మహల్ మొదలగువాటి చిన్న నమూనాలు వీధులలో విక్రయిస్తున్నారు. పెద్దపెద్ద ఆనకట్టలు, పెద్దపెద్ద ప్రాజెక్టులు, పలు అంతస్తుల భవనములు నిర్మించేముందు వాస్తుశిల్పి (ఆర్కిటెక్ట్) ముందు నమూనాలను తయారుచేసుకుని ఆ తర్వాత భిన్నభిన్న చరణాలలో దానికి సాకార రూపమిస్తాడు. శాంతికుంజ్ 21వ శతాబ్దములో రానున్న ఉజ్జ్వల భవిష్యత్తుకు ప్రతీకగా తనను తాను ఒక చిన్న నమూనాగా ప్రపంచానికి అందజేసుకుంటున్నది.

ఈ నమూనాలో యుగమునకు కాలానుగుణ్యముగా తగిన అవసరాలను అందజేయడానికి యుగమనీషి ద్వారా చేయించబడే మూడు మహత్త్వపూర్ణమైన ప్రయత్నాలను అనివార్యముగా పొందుపరచాము.

1. యుగచేతనను జనమానస అంతరాళాలలోకి తీసుకువెళ్ళగలిగే మహాప్రజ్ఞగురించిన రచనలు.
2. జనమానసాన్ని కుదిపివేస్తూ తల్లక్రిందులుగా ప్రవహిస్తున్న నేటి ఆలోచనాస్రవంతిని సరిగా ప్రవహింపజేసే సామర్థ్యం గల వికసించిన వాక్కు.
3. తమ ప్రతిభను, ప్రఖరతను మరియు ప్రామాణికతను అడుగడుగునా నిరూపించగలిగే సమగ్ర అగ్రదూతల పరివారమును తయారుచేయుట.

పైన చెప్పబడిన మూడు 'యుగక్రాంతులు' తమ సమర్థవంతమైన పాత్రను పోషిస్తాయి. అనీతి, అనాచారాలను ఆదర్శవాద ప్రవాహముగా పరివర్తన చేయగలిగే గొప్ప కాయకల్పము ఈ మూడు అమోఘ శక్తుల ద్వారానే సాధ్యమవుతుంది.

నేటి పరిస్థితులలో ఇది సంభవమేనా? సహజంగానే దీనిని విశ్వసింపలేము. ఎందువల్లనంటే ఈనాడు ఆదర్శములు కేవలము చెప్పేవి, వినేవిగా మాత్రమే మిగిలిపోయాయి. వాటిని నిత్యజీవితములో ఆచరించవచ్చు అనే విశ్వాసము కుదరటంలేదు. అందువల్ల ఈ మహాప్రయోజనమును పూర్తి చేయుటకొరకు మరియు ఒక విశాలపరికరమును నిర్మించుటకొరకు, ప్రజ్ఞాఅభియాన్‌యొక్క రూపురేఖలు, వాటిని వ్యావహారిక క్రియాన్వయము ఎలా చేయవచ్చో తెలుపుటకు ఒక విశ్వసనీయమైన చిన్న, ఆదర్శవంతమైన మరియు కావలసిన నిష్పత్తులతో ఉన్న నమూనా శాంతికుంజ్ రూపంలో నిర్మించబడినది. దీనిని చూసి అర్థము చేసుకుంటే భవిష్యత్తు ఎలా మారుతుంది అన్న దాన్ని గురించి ఒక సవ్యమైన అవగాహన చేసుకోగలుగుతారు. నూతనశతాబ్దం ఎలా నిర్మించబడుతుందో తెలుస్తుంది.

అన్ని వైపులా కలయజూస్తే సహజముగా సామాన్య జనులకు వాడుకలోనున్నదానిని అనుకరించడము సులభము అని తెలుస్తుంది. అవి బుద్ధిసంగతము కాకపోయినా, సమయానుకూలమైనవి కాకపోయినా, ఉపయోగపడేవి కాకపోయినా ప్రజలు వాటిని పట్టుకొని వ్రేళ్ళాడుతుంటారు. నూతన విధి విధానాలు ఎంత చెప్పినా అవి అత్యంత ఉపయోగకరములైనప్పటికీ వారికి మ్రింగుడుపడదు. చేదుగా ఉన్న ఔషధము రోగాన్ని తగ్గిస్తుందని తెలిసినా దానిని సేవిస్తున్నప్పుడు ముఖమును వికారముగా పెడతారు కదా! ఖద్దరు వస్త్రాలు ధరించడము వెనుకగల తత్త్వజ్ఞానము ప్రజలకు హృదయంలో నిలిచి ఉన్నంత

**సమయాన్ని సద్వినియోగం చెయ్యాలి**

వరకు దానిని ఉపయోగించారు. ఇప్పుడు దానిపట్ల ఉదాసీన వైఖరియే ఉన్నది కదా!

విచారక్రాంతి – పాత ఆలోచనాసరళికి స్వస్తి చెప్పి ఉపయోగకరమైన క్రొత్త ఆలోచనా విధానములను అవలంబించండి అని చెప్తోంది. కానీ ప్రాచీనపద్ధతులను సమర్థిస్తూ మన పూర్వజులను అనుసరిస్తున్నామని వేలాది అర్థరహితమైన తర్కములు ఇవ్వబడుతున్నాయి. అటువంటప్పుడు అత్యంత సమయానుకూలమైన మరియు అత్యంత ఆవశ్యకమైన ఈ ప్రయత్నాలు ప్రజలందరి ద్వారా ఒప్పించబడాలంటే కొన్ని పెద్దవైన, కఠినమైన ప్రయత్నాలను రాబోయేరోజులలో చేయవలసి ఉంటుంది.

ఈ సందర్భములో రచనలు, ఉపన్యాసములు, శిక్షణా తరగతులు నిర్వహించుట నిత్యజీవితములో ఈ నూతన ఆలోచనలను ఆచరణలోపెట్టుటతోపాటు అత్యంత ముఖ్యమైనది ఏమిటంటే ఈ ఆదర్శవాద ప్రతిపాదనలను ఎవరైతే ఆచరిస్తున్నారో వారే చెప్పాలి. ఎవరి ప్రామాణికత, ప్రఖరతల గురించి మనము వేలెత్తి చూపించలేమో వారే చెప్పాలి. ఈ వనరులన్నింటినీ ఏకత్రితము చేసినప్పుడే విచారక్రాంతి (ఆలోచనల క్రాంతి) ముందుకు వెళ్ళగలదు. అతి చిన్న స్వరూపములో మెల్లిమెల్లిగానైనా సరే!

యుగక్రాంతి కొరకు రకరకాల భ్రాంతులమీద అన్ని దిశల నుంచి దెబ్బకొట్టే ప్రతిపాదనలు ప్రస్తుతము చేయుటయే కాక, వాటి స్థానములో స్థాపించవలసిన వివేకపూరిత ఆలోచనలకు, తర్క, తథ్య, ప్రమాణ ఉదాహరణలతోపాటు భావసంవేదనలను స్పష్టముగా తెలిపే శైలిలో ప్రభావము చూపించగలిగే రచనలు చేయవలసి ఉన్నది. వాటిని ప్రచురించుటకు మిషనరీస్థాయిలో ఒక వ్యవస్థను కూడా నిర్మించవలసి ఉంటుంది. సామాన్యంగా ప్రజలు తేలికైన, మనోరంజకమైన సాహిత్యాన్నే చదువుతారు. అటువంటి సాహిత్యాన్నే ప్రచురించేవారు ముద్రిస్తారు. ఈ లోకోపయోగకరమైన సాహిత్యమును ప్రచురించుట – మరియు వ్యక్తివ్యక్తికీ దానిని చౌకగా కూడా అందజేయుట అవసరము. అంతేకాక విద్యావంతుడైన ప్రతివ్యక్తిచేత సాహిత్యాన్ని బలవంతముగా చదివించే వ్యవస్థనుకూడా స్థాపించవలసి ఉన్నది.

సాధనములు లేని పరిస్థితులలో పెద్దప్రయత్నాలకు వనరులను ఏకత్రితము చేసుకోలేము. యాచించి అర్థసంగ్రహము చేయటముకంటే – సూత్రసంచాలకులు "అవసరాన్నే" తన కాళ్ళమీదే నిలబడి ప్రజలలోకి వెళ్ళగలిగేటట్లు చేయటము మంచిది అని అనుకున్నారు. అప్పుడు ప్రజల ముందు దీనిని పెట్టగలిగే స్థాయికూడా సహజముగానే సమీక్షింపబడుతుంది.

ఇప్పటినుండి 50 సంవత్సరాల క్రిందట ఈ ప్రయోజనమును ఆశించి 'హిందీ అఖండజ్యోతి' ప్రచురణ మొదలుపెట్టాము. ఈ మాసపత్రిక యొక్క ప్రేరణ నిరంతరము నాకు దుర్గమ హిమాలయక్షేత్రములనుండి లభించుటయే కాక నా చింతన, చేతనల నవనీతము కూడా. మొదట్లో 500 ప్రతులు మాత్రమే అచ్చువేశాము. స్వయంసేవకుల వలె ఇంటి-ఇంటికి వెళ్ళి పంచే క్రమము ఏర్పరుచుకున్నాము. ఇప్పుడు 500 రెట్లు అనగా రెండున్నరలక్షల కంటే ఎక్కువ సంఖ్యలో ముద్రింపబడుతున్నది. క్రమక్రమముగా ఈ సంఖ్య పెరుగుతూ ఏప్రిల్, 1989 నాటికి అఖండజ్యోతి చందాదారుల సంఖ్య 3 లక్షలకి చేరుకుంది. ఆధ్యాత్మిక తత్త్వదర్శనము యొక్క విజ్ఞాన సమ్మత ప్రతిపాదన, విజ్ఞానమునకు నూతనదిశనిచ్చే సమన్వయాత్మక తథ్యముతో కూడిన వ్యాసాల సంకలనము, వ్యక్తిలో దాగి ఉన్న అనంతశక్తులు మరియు వాటిని వికసింపచేయటానికి వివిధ సాధనల గురించి వివరించే ఈ పత్రిక యొక్క రచన, సంపాదకత్వము హరిద్వార్ నుండే జరుగుతున్నది. ప్రచురణ మాత్రము మథురనుండి జరుగుతున్నది. ఎవరు దీనిని చదివినా అతనిని ఈ రచనాశైలి ప్రభావితము చేయుటయే కాక కాలానుగుణ్యమైన నిగూఢప్రతిపాదనలకు నూతన ప్రేరణనిస్తుంది.

27 సంవత్సరాల క్రిందట రెండవ పత్రిక యుగనిర్మాణ యోజన పేరుతో ప్రారంభించబడినది. అఖండజ్యోతిలో చెప్పబడిన విషయాలు ఈ పత్రిక పరిధిలోకి రావు. కుటుంబ, సామాజిక నిర్మాణము కొరకు ఇవ్వబడే ప్రతిపాదనల, ప్రసార ప్రచారము ఈ పత్రిక చేస్తోంది. చూస్తూ చూస్తూ ఇది కూడా 70 వేల ప్రతులు ముద్రింపబడుతున్నవి. గుజరాతీ, మరాఠీ, ఒరియా, తమిళము, తెలుగు భాషల ముద్రణలు కూడా పెద్ద సంఖ్యలో పాఠకులకు అందజేయబడుతున్నవి. వీటిలో "యుగశక్తి" అనే పేరుతో గుజరాతీలో ప్రచురింపబడుతున్న పత్రికకు ఒకటిన్నరలక్షల కంటే ఎక్కువమంది పాఠకులున్నారు. గురుముఖీ, బెంగాలీ, ఇంగ్లీషు పుస్తకములు ప్రచురింపబడినా సరియైన వ్యవస్థ లేకపోవుట వలన వాటిని పుస్తకాకారముగా

**సమస్యలు ఎదురైనా ముందడుగు వెయ్యాలి, లక్ష్యాన్ని సాధించాలి**

అప్పుడప్పుడు ప్రచురిస్తున్నాము. ఈవిధముగా పత్రికల ప్రచురణ సంఖ్య 4-5 లక్షల మధ్య ఉంటున్నది. ప్రతి పత్రికను కనీసము పదిమంది పాఠకులు చదువుతున్నారు. ఈవిధముగా అన్ని పత్రికలు కలిపి 50 లక్షలమంది పాఠకుల ఆలోచనా చేతనత్వమును ప్రతి నెల కుదిపివేస్తున్నాయి.

ఏవిధమైన ప్రకటనలు తీసుకోకుండా ఎవ్వరినీ డబ్బు యాచించకుండా కేవలము తన యొక్క ఉపయోగపడే లక్షణాలు మరియు పాఠకుల యొక్క సహయోగము-సద్భావనల ఆధారముతో చందాదారుల సంఖ్య పెరిగింది. కేవలము కాగితము, ముద్రించుట మరియు తపాలా ఖర్చులు (Postal Charges) యొక్క భారమే ఈ ప్రచురణల మీద తీసుకుని లాభము వద్దు - నష్టము వద్దు (No Profit - No Loss) ప్రక్రియగా అఖండజ్యోతి పత్రికకు సాలు చందా 60 రూపాయలు (64 పేజీలు), యుగశక్తి గుజరాతీ 40 రూపాయలు (52 పేజీలు), యుగనిర్మాణయోజన హిందీ సంవత్సరచందా 30 రూపాయలు (36 పేజీలు) **(ఈ మాటలు 1990 సంవత్సరం కన్నా ముందు వ్రాసినవి.)** నిరంతరం ప్రచురించబడుతున్నాయి. ప్రకటనలు స్వీకరించకూడదు అనే సంకల్పాన్ని నిరంతరము గుర్తుంచుకుంటూ రెట్టింపు ఉత్సాహముతో పాఠకులను ఈ పత్రికలు చేరుకుంటున్నాయి.

గొప్ప ప్రతిభ కల వారితో, పెద్దసాధనాలతో విశాలక్షేత్రము లో పనిచేస్తే విచారక్రాంతి (ఆలోచనల క్రాంతి) యొక్క మొదటి చరణము సాధించుట ఏవిధంగానూ అసంభవము కాదు అన్నదానికి ఇది ఉదాహరణ. ఒక వ్యక్తి తన సంపూర్ణ సమర్పణ ద్వారా ఇంత చేయగలిగినప్పుడు ఇటువంటి అనేకుల శ్రమ, సాధన ఎంత పెద్ద ప్రభావము చూపించగలదో, ఎంత గొప్ప గొప్ప సఫలతలను పొందగలదో దాని గురించి ఊహించుటకు ఎవ్వరికీ కష్టము కాకూడదు.

సాహిత్యక్షేత్రములో స్థిరవిలువలను ప్రతిపాదించగలిగే పుస్తకముల అవసరము చాలా ఉన్నది. శాంతికుంజ్ ద్వారా మరియు యుగనిర్మాణయోజన ద్వారా సుమారు 2500 కంటే ఎక్కువ పుస్తకములు యుగసాహిత్యముగా ముద్రింపబడ్డాయి. ఇవన్నీ వ్యక్తి, కుటుంబ, సమాజము యొక్క భిన్న-భిన్న సమస్య లకు పరిష్కారము చూపిస్తూ వ్రాయబడ్డాయి. దేశము యొక్క విభిన్న భాషలలో ఇవి అనువదించబడ్డాయి. పుస్తకముల యొక్క మూల్యనిర్ధారణలో ఒకే నీతి అవలంబించబడుతున్నది. లాభము వద్దు - నష్టము వద్దు (No Profit - No Loss) బీద దేశములలో - కుగ్రామాలలో ఉన్న పాఠకుడు ఖరీదైన పుస్తకముల లాభము పొందలేడు. యుగసాహిత్య ప్రచారమునకు ఒకే ఆధారము ఏమిటంటే ఎవరు చదివినా వారు దానిని ఇతరులచేత చదివించారు - మరియు దానిని కొనుక్కునేందుకు ఉత్సాహపరిచారు. "సంచీపుస్తకాలయమును" భుజముల మీద వేసుకొని పాఠకులు తమకు తెలిసిన ప్రదేశములకు వెళ్తున్నారు. ఇతరులకు పుస్తకములనిచ్చి చదివించి మళ్ళీ తిరిగి వెనక్కి తీసుకుంటారు. ఎవరైనా ఉత్సాహము చూపిస్తే వాటిని అమ్ముతారు కూడా! ఈ కార్యక్రమము విశుద్ధ సేవాభావనతో చేయబడుతుంది. అందువల్ల ఎవరికీ అందులో భాగము (కమీషన్) ఇవ్వటము లాంటి తలనొప్పులుండవు. క్రైస్తవ మిషనరీలు మరియు కమ్యూనిష్టు ప్రచారకులు తమ సాహిత్య మును సాధారణముగా ఈవిధముగానే విస్తరింపజేస్తారు.

ఈ పంక్తులు వ్రాసే రచయిత స్వయముగా పత్రికలు, పుస్తకములు ఎంత గొప్ప క్రాంతిని లేవదీయగలవో కళ్ళారా చూశాడు. ఒక వ్యాపకక్షేత్రములోని వ్యక్తులు గొప్పగొప్ప పనులు చేయటానికి ప్రేరణనిచ్చి విభిన్న భాషలలో విభిన్నప్రదేశాల ఆలోచనలను మథించి సంవర్ధన చేయుట కొరకు ఈ పుస్తకముల ద్వారానే మహత్త్వపూర్ణమైన సూచనలు, కార్యాచరణ పద్ధతులు అందజేయబడుతున్నవి. ఈవిధముగానే విస్తృతమైన మార్పులకు ఆధారము లభిస్తుంది.

యుగపరివర్తనకు రెండవ మహత్త్వపూర్ణ ప్రయత్నము - వాణి లేదా వాక్కును ఉపయోగించుట. సత్సంగములు, ప్రవచనములు, సామూహిక చర్చలు, సభలు, ఆలోచనలు ఇచ్చి పుచ్చుకోవటాలు, సమావేశములు, శిబిరాలు మొదలైనవి ఈ కోవలోకే వస్తాయి. శాంతికుంజ్‌లో చాలా కాలమునుండి సంవత్సరములో ఒక్కొక్క నెలపాటు జరిగే యుగశిల్పి శిబిరములు మరియు 9, 9 రోజులపాటు జరిగే సంజీవనీవిద్య యొక్క ప్రతిభా సంవర్ధన శిబిరములు నడుస్తూ ఉన్నవి. వీటిలో ఇప్పటికి 5 లక్షలకంటే ఎక్కువమంది వ్యక్తులు పాలుపంచు కున్నారు. ఒక నెలపాటు జరిగే యుగశిల్పిశిబిరములో ప్రచార కుడిగా పనిచేయగలిగే యోగ్యత అందజేయబడుతుంది. తేలికైన సంగీతమును, సులభముగా నేర్చుకునే సంగీత వాయిద్యములు,

**ఇతరుల మీద ఆధారపడకండి, మీ కాళ్ళ మీద మీరు నిలబడండి.**

కథలు, ప్రవచనాలు, Slides, Projecter, Video మొదలగు వాటి ద్వారా ఆదర్శవంతమైన క్రియాకలాపాలను వివరించుట, గోడలమీద ఆదర్శవాక్యములు వ్రాయుట, స్టిక్కర్స్ పంచిపెట్టుట, దీపయజ్ఞముల ద్వారా స్వల్పవ్యయముతో పెద్ద మరియు ప్రభావశాలీ కార్యక్రమముల విధివ్యవస్థలను, పరంపరలను ఏర్పరుచుట నేర్పబడుతుంది. శిబిరములలో పాలుపంచుకునే వారికి నివాసము, భోజనము, శిక్షణ, అవసరమయ్యే ఉపకరణములు మొదలగువాటికి సముచిత వ్యవస్థ ఇక్కడ ఉన్నది. తమ అభ్యాసము మరియు ప్రశిక్షణ ఆధారముగా ఈ ప్రచారకులు ఎక్కడకు వెళితే అక్కడ ప్రజా సమూహములను ప్రోగుచేసి వారిని ఉల్లాసపరచడము ద్వారా లోకకళ్యాణము మరియు జనజాగరణ అనే ఉద్దేశ్యాన్ని నెరవేరుస్తారు. ఏ విషయమును వారికి అర్థమయ్యేటట్లు చెప్పాలనుకుంటారో దానిని తేలికైన యుగసంగీతము ద్వారా చెప్తుంటారు. వేలసంఖ్యలో ప్రజలు కార్యక్రమాలు వినటానికి వస్తారు. ప్రతి సంవత్సరము సుమారు 3,500 మంది ప్రచారకులు ఈ శిబిరముల పద్ధతి ద్వారా ప్రశిక్షణ పొందుతారు.

సమయము అంతగా లేనివారు 9 రోజుల శిబిరములలో జీవన సాధన యొక్క సంజీవనీవిద్య జ్ఞానమును పొంది తమ మానసికస్థితిని వికసింపజేసుకొనుటకు వస్తారు. వారికి శిబిరములు వేరుగా నడపబడతాయి. వీటిలో పాలుపంచుకునే వారి సంఖ్య సాధారణముగా 500 నుండి 1000 మధ్య ఉంటుంది. ఈ కార్యకర్తలు కూడా తమ తమ క్షేత్రాలలో ప్రచారకులుగా పనిచేస్తారు.

– అనువాదం: డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ

---

## మిడిసిపాటు

*కమ్మరి కొలిమి, గాలినింపే కొలిమితిత్తి మధ్య ఒకసారి పోట్లాట వచ్చింది. కొలిమి మండిపడుతూ చనిపోయిన జంతువుల యొక్క అసహ్యకరమైన చర్మంతో తయారై కురూపిగా ఉండి చెడువాసన వేసే నీ వల్ల నాకు చాలా బాధ కలుగుతోంది. నా దారి నుండి తొలగిపొమ్మని తిట్ట సాగింది. కానీ కొలిమితిత్తికి కోపం రాలేదు. శాంతస్వరంతో నీ ముఖం యొక్క ఎర్రతనం నా నిరంతర ఉచ్ఛ్వాస, నిశ్వాసల యొక్క పరిణామం. నేనెప్పుడైనా విరక్తి చెంది, నా పని మానేసిన నీవు బూడిదగా మారిపోతావు అని పలికింది. సామాజిక జీవనం యొక్క నీతి కూడా ఇంతే. చాలామంది తామేదో గొప్పవారమని, తమ వల్లనే సంస్థలు, సమూహాలు నడుస్తున్నాయని, పాండిత్య అహంకారాలలో మునిగి ఉంటారు. కానీ ప్రజల స్నేహం నుండి వారి శ్రద్ధ నుండి క్షణం వంచించబడితే చాలు వారెందుకు పనికి రాకుండాపోతారు. తమ ప్రగతికి తమ గొప్పతనానికి కారణ భూతమైన వ్యక్తులకు, సమాజానికి తలవంచి నమస్కరిస్తున్నంత వరకే ప్రగతిపథంలో పయనం సునాయాసంగా సాగుతుంది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

## నేరం ఎవరిది?

*న్యూయార్క్ మేయర్ లగాడియా న్యాయశీలుడుగాను, సద్భావన సంపన్నుడుగాను ఖ్యాతిచెందాడు. ఒకసారి అతని న్యాయస్థానంలో రొట్టెలు దొంగిలించిన నేరానికి ఒక దొంగను ముద్దాయిగా ప్రవేశపెట్టారు. తట్టుకోలేని ఆకలి బాధ అతడిని నేరస్థుడి స్థితికి దిగజార్చింది. చట్టానికి గౌరవమిచ్చి లగాడియా ముద్దాయికి 10 డాలర్ల జుల్మానా విధించాడు. అతనితోపాటు కోర్టులో ఉన్న అందరి వద్ద నుండి 50 సెంట్లు చొప్పున జరిమానా వసూలు చేశాడు. కారణమేమిటని ప్రశ్నించగా "పేదరికం కారణంగా రొట్టెలు దొంగిలించవలసి వచ్చిన పరిస్థితులు నెలకొన్న సమాజంలో మీరు కూడా సభ్యులు కావటం వలన దీనికి మీరందరు బాధ్యులేనని" ఆయన తెలియజేశాడు. ఆవిధంగా ఆయన వసూలు చేసిన డబ్బుతోనే నేరస్థుడిని విడుదల చేసి మిగిలిన సొమ్ముతో అతనికి ఉపాధిని ఏర్పాటు చేశాడు. మహాపురుషుల జీవితాలలోని సంఘటనలు వివిధ విధాలుగా ఉండవచ్చు. కాని ఇలాంటి ప్రవృత్తే వీరిసంపూర్ణ జీవిత విధానాన్ని నిర్ధారణ గావిస్తుంది. వీరు పతన, పరాభవాలను కూడా ఇటువంటి ప్రవృత్తుల ఆధారంతోనే ప్రగతి, ప్రసన్నతలుగా మార్చి వేయటం ఎన్నో సందర్భాలలో మనం చూడగలుగుతాము.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**మహిళలను వేధించిన సమాజం మనజాలదు**

## సమయదానమే యుగధర్మము - 7

# ప్రామాణికత-ప్రఖరతలే సర్వత్రా అభీష్టము

నేటి పరిస్థితులను విశ్లేషించినట్లయితే మనం భ్రాంతులలో కాలం గడుపుతున్నట్లు తెలుస్తుంది. మానవీయ మర్యాదలను పాటించడం లేదని, దారి తప్పి ఉన్నామని అర్థమవుతుంది. ఈ రెండింటిని సవరించగలిగితే యుగ సమస్యలకు ఉపాయం దొరికినట్లే అని భావించవచ్చు. ఈ ఉపాయాన్ని క్రియాన్వితం చేసి ఎవరు చూపించగలరు? ఇలా ఆలోచిస్తున్నప్పుడు ఆశలు సమయదాన రూపంలో పరమ పురుషార్థం చేయగల వరిష్ఠ కార్యకర్తల పైకి వెళ్తాయి. వారు కఠోరశ్రమతో భావసంవేదనలను బాగా కలుపగలగాలి.

ఇది ఎవరు చేయగలరు? దీనికి సమాధానం మహాకాలుని శబ్దాలలోనే లభిస్తుంది. తమని తాము తపస్సుతో మేలిమి బంగారంగా మార్చుకుని, ఆలోచనలలో వ్యవహారములలో శ్రేష్ఠత్వం తెచ్చుకున్నవారే ఈ పనిచేయగలరు. ఈ పని అతి సరళమైనది, అతి కఠినమైనది కూడా. జీవనాన్ని బహుమూల్య దైవీవరదానంగా భావించి దానిని మంచిగా ఉపయోగించుకోవడం ఎలా అని ఆలోచించే వాడికి తేలిక. ఎవరిలో అయితే వాసనలు (కోరికలు), తృష్ణ, అహంకారం అనే మూడు జోరు జోరుగా చుట్టుముట్టి ఉంటాయో వారికి కష్టము.

భవబంధనములలో బంధించేవి మూడు ఉన్నాయి. వీటిని లోభమని, మోహమని, అహంకారమని అంటారు. కొన్నిచోట్ల తృష్ణ, వాసన, అహంతా (अहंता) అనే పేర్లతో పిలువబడ్డాయి. ఈ రెండు రకాల పేర్లు ఒకే సత్యాన్ని వేరు వేరు శబ్దములలో వ్యక్తపరచాయి. మొదటి బంధనము లోభము-తృష్ణప్రభావము వలన వ్యక్తిలో ధనము కూడబెట్టాలనే కోరిక తీవ్రంగా ఉంటుంది. దీనితోపాటు అతడు అనాచారాల పాలయి దాని ప్రభావముతో దుర్వ్యసనాల బారినపడతాడు. దీనివలన లౌకికమైన, పారలౌకికమైన రెండు రకాలుగా చిత్రవిచిత్ర అనర్థాలు ఎదురవుతాయి. సగటు పౌరుని స్థాయిలో జీవించటం ఎవరికి కష్టం కాదు. అతను కొన్ని గంటలు పని చేసి తనను పోషించుకోగలుగుతాడు. మిగిలిన సమయమును పుణ్య పరమార్థ కార్యములలో సదుపయోగం చేయగలుగుతాడు.

కొంతమంది సంపాదించుకున్న ఆస్తులను అమ్మి ఆ డబ్బును బ్యాంకులో వేసుకుని లభించిన వడ్డీని ఇంటి ఖర్చు కొరకు ఉపయోగించుకుంటారు. ఈవిధంగా ఇంటి ఖర్చును సులభతరం చేసుకుంటారు. పూర్వకాలంలో ఆర్జనాపరులు ఇంటిలోని ఒక వ్యక్తిని పరమార్థ ప్రయోజనముల కొరకు సమర్పించేవారు. అలాంటి గౌరవనీయమైన పద్ధతులు నడుస్తుండేవి. సత్యయుగంలో బ్రాహ్మణ పరివారంలో ఒక సదస్యుడు పరివ్రాజకుని వలె సేవాసాధనలో తిరుగుతుండేవాడు. ఈనాటి ఆలోచనలను కొంచెం మార్చుకుంటే తిరిగి అలాంటి వ్యవస్థ క్రొత్తవిధంగా తయారుచేసుకోవచ్చు.

రెండవ భవబంధనం భార్యబిడ్డలు. వీరు ఇంటి పెద్దపై ఆధారపడి ఉంటారు. పరివారం పెద్దదిగా ఉంటే దాని భారం మోయడం కష్టమైన పని. సమయమంతా దానికే సరిపోతుంది. ఎప్పుడైన మార్పు కొరకు పరమార్థ కార్యక్రమాలు చేయగలుగుతారు. కుటుంబం చిన్నదయితే పరమార్థ కార్యక్రమాలకు వీలవుతుంది. భార్య భర్త కలసి పనిచేస్తే 1+1=2 కాక 1+1=11 లాగా ఫలితములు వస్తాయి. పిల్లలను ధనవంతులుగా చేయాలనే కోరిక జీవనతత్త్వం యొక్క రసాన్ని పీల్చి పిప్పిచేస్తుంది. వాసన యొక్క ప్రతిఫలమే ఈ విషఫలము. వివాహం అయి ఇంకా పిల్లలు కలుగని పరిస్థితులలో పరమార్థ కార్యక్రమాలకు కొంచెం వీలవుతుంది. కానీ ఆ ఆకర్షణ పెరిగిపోతుంటే శ్రమ, మనోయోగము ఆ ప్రయోజనం కొరకే ఉపయోగపడతాయి.

పరివారాన్ని స్వావలంబులుగా, సుసంస్కారవంతులుగా చేసే లక్ష్యం పెట్టుకుంటే వివాహం బంధనంగా మారదు. అది నెత్తిన భారమయి కూర్చోదు. పిల్లలను గొప్పవారిగా చేయాలి, ధనవంతులుగా చేయాలి అంటే పరిస్థితులు వేరుగా ఉంటాయి. ఏది ఏమి అయినప్పటికీ ఖర్చు తగ్గించుకోవడం అవసరము. పరివారం అనే ఉద్యానవనంలో ఉంటూ బాధ్యతల నిర్వహణ అనే శిక్షణ పొందవచ్చు. కానీ ఇది చేతికి సంకెళ్ళ వలే కాకూడదు. కుటుంబం తప్ప ఆలోచించడానికి చేయడానికి ఇంకేమి లేదు అనే పరిస్థితి రాకూడదు.

ప్రాచీనకాలంలో లోకసేవకులు ప్రత్యేకమైన ఆలోచనలతో, నడవడికతో భావపూర్వకమైన ఉత్కృష్టత నింపుకునే ఆధ్యాత్మిక ప్రయత్నాలలో నిరంతరం ఉండేవారు. వారే దేశం యొక్క మానమర్యాదలను ఉచ్చశిఖరంపై ఉంచే ప్రయత్నం చేసేవారు,

**పిల్లలను ప్రేమించడం అంటే వారిని ఆదర్శంగా తీర్చిదిద్దడం**

దాని శ్రేయస్సు పొందేవారు. ఈరోజులలో ఆదర్శవాద ఆకాంక్షలు మరుగునపడిపోయాయి. తమ జీవనచర్యలో ఇతరులకు ఉపయోగించే విషయములు చెప్పే ప్రాణవంతులు వెతికినా కనిపించడం లేదు. మాటలు చెప్పేవారు మునుపటి కంటే ఎక్కువయ్యారు. కానీ వారి మాటలకి చేతలకి పొంతన ఉండదు. అందువలన వారి మాటలకు విలువ లేక, ఆ మాటలను పట్టించుకునేవారు ఉండరు. అందువలన పరమార్థ విషయములపై శ్రద్ధ లేకుండా పోయింది.

మూడవ ఆటంకము - అహంకారము. సమాన స్థాయి గల సజ్జనులతో తమ అహంకారాన్ని నమ్రతతో నింపుకోవాలి. ఇతరులతో వ్యవహారములో సంభాషణలలో ఆదరాభిమానాలు ఉప్పొంగాలి. మంచి సంబంధాలు ఉంచుకోవాలనుకుంటే ఇంతకన్నా మంచి అవకాశం దొరకదు. అహంకారుల ప్రవర్తన దీనికి తల్లక్రిందులుగా ఉంటుంది. వారు తమ గొప్పదనాన్ని డప్పు కొట్టుకుంటారు. ఇతరులను తక్కువగా చేస్తూ తాము చాలా గొప్పవారిగా చెప్పుకునే ప్రయత్నం చేస్తుంటారు. దీని పరిణామం ఎలా ఉంటుందంటే అప్పటిదాకా మామూలుగా ఉన్న సంబంధం చెడుతుంది. వీడికి గర్వం ఎక్కువయింది అని దూరంగా ఉంటారు, ఎవరి దగ్గర నుండి స్నేహ సన్మానాలు పొందజాలరు. తమ పనులు నెరవేర్చుకొనుటకు ముఖస్తుతి చేసేవారు తప్ప వారి మిత్రులుగా ఎవరు ఉండరు. ఇటువంటి వారు మంచి సంస్థలలో కూడా తమను గొప్పవారిగా అనిపించు కోవడానికి అనేక కలహములను లేవదీస్తారు. చివరకు ఆ సంస్థనే నాశనం చేస్తారు.

యుగసాధనలో సఫలత్వం కొరకు లోభము మోహము, అహంకారము ఎంత తగ్గించుకొనగలిగితే ఎంత యోగ్యుడిగా తయారవుతాడంటే ప్రజలు అతనిని ఆదరభావముతో చూస్తారు. అతను చెప్తున్న విషయములు తమ మంచికేనని అర్థం చేసుకుంటారు, స్వీకరిస్తారు.

ఈరోజులలో సేవచేయడానికి అనేక క్రియాకలాపాలు ఉన్నాయి. స్వాస్థ్య (ఆరోగ్య) సంరక్షణ కొరకు చేయవలసినవి చాలా ఉన్నాయి. సౌకర్యాల అభివృద్ధిని కూడా కలుపుకోవాలి. కానీ ఇంతకన్నా మహత్త్వపూర్ణమైనది ఏమిటంటే వ్యక్తి ఉత్కృష్ట ఆలోచనాసరళిని అభ్యాసం చేసుకోవడంతోపాటు తన సమస్యలను తానే పరిష్కరించుకోగలగాలి, తన కాళ్ళ మీద తాను నిలబడ గలగాలి, లేకపోతే ఇతరుల మీద ఆధారపడవలసి వస్తుంది. ఆంతరిక దృష్టిలో కూడా దీనుడిగా, హీనుడిగా తయారవుతాడు. దేవతల నుండి, శ్రీమంతుల నుండి ప్రాధేయపడి ఏదో కొంత పొందడం కొరకు పద్ధతులను వెతుక్కుంటు ఉంటాడు. స్వాభిమానం స్వావలంబనం దృష్టిలో ఇది మంచిది కాదు.

గుణకర్మ స్వభావములు, ఉత్కృష్టతలే వాస్తవికమైన సామర్థ్యం. దీని ద్వారా వ్యక్తి విశ్వాసపాత్రుడిగా, కర్తవ్యపరాయణుడిగా తయారవుతాడు. అతను ఎక్కడకు వెళ్ళినా గౌరవం లభిస్తుంది. అతనిని సమర్థించేవారు, సహకరించేవారు సహజంగానే దొరకుతారు.

21వ శతాబ్ద అవతరణలో భగీరథుని వంటి తపస్వీ వ్యక్తుల అవసరం ఉన్నది. ఎవరైతే మానవీయ సద్గుణములను అభ్యాసం చేస్తారో వారు దేవోపమ విశేషతల క్షేత్రంలోకి ప్రవేశం పొందుతారు. ఎవరైతే ఇతరుల అవగుణములపై గెలుపు సాధించారో వారిని వీరులు అంటారు. కానీ ఎవరైతే తనను తాను జయించాడో అతనిని మహావీరుడని అంటారు. అటువంటి మానవులే హనుమంతుని స్థాయి వ్యక్తుల రీతి-నీతి తనదిగా చేసుకుని ఆదర్శములనే భగవంతుని రూపంగా భావిస్తారు. అతను జనులకు ఆదర్శంగా నిలుస్తాడు, శ్రద్ధకు మారుపేరుగా తలుస్తారు. దైవీ అనుగ్రహం నిరంతరం అతనిపై వర్షిస్తూనే ఉంటుంది. అతని పురుషార్థం తక్కువ కాదు కానీ అది సఫలం చేయడానికి అదృశ్యలోకం నుంచి ఎంత అనుదానం వర్షిస్తుందో, అది ఎంత మహత్వం కలిగినదో అంచనా కూడా వేయలేము.

నాణ్యమైన బంగారానికి పూర్తి విలువ లభిస్తుంది. మరి దానిని బంగారం దుకాణానికి ఎందుకు తీసుకువెళ్ళటం లేదు? చెల్లని నాణాన్ని ఎవరు తీసుకోరు. అది నకిలీదని అంధుడైన బిచ్చగాడు కూడా చెప్పగలడు. పెద్ద పెద్ద పనులు చేయాలంటే, పెద్ద పెద్ద బరువులు మోయాలంటే పెద్ద ఏనుగులు కావాలి. 21వ శతాబ్దంలో ఒకదానిని మించిన ఒక బరువైన పనులు, మహత్త్వపూర్ణమైన కార్యములు జోడించబడి ఉన్నాయి. వాటిని సాధించడానికి మనోబలం అధికంగా ఉన్నవారు, మంచి నడవడిక గల మూర్ధన్య వ్యక్తులు (మేధావులు) కావాలి, వారికోసమే వెతుకు తున్నాము. ప్రతిభా పరిష్కార్ (వికసించిన ప్రతిభ) కార్యక్రమం ఈ దృష్టితోనే నడుపుతున్నాము. ఈ కార్యక్రమములలో తపించి బయటకు వచ్చే వ్యక్తి కేవలం తనను తాను వరిష్ఠ జనులలో లెక్కవేసుకొనే విధంగా కాకుండా ఇతరులను కూడా లేవనెత్తి ముందుకు నడపటంలో కూడా తమ ప్రత్యేకతను చూపించగలడు.

*- అనువాదం: ముక్కామల రత్నాకర్*

**రేపు మనదే అనుకుని ముందుకు సాగాలి**



# మేధా యజ్ఞములు

యజ్ఞ సాంప్రదాయంలో మేధ యజ్ఞాలకు చాలా విశిష్టమైన స్థానమున్నది. కాలానుగుణ్యముగా వేరు వేరు కాలములలో దానిని వేరువేరుగా వివరించారు. ధర్మం గురించిన అవగాహన లేనివారు 'మేధా' అనే పదానికి బలి ఇచ్చుట అనే అర్థము తీసుకుని తమ స్వార్థానికే ఉపయోగించుకోవడమే కాకుండా, మహత్త్వపూర్ణ యజ్ఞప్రక్రియపై కళంకాన్ని ఆపాదించారు. వేద విజ్ఞానం యొక్క మర్మము తెలుసుకోలేని వ్యక్తులు ఈ తప్పుడు వ్యాఖ్యలను విని దారి తప్పారు. వేద వాఙ్మయములో 4 రకాలైన యజ్ఞాలు ప్రచారంలో ఉన్నాయి. అవి సర్వమేధము, నర మేధము, గోమేధం, అశ్వమేధము.

**నరమేధము:** నరమేధమంటే రకరకాల సంపత్తులుంటాయి. శారీరికమైనవి, ఆధ్యాత్మికమైనవి, కుటుంబపరమైనవి. ఈ సంపత్తులన్నీ ఏ లక్ష్యం అయితే చాలా ముఖ్యం అనుకుంటారో, వాటి కొరకు వినియోగించడం నరమేధం. వాళ్ళు నమ్మిన సిద్ధాంతానికి ప్రాణం ఇచ్చేందుకు కూడా సిద్ధమే. ప్రపంచమంతా ఏమయినా అనుకోని అనే దమ్మున్న వ్యక్తులు నరమేధంలో పాల్గొంటారు. నరమేధం అనేది స్వయముగా చేసుకునే యజ్ఞం. కుటుంబ సభ్యులకు కూడా ఏ సంబంధం లేదు. వ్యక్తి తనని తాను ఒక లక్ష్యానికి సంపూర్ణముగా సమర్పణ చేసుకుంటాడు. ఆ లక్ష్యం ఏదైనా కావచ్చు. ఒక స్మగ్లర్ ఉన్నాడు. ఎన్ని కష్టాలు వచ్చినా సరే తాను చేర్చదలచుకున్న వస్తువులు ఎక్కడికి చేర్చాలో అక్కడికి చేరుస్తాడు. ఆ మానసిక స్థితి ఉంటే రేపు ఆ స్థితే వాడిని వాల్మీకిగా మారుస్తుంది. స్మగ్లింగ్ కార్యకలాపాలకు వినియోగించే నరమేధస్సును ఆధ్యాత్మిక క్రియాకలాపాలకు ఉపయోగించుకుంటాడు. ఆదర్శం అంటే లక్ష్యం ఉండాలి. ఆ లక్ష్యాన్ని ఒక నియమిత కాలములో సాధించాలి. దానినే అనుష్ఠానం అనవచ్చు. అనుష్ఠానం అంటే ఒక నియమిత కాలంలో శాయశక్తులు ఉపయోగించి చేసే ప్రయత్నం. ఆదర్శం కోసం ఎప్పుడు వెళ్తామో, అప్పుడు అన్ని బాధ్యతలు వదిలి వేయవచ్చు. కానీ మీరు వేసే ప్రతిఅడుగు ఆదర్శం వైపుకే వెళ్ళాలి. వెళ్తున్నప్పుడు సమాజం ఏమంటుంది? పక్కవాడు ఏమనుకుంటాడు? ఇటువంటి ప్రశ్నలు మిమ్మల్ని ఏమీ చేయవు. కానీ అవి మిమ్మల్ని ప్రభావితం చేశాయి అంటే మీకు ఆదర్శం వైపు దృష్టి లేదు. నరమేధం అనేది ఒక గాంధీ, ఒక హిట్లర్, ఒక ముస్సోలిని, ఒక కార్ల్‌మార్క్స్, అందరు గొప్ప నాయకులు, మన ఋషులు వీరందరు మొదట నరమేధం చేసుకున్న వారే.

**నరమేధము అంటే వ్యక్తిగత జీవనములో ఆదర్శవంతమైన జీవితము మాత్రమే జీవిస్తాను, మిగిలినవాటికి ఏవిధమైన ప్రాముఖ్యత ఇవ్వను అనేటటువంటి నిర్ణయాన్ని ఆచరించడం. నరమేధం అంటే తపస్వీ జీవనము. తపస్వీ జీవనం అంటే సమయ సంయమము, ఇంద్రియసంయమము, వాక్ సంయమము, అర్థసంయమము. అదీ తపస్సు అంటే. సమయాన్ని దేనికి ఖర్చు చేయాలి? ఇంద్రియాలని దేనికి వెచ్చిస్తారు? వాక్‌ని దేని కొరకు ఉపయోగిస్తారు? సంపత్తిని దేనికి ఉపయోగిస్తారు? ఈ నాలుగు ఉపయోగించుకుంటే తపస్సు అవుతుంది.** అలవాటుపడిన స్వార్థము, లోభము, మోహము మొదలైన కుసంస్కారములను వదిలివేసి, పుత్రేషణ, విత్తేషణ, లోకేషణ అనేటటువంటి కోరికల నుంచి మనస్సును త్రిప్పుకోవాలి. మనము చేసే ప్రతి పని ఈ నాలుగు స్తంభాల మీద అనగా సమయ సంయమము, ఇంద్రియ సంయమము, వాక్ సంయమము, అర్థ సంయమము అనే వాటిమీద ఆధార పడి ఉండాలి. **దీనికొరకు టైమ్‌టేబుల్ వేసుకోవాలి.** ఉదారత్వం బాగా ప్రాక్టీసు చేయాలి. దీనివల్ల ప్రేమ, అందరు నా వాళ్ళే అనే భావన ఎంత ఎక్కువ పెంచుకుంటే అంత మంచిది. అంతరాళములో ఆదర్శం కొరకు శ్రద్ధ ఎక్కువ చేసుకోవాలి. ఇదంతా నరమేధమే.

పూర్వకాలము నుంచి మనము తెచ్చుకున్న కుసంస్కారాలు, ప్రారబ్ధకర్మలు, సంచితకర్మలు, మనలను క్షుద్రత్వం వైపుకి తోస్తాయి. మనలను ఋషులు చెప్పిన మార్గములో వెళ్ళనివ్వవు. ఇంకా స్వజనులు, ఆత్మీయులు, సమాజము ఈ మార్గములో వెళ్ళడానికి ఒప్పుకోవు. **అతి తక్కువ తన కోసం ఉంచుకుని, తన సమస్తవనరులను రాష్ట్ర ప్రయోజనముల కొరకు ఉపయోగించే**

**జయం మనదే అనుకుని ముందుకు నడవాలి**

**వ్యక్తిని అశ్వమేధం చేశాడంటాము.** ఈ మానసిక స్థితి కలిగిన వాళ్ళందరు కలసి చేసే ప్రయత్నమే అశ్వమేధ మహాయజ్ఞము.

**గోమేధము అంటే వాక్‌శక్తిని మందులాగా వినియోగించడం.** నిద్రపోతున్న సత్‌ప్రవృత్తులను జాగృతం చేసేందుకు స్వాధ్యాయం, దానికి కావలసిన శిక్షణ, కౌశలత్వాన్ని పెంచుకోవడం, ఏదో ఒక విద్యలో నైపుణ్యం సాధించడం ఇదంతా గోమేధ యజ్ఞాలే. వీరందరు అద్భుతమైన దైవీ ఆలోచనలతో జీవించవచ్చు అని సమాజానికి ఉదాహరణగా నిలుస్తారు.

యజ్ఞం అనేది ఒక కర్మకాండ మాత్రమే. స్థూలముగా కనిపించే క్రియ మాత్రమే. ఏ యజ్ఞం చేస్తున్నామో తెలియ చేయడానికి ఘోషణ చేసేవారు, నేను నరమేధం చేస్తున్నాను, నేను సర్వమేధం చేస్తున్నాను. నేను అశ్వమేధం చేస్తున్నాను అని. ఈ మానసిక స్థితిలో జీవిస్తున్నాము అని తెలుపుటకై ఈ ఘోషణ చేసేవారు. అందువల్ల అశ్వమేధం జరిగే ముందు ఆ మానసిక స్థితిలోకి వెళ్ళిపోవాలి. తపశక్తి సంపన్నులయిన మహర్షులు సామూహిక ఆయోజనాలలో వ్యక్తులకు ప్రేరణ, దిశానిర్దేశం చేస్తుంటారు.

మనము చేబట్టుకున్న సాప్తాహిక కార్యక్రమము మూర్ధన్యు లైనటువంటి ఋషులు చేసే కార్యక్రమమే. సాధారణ కార్యక్రమము కాదు. సర్వమేధం, నరమేధం, గోమేధం యజ్ఞాల ఫలశ్రుతిగా అశ్వమేధం చేస్తాము. ఈ యజ్ఞముల యొక్క సైకాలజీ అర్థం చేసుకోవాలి. **గోమేధం-వాక్కు యొక్క శక్తి సామర్థ్యములు, నరమేధం-ఆదర్శానికి అంకితమైన జీవనము, సర్వమేధం-ఉన్నది అంతా సమాజానికి, ఆదర్శానికి అంకితం చేయుట. ఈ మూడింటి కలయిక అశ్వమేధముగా పరిణతి చెందుతుంది.**

**మేధాయజ్ఞాలు తెలియకుండా చేస్తుంటారు.** కుటుంబములో కుటుంబ పెద్ద సర్వమేధానికి లోనవుతాడు. విద్యార్థులందరు గోమేధానికి లోనవుతారు. గోమేధం అంటే విశేష ప్రతిభను తెచ్చుకొనుటయే. ఆఫీసులో బాగా పనిచేస్తున్నవాడు ఆఫీసుకు బలైపోతాడు. ఏదో పోస్ట్‌కో, లక్ష్యానికో. అదే నరమేధం. ఇంట్లో పని చేసే వాళ్ళందరు చేస్తూనే ఉంటారు నరమేధం. మేధా యజ్ఞాలు ప్రకృతిలో ఉంటాయి. యజ్ఞాలు ఏవీ క్రొత్తగా కనిపెట్టబడినవి కావు. వాటిని శాస్త్రీయ పద్ధతిలో ఋషులు అవగాహన చేసుకుని వాటి యొక్క దిశ మార్చారు.

**రాజసూయ యజ్ఞం :** రాజసూయ యజ్ఞం అశ్వమేధ యజ్ఞం యొక్క ఒక రూపాంతరణ. రాజులందరు ఒకే క్షేత్రములో అనేక సంవత్సరాల తరబడి రాజ్యం చేయడం వల్ల వాళ్ళు నియంత్రణ నుంచి తప్పవచ్చు. ఈ రాజసూయ యజ్ఞము రాజుల మీద నియంత్రణే. **యు.ఎన్.ఓ.** (U.N.O.) రాజుల మీద నియంత్రణ కొరకు ఋషులు సంకల్పించినది. మెల్లిమెల్లిగా **యు.ఎన్.ఓ.** అన్ని దేశాల పగ్గాలను తన చేతిలోకి తీసుకొనక పోతే ఈ పరిస్థితులు ఇలాగే ఉంటాయి. ఆ పగ్గాలు **యు.ఎన్.ఓ.** లాంటి సంస్థ తీసుకొనడానికి చేసే ప్రక్రియ అశ్వమేధయజ్ఞం, ఆధ్యాత్మికమైన ప్రక్రియ.

ఒకప్పుడు కమ్యూనిజం ఆలోచనలు ప్రచారంలో ఉండేవి, క్యాపిటలిజమ్ ప్రచారంలో ఉండేది. ఇప్పుడు ఏ ఇజం ప్రచారంలో లేదు. కేవలం స్వలాభాపేక్ష మాత్రమే ఉన్నది. ఏ క్షణములో ఏది లాభమో ఆ పని చేస్తాము. అందుకే రాజకీయాలలో భిన్నమైన లక్ష్యములు గల వ్యక్తులు కూడా కలిసిపోగలుగుతున్నారు. కలిసిపోతే మనకి ఆశ్చర్యం కూడా వెయ్యటం లేదు. ఎందుకంటే మనము అలాంటివాళ్ళమే. యథా ప్రజా తథా రాజా. మనము మారి మన ఆలోచనలకు ఒక స్వరూపాన్నిచ్చి దానిని ఒక దిశలో ప్రవహింపచేయలేకపోతే ప్రపంచం ఇలాగే ఉంటుంది. మన చిన్న చిన్న శక్తిధారలు ఒక మహాశక్తి ధారగా మార్చే ప్రయత్నమే అశ్వమేధ యజ్ఞము.

**మన జీవితంలో ఆదర్శం లేదు, లక్ష్యం లేదు. తినడం, పడుకోవడం మాత్రమే ఉంది.** ఎందుకు జీవిస్తున్నాము అనే ఆలోచన రాని జీవితం నిస్సత్తువ, అందరికి నీరసాలే. సినిమాకి వెళ్ళమంటే మాత్రం నీరసం రాదు. పిచ్చి పనులకు, కబుర్లు చెప్పుకోవడానికి నీరసం రాదు. క్లాసులకి రమ్మంటే నీరసం. నీరసం అంటే రుచి లేకపోవడం. అది భౌతికమైన నీరసం కాదు. రసవిహీనమైన జీవితాన్ని జీవిస్తున్నాము. ఉత్సాహం లేదు. ఉత్సాహం ఉండాలంటే ఏదైనా లక్ష్యం ఉండాలి. ఏ ప్రయత్నం చేయకుండా పరీక్షలు పాస్ అవ్వాలి. ఏ ప్రయత్నం చేయకుండా ఉద్యోగాలు వచ్చేయాలి. అందుచేత **నీరసపు బ్రతుకులలో నుంచి బయటపడాలంటే మన జీవిత విధానానికి ఒక దిశ ఇచ్చుకోవాలి.**

**కష్టాలు ఎదురైనా, సహనంతో ముందుకుసాగితే సత్ఫలితాలు ఉంటాయి**

ఎవరి ఆలోచనలు బలంగా ఉన్నాయో, ఆ ఆలోచనలు దేశకాల వ్యవస్థరాజ్యం చేస్తూ ఉంటాయి. ఈరోజులలో ఏ పొలిటీషియన్ ఆలోచనా రాజ్యం చేయడం లేదు. ఏ వ్యాపారవేత్త ఆలోచనలు రాజ్యం చేయడం లేదు. ఓ షిరిడి సాయి, ఓ సత్యసాయి, ఓ సి.వి.వి., ఓ శ్రీరామశర్మ ఆచార్య వీళ్ళ ఆలోచనలు ప్రపంచంలో వస్తున్నాయి అనడానికి ఋజువు వాళ్ళ దేవాలయాల నిర్మాణమే. మన ఆలోచనలు వీరి ఆలోచనా ప్రవాహంలో కలిపేసుకోవాలి.

**గురుసత్తా ఆలోచనా విధానాన్ని "ఒకే ప్రపంచము, ఒకే ధర్మము, ఒకే భాష" అనేదాన్ని పదిమంది నోళ్ళలో పడ నివ్వండి.** "ఒకే కరెన్సీ" (వినిమయ సాధనము) – యూరప్‌లోని దేశాల కరెన్సీలు, యూరో కరెన్సీకి మార్చే ప్రయత్నం జరుగుతున్నది. అలాగే అన్ని దేశాలలో చలామణి అయ్యే కరెన్సీ(డబ్బు) రావాలి. ప్రపంచం ఆ దిశలోనే వెళ్తున్నది. దానికి "ఒకే శక్తి" అయిన సూర్యశక్తిని ఉపయోగించుకోవడం నేర్చుకోవాలి. ఇది వద్దనేవాళ్ళు ఎవరయినా ఉంటారా? కచ్చితంగా ఈ కాలంలో ఉండరు.

మనం పురుగులుగా జీవిస్తే మాత్రము ఆ ప్రవాహంలో ఉండము, మహాకాలుడు ఉండనివ్వడు. రకరకాలైన బాధలు, రోగాలు రావడానికి కారణం ఇదే. అర్థవిహీనమైన జీవితము, పురుగుల లాంటి జీవితము జీవిస్తే, పురుగులు మన మీదకి రాక ఏమి చేస్తాయి. **ఆంత్రాక్స్ అనే పశువులకి వచ్చే రోగం మనుష్యులకి వస్తున్నది.** ఎందుకు వస్తుందో సమన్వయం చేసుకోలేని మానసిక స్థితిలో ఉన్నాము. **నువ్వు పశువులాంటి జీవితం జీవించడం మానేయి. అది నీ జోలికి రాదు.** నీ ఆలోచనల వల్లే నీవు రోగగ్రస్తము అవుతున్నావు. ఆలోచనలు ఆహారం వల్ల వస్తాయి. తిరిగి తిరిగి ఆహారానికే వస్తాము.

**మేధా :** మేధా అంటే ధారణ చేస్తున్నాను. నా మేధస్సులో ధారణ చేస్తున్నాను. మూడు రకాల మేధస్సులు చెప్తున్నారు. 1) గోమేధము, 2) నరమేధము, 3) సర్వమేధము. ఈ మేధా యజ్ఞాలను ఈ విధంగా కూడా చెప్పుకొనవచ్చు.

**గోమేధము :** గోమేధము అంటే సహజమైన జీవితము (నాచురల్ లైఫ్). చిన్నపిల్లవాడు మాటలు రానంతవరకు ఇంద్రియముల మీద బతుకుతాడు. అమాయక జీవితం అది (ఇన్నోసెంట్ లైఫ్). ఆవుని పవిత్రతకి చిహ్నంగా చెప్తారు. మోస్ట్ ఇన్నోసెంట్ లైఫ్. గోమేధము అంటే అది. 6, 7 సంవత్సరాలు వచ్చేంతవరకూ తన జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను పటిష్టం చేసుకుంటాడు. (ప్రకృతిలో 7 అనే సంఖ్యకు చాలా ప్రాముఖ్యత ఉన్నది). ఇంద్రియముల ద్వారా వచ్చేదానిని, మేధలో ధారణ చేస్తాడు. బాహ్య వాతావరణానికి స్పందించడం మొదలుపెడతాడు. 7 సంవత్సరాల వరకు ఇతర చిన్నపిల్లల వలే, ఇతర జీవజంతువులవలే ఆడుకుంటూ, పాడుకుంటూ ఉంటాడు. వాడికేమి బాధ తెలియదు. బాధ్యత తెలియదు. తల్లిదండ్రులు ఎందుకు బాధపడుతున్నారో తెలియదు. తల్లిదండ్రుల వద్ద సంరక్షణ ఉందని తెలుసుకానీ, ఆ కుటుంబంలో భాగముగా జీవించడు. ఇంద్రియాలు, వాక్‌శక్తి 7వ సంవత్సరం వరకు అభివృద్ధి చెందుతాయి.

**నరమేధం :** అక్కడ నుంచి వ్యక్తిత్వం మొదలవుతుంది. నాకు అది నచ్చుతుంది, నాకు ఇది నచ్చదు, నేను మనిషిని, నాకీ కోరికలు ఉన్నాయి, నేను ఈ కుటుంబంలో ఉన్నాను, నేను ఈ గురువు శిష్యుడిని అని అనడం మొదలుపెడతాడు. ఇదే నరమేధము. ఒక (పర్సనాలిటి) వ్యక్తిత్వం పెంపొందుతుంది. ఇది నాది, ఇది బయటివాళ్ళది అని. ఈవిధమైన ధారణ నరమేధము. ఇది 14వ సంవత్సరం వరకు ఉంటుంది.

**సర్వమేధము :** 14, 15 సంవత్సరాల నుండి హార్మోన్స్ ఉత్పత్తి కావడం, ఫ్యామిలీ జీవితానికి కావలసిన పరిస్థితులు మొదలవుతాయి. ఇది సర్వమేధము. వాడి కోసం వాడు బ్రతకడు. పిల్లల కోసం బతుకుతాడు. ఎక్కువ లాభం వచ్చే పనులు, ప్రయత్నాలు చేస్తాడు. ఇది 21వ సంవత్సరం వరకు జరుగుతుంది. ఈ సంఖ్య చాలా ముఖ్యమైనది. దీనిని అవగాహన చేసుకోవాలి.

ఈ మూడు యజ్ఞాలు వేరువేరుగా చేయనవసరం లేదు. సహజముగా జరిగిపోతాయి. గోమేధములో జంతు అమాయకత్వము (యానిమల్ ఇన్నోసెన్స్) నుంచి ఇంద్రియాలకు వాక్ శక్తిని అభివృద్ధి చేసుకుని, నరమేధములో మనిషిగా మారిన తరవాత 14వ సంవత్సరం నుంచి ప్రొక్రియేషన్ హార్మోన్స్ సెక్రిషన్స్ ఎలా మారతాయో స్టడీ చేయాలి. గోమేధము, నరమేధము, సర్వమేధము తరవాత అశ్వమేధము జరుగుతున్నది. అశ్వమేధాన్ని ఒక యూనివర్సల్ కాన్సెప్ట్‌గా అభివృద్ధిపరిచే

**కష్టాలకు ఎదురు నిలవాలి**

మేధ ఇప్పుడే ఉన్నది. 5 వేల సంవత్సరాల వెనుక ఈ మేధ లేదు. దానిని 5 వేల సంవత్సరాల క్రిందట దర్శించే పరిస్థితి లేదు.

**అశ్వమేధము అంటే బుద్ధిబల శారీరిక బలముల కలయిక:** అంటే కండరాల శక్తి, మెదడు శక్తి ఇంటిగ్రేట్ అవ్వాలి అంటే బుద్ధిబలం, శారీరిక బలం కలవాలి. గంటసేపు జపం చేయాలని ఉంటుంది. కానీ శరీరం సహకరించదు. కాళ్ళు నొప్పులు, శరీరం చాల్లే అంటుంది. శరీరం లొంగేటట్టు చేసే ఇంటిగ్రేటెడ్ కాన్సెప్ట్ అశ్వమేధం. అశ్వమేధం హిందువులు మాత్రమే ఆచరించే కర్మకాండ కాదు. ప్రకృతిలో జరుగుతున్నదే. బుద్ధిబలం, శారీరిక బలం యొక్క పరాకాష్ఠే బాహ్యజగత్తులో కనిపించే యుద్ధాలు. ముస్లీం దేశాలు, క్రిస్టియన్ దేశాలు కొట్టుకున్నట్టు కనిపిస్తాయి. దీనికి హిందువుల జ్ఞానం ఉపయోగ పడుతుంది. హిందూ కాన్సెప్ట్ అంటే హిందువులు కనుగొన్న కాన్సెప్ట్. హిందువులు ప్రకృతిలో కనుగొనిన నియమాలు. న్యూటన్స్ లా అంటే బ్రిటీష్ లా అవుతుందా? ఐన్‌స్టీన్స్ లా అంటే జ్యూస్ లా (Jew's Law) అవుతుందా? ఐన్‌స్టీన్ ఒక జ్యూ (యూదుడు). **న్యూటన్ ప్రకృతిలోని గురుత్వాకర్షణ నియమాలను కనుక్కున్నాడు. ఆ నియమాలకు న్యూటన్ పేరు పెట్టారు.** ఐన్‌స్టీన్ ప్రకృతిలోని సాపేక్ష సిద్ధాంతాన్ని (థియరీ ఆఫ్ రిలేటివిటీ) కనుక్కున్నాడు. ప్రకృతిలో ఉన్నవే కనుగొనబడ్డాయి. ప్రకృతి నియమాలే వాళ్ళు చెప్పేది. మత ప్రసక్తి ఎక్కడ ఉన్నది? **అలాగే అశ్వమేధ యజ్ఞము గురించి చెబుతున్నప్పుడు మత ప్రసక్తి లేదు.** ఇక్కడ మాట్లాడుతున్నది శారీరిక శక్తి గురించి, బుద్ధిబలం (బ్రెయిన్ పవర్) గురించి. మజిల్ పవర్‌ని (కండ బలం) పూర్వకాలం క్షాత్రబలం అనేవారు. బ్రెయిన్ పవర్‌ని బ్రాహ్మణబలం (బ్రాహ్మిన్స్) అన్నారు. మళ్ళీ కులం (కాస్ట్) అనే మాట వస్తుందని అనిపిస్తుంది. కులాల ప్రసక్తి లేనే లేదు. **ప్రపంచానికి గాయత్రి మంత్రాన్నిచ్చిన విశ్వామిత్రుడు బ్రాహ్మణుడా? వశిష్టుడు బ్రాహ్మణుడా? వేదవ్యాసుడు బ్రాహ్మణుడా? వీరు ఈ కాలంలో పుట్టి ఉంటే?** వీరందరిని ఋషులు అంటున్నాము కదా! మజిల్ పవర్ (కండబలం) మరియు బ్రెయిన్ పవర్ (బుద్ధిబలం) షుడ్ యునైట్ ఫర్ ఏ గ్రేటర్ వరల్డ్ (కలవాలి). దీని కొరకు కావలసిన వాతావరణమును తీసుకువచ్చే ప్రయత్నమే అశ్వ మేధము.

**మీ యొక్క జ్ఞానం ఏది ఉచితం అని చెప్తుందో అది మీ శరీరం తక్షణం చేయగలగాలి. అదీ అశ్వమేధం. అందరు కలిసి జీవించడం ఉచితం. ఎవరినీ బాధించకుండా ఉండడం ఉచితం (అహింస). ఎప్పుడూ సంతోషంగా ఉండడం ఉచితం. ఎప్పుడూ శుభ్రంగా ఉండడం ఉచితం. ఎవరి వస్తువు తీసుకోకుండా (అస్తేయం)ఉండడం ఉచితం. వీటిని యమ, నియమములు అన్నారు.** అహింస – ఎవరినీ బాధించడు. అస్తేయము – ఎవరి వస్తువులు దొంగిలించడు, తీసుకోడు. చివరికి ఎక్కడ ఉంటాడు? బ్రహ్మచరంతి – పిండాండ బ్రహ్మాండములో అన్ని చోట్లా – అఖండ మండలాకారం, వ్యాప్తం యేన చరాచరం, యత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవే నమః– ఆ పదాన్ని చూస్తూ జీవిస్తాడు. ఎప్పుడూ సంతోషముగా ఉంటాడు. ఎప్పుడూ శుభ్రంగా ఉంటాడు. ఎప్పుడూ తపస్సు చేస్తూ ఉంటాడు. తపస్సు అంటే ఇంద్రియాలకు లొంగడు. విశ్వామిత్రుని జీవితంలో మేనక రావడం అనేది అతనికి ఇంద్రియముల మీద నిగ్రహం ఉన్నదా లేదా అన్నది పరీక్షించ డమే. దానిని మనం తపస్సు అంటున్నాము. స్వాధ్యాయముతో తన జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉంటాడు. తనని తాను విశ్లేషణ (ఎనలైజ్) చేసుకుంటాడు. అవసరమైన మార్పులు చేసుకుంటూ ఉంటాడు. ఇదంతా దేని మీద ఆధారపడుతుంది అంటే ఈశ్వర ప్రణిధానము, సమర్పణ జీవితము. ఈవిధమైన జీవితము అశ్వమేధ యజ్ఞము.

**ఈనాడు మానవజాతి ఒక అద్భుతమైన మలుపుకి వచ్చింది. 5 వేల సంవత్సరాలు సద్గురువులు అందరు కలిసి ఆధ్యాత్మికత అనే పేరుతో అందించిన సిలబస్ చదువుకోవాలి.** ఈనాడు ఆవిర్భవిస్తున్న మానవజాతికి ఇచ్చిన ప్రణాళిక అర్థం చేసుకోవాలి. ఈ ప్రణాళిక అర్థం చేసుకొనుటకు గురుపరంపర అర్థం చేసుకోవాలి. **గురుపరంపర అంటే ఒక గురువు తరవాత ఒక గురువు తప్ప, ఒకే గురువు అని అర్థం కాదు.** బుద్ధుడు బుద్ధత్వం పొందిన తరవాత 3 సార్లు నమస్కారం పెట్టాడట. ఎవరికి నమస్కారం పెట్టావు? అని అడిగితే – మొదటిది ఇది వరకు నా కంటే ముందు బుద్ధత్వం పొందిన వాళ్ళకు నమస్కరిం చాను నేను అన్నాడట. రెండవది నేను బుద్ధుడిని కావడానికి కారణమైన పరిస్థితులకు నమస్కరించాను. మూడవ నమస్కా రం రాబోయే బుద్ధులకు పెట్టాను అన్నాడట. అవగాహన

**శ్రమను నమ్ముకుంటే నష్టపోము**

చేసుకోవాలి. ఇట్ ఈజ్ ఏ చైన్. ధార్మిక గురువులందరు ఈ పరంపరలోని భాగాలే. ఏ ధర్మానికి సంబంధించినవారైనా వారు ఆనాటి దేశకాల పరిస్థితులకు అనుగుణ్యంగా దిశా నిర్దేశన చేశారు. కానీ అవి సనాతనమైనవి, శాశ్వతమైనవి, నిత్యనూతనమైనవి.

**మనస్సులు మారితే తప్ప జీవితాలు మారవు.** దానినే సర్వమేధము అన్నారు. **అన్నింటినీ వదిలేసుకోగల శక్తి. ఆ వదిలేసుకునేదానిని బలిగా అర్థం చేసుకోవాలి.** కానీ ఆ జంతువులని బలి చేస్తే గురువులు ఏం చేయగలరు. నీ నాలిక రుచి కొరకు, నీ రక్తదాహం కోసం చేసి గురువుల మీద పడతావేంటి? నీ తుచ్ఛమైన, సంకీర్ణమైనటువంటి "నేను నా కుటుంబము" వీళ్ళ వల్లే వాళ్ళు బతుకుతున్నట్టు. **మనకి తెలియదు, మనము ఇంట్లో లేకపోతే ఎంత ఆనందిస్తారో.** నేను, నా కుటుంబం అని గాబరాపడతాము. అలాంటివి వదులుకోలేవు కానీ విశ్వజనీనమైన కుటుంబములో జీవించాలి అంటే ఎలా జీవించగలవు? సర్వమేధం అంటే ముందు నీ మనస్సులో ఉన్న సంకీర్ణత వదిలేసుకో. సర్వము వదిలేసుకో. ఇంత ఉంచుకుంటాను. అది కాస్త పెద్దది అవుతుంది. విష వృక్షాన్ని కూకటివ్రేళ్ళతో పెకలించివేయాలి.

**ఇప్పుడున్న కుటుంబ వ్యవస్థ ప్రేమ మీద ఆధారపడినది కాదు. ఋణానుబంధం మీద ఆధారపడ్డది.** ఋణము తీరిన వెంటనే పరలోక పయనము. అప్పుడు ఎవరు ఏమీ గుర్తుంచు కోరు. ఆ క్షణము ఏడుస్తారేమో. అది ప్రేమవల్ల కాదు. అలవాటు వల్ల. ఏడవకపోతే బాగుండదేమోనని ఏడ్చేవాళ్ళు ఉన్నారు. అది మీకు అర్థం అయ్యాక సర్వమేధ యజ్ఞం చేసేసి ఎక్కడకి పారిపోవక్కరలేదు. మీరు ఈ మానసిక స్థితి తెచ్చుకుంటే కుటుంబ వ్యవస్థ మొత్తం మారిపోతుంది. అది ప్రేమ మీద నడవడం మొదలుపెడుతుంది. కానీ పాతది వదలకుండా కొత్తది కావాలంటే ఎలా వస్తుంది? **ఈ విజ్ఞానము అర్థం అయితే, సర్వమేధం చేయగలిగితే అప్పుడు అశ్వమేధ ప్రక్రియ మిమ్మల్ని రారాజుని చేస్తుంది.**

సర్వమేధ యజ్ఞముగా గురుదేవులు జమీందారి ఆస్తినంతా, భార్య నగలు అన్నీ గాయత్రీ పరివార్‌కి ఇచ్చేశారు. అరవిందో బెంగాలుని వదిలివేసి ఫ్రెంచి పాలిత ప్రాంతమైన పాండిచ్చేరికి వెళ్ళాడు. దీనికి కూడా ఆధ్యాత్మిక రహస్యాలున్నాయి. ఇప్పుడు మరల ఫ్రాన్స్ ప్రముఖ పాత్ర వహించబోతోంది. అన్ని ఇంటర్ లింక్డ్. అఖండమండలాకారం.

మానవజాతి 84 లక్షల జీవరాసులలో ఒకటి. మానవ జాతి అంతా నాశనం అయినా గురువులకి ఏమీ కాదు. కానీ ఎందుకు ఇంతగా పాటుపడుతున్నారు అంటే ప్రజాపతి యొక్క ప్రేమ. తను సృష్టించుకున్నటువంటి ప్రాణి అంతర్హితమై పోవాలని ఆయన కోరుకోవడం లేదు. అంతర్హితమైపోతే తిరిగి సృష్టించుకోలేడా? మనమేదో గొప్పవాళ్ళమనే భ్రమ పోతే తప్ప గాడిలోకి రాలేము. అర్థము చేసుకొని అవగాహనతో తీవ్రప్రయత్నం అందరు కలిసి చేయాలి.

అందరూ కలిస్తే గురువు సహాయముతో పర్వతాన్ని ఎత్తేయ వచ్చు. మనము ఆంధ్రప్రదేశ్ ఆధ్యాత్మిక విజ్ఞానానికి కేంద్రమని తెలియచేసే అవకాశము ఇప్పుడు వచ్చింది. ఇది ప్రపంచము యొక్క కోరిక. ఋషుల యొక్క కోరిక. ఈ కోరిక సఫలీకృతము చెయ్యాలి. ఏవిధమైన జ్ఞానము లేని గోపాలురు చేయగలిగారు. గోవర్ధనాన్ని నిలబెట్టగలిగారు. గో అంటే వాక్కు. కృష్ణుని యొక్క జీవితం అంతా ఒక అద్భుతమైన గోమేధమే. ఆ సైన్స్ అర్థం చేసుకోవాలి.

ఈ కార్యక్రమాలు సవ్యముగా చేసినట్లయితే ప్రపంచ మంతా యుద్ధం అనే వర్షములో తడుస్తూ ఉన్నప్పటికీ మనలో ఎవరి మీద అస్త్ర ప్రభావం ఉండదు. ఇంద్రుడి అంతటివాడు గోపాలురిని ముంచేద్దామని వచ్చాడు, ఏమి చెయ్యగలిగాడు? ఆయనే క్రిందకి దిగి రావలసి వచ్చింది. మనము కూడా ఆ పని చేయగలము. కానీ మీరందరు సహకరిస్తేనే. శ్రీకృష్ణుడు మాత్రం ఒంటరిగా చేయగలడనా మీ ఉద్దేశ్యం! దానిలో రహస్యం ఏమంటే కేంద్రం ఎప్పుడు శాంతంగానే ఉంటుంది. దాని మీద బరువు పడదు. కేంద్రం చాలా సన్నగా ఉంటుంది. దాని చుట్టూ పెద్ద యంత్రం తిరుగుతూ ఉంటుంది. అలాంటి కేంద్రముగా ఆంధ్రప్రదేశ్ మారాలి.

*- డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారుగారి*
*ఉపన్యాసముల నుండి*
*సేకరణ: ముక్కామల రత్నాకర్*

**పనులలో చెమట చిందితే సిరులు లభిస్తాయి**

## మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-4

# ధ్యాన తీవ్రతలో దర్శించిన గతము



శివపూజ ఆటలో పొందిన భావానుభూతులు ఆమె వయస్సు పెరుగుతున్న కొద్దీ ఇంకా ప్రగాఢమవ్వడము మొదలుపెట్టాయి. కిశోరావస్థకు చేరిన భగవతి యొక్క మనఃప్రాణాలలో మరియు అంతఃకరణలో ఒక పిలుపు జనించింది. ఆమె ప్రాణాలు తన శివుడిని పిలుస్తున్నాయి. ఉండుండి మనస్సు ధ్యానచేతనలో చూసిన దృశ్యాలను మళ్ళీ మళ్ళీ చూసేది. అనేకరకాల ప్రశ్నలు అంతఃకరణాన్ని తొలిచేవి. నేను రోజూ ధ్యానంలో చూసే ఈ మహాయోగి శివుడు ఎవరు? అని ఆమె ఆలోచించేది. ధ్యానము చేస్తున్నప్పుడు శివుడికి బదులు ఈ సుదర్శన వ్యక్తిత్వము గల మహాయోగి యొక్క రూపము ఎందుకు ప్రకటితమౌతోంది? నిజంగానే భగవాన్ శివుడు పృథ్విపై అవతరించాడా? ఇలాంటి అనేక ప్రశ్నలు ఆరోజులలో ఆమె అంతఃచేతనలో అంకురించేవి. ఈ ప్రశ్నలకు జవాబు కొరకు ఆమె తన ధ్యానసాధన ఇంకా తీవ్రతరము చేయుటకు నిశ్చయించుకొన్నారు.

ఈ నిశ్చయముతో ఆమెలో ఒక విచిత్రమైన భావపరివర్తన జరిగింది. ఇంటిలోని సభ్యులందరు దీనిని అనుభూతి చెందారు. ఈరోజులలో ఆమె దినచర్య అస్తవ్యస్తమైపోయింది. కానీ ఈ బాహ్య అస్తవ్యస్తతలో ఒక అంతరిక సువ్యవస్థ సాకారం అవుతున్నది. ఆమె తన ధ్యానసాధనలో ఎంతలా మునిగి ఉండేదంటే లేవటము, స్నానము చేయడము, భోజనము చేయడము లాంటివి కూడా మరచిపోయేది. కుటుంబ సభ్యులకు ఆమె యొక్క ఈ ఆంతరిక పరివర్తన గురించి ఏమీ తెలియడము లేదు. పెద్దవదిన తల్లి వలే ఆమెను సంరక్షించింది. ఆమె లాలీకి ఈవిధంగా తెలియచెప్పేది– "లాలీ! నీవు ఇదివరకు ఇలా లేవు. ఏమయ్యింది నీకు ఇప్పుడు? నీవు ఇదివరకు ప్రొద్దున లేచి స్నానము చేసి తయారయ్యి ఆడుకునేదానివి, ఇంటి పనులు చేసేదానివి. కానీ ఈరోజులలో నిన్ను గురించి నీవు పట్టించుకోవట్లేదు అని అనిపిస్తున్నది."

వదినగారి ఈ మాటలు విని ఆవిడ నవ్వుతూ దాటవేసేది. ఏదోవిధంగా ఆవిడని మరిపించేది. సువ్యవస్థితరీతిలో ఆమె కూర్చుని రేయింబవళ్ళు ధ్యానసాధన చేస్తే అందరూ కంగారుపడతారని ఆమెకు తెలుసు. ఆమె తన కుటుంబసభ్యులలో ఎవరినీ కంగారుపెట్టదలచుకోలేదు. అందువల్ల ఆమె ఈ విచిత్రమైన విధానాన్ని పాటించింది. రోజురోజుకి ఆమె ధ్యానసాధనయొక్క లోతులలోకి ప్రవేశిస్తున్నది. ప్రతీ క్షణము అనేక దివ్యానుభూతులు ఆవిడని చుట్టుముట్టి ఉండేవి. బయటికి ఎంతో సామాన్యంగా కనిపించినప్పటికీ ఆమె ఆంతరిక జీవితమంతా అసామాన్యము, అలౌకికము అయిపోయినది.

ఒక విశేష ప్రసంగములో ఆమె తన యొక్క శిష్యులకు ఆరోజుల గురించి కొన్ని ముఖ్యవిషయాలు చెప్పింది. సాధనా, తపస్సు గురించి చెప్తూ ఆమె ఇలా అన్నది. "ఈ విషయాలు ఎంత గోప్యంగా ఉంచితే అంత మంచిది. ప్రపంచమునకు దీనిగురించి తెల్పటము, చూపించడము వల్ల ఏమి లాభము? గురువుగారు లోకశిక్షణ చేయవలసి ఉన్నది కనుక మీ అందరికి నేర్పించాలి కనుక వారి గురించి ఈ చిన్నచిన్న విషయాలు చెప్పాను. ఆయన చేసిన విశేష తపస్సుల గురించి ఇంకా ఏమీ తెలియదు. నా గురించి అసలు ఎవరికి ఏమీ తెలియదు. నిజానికి నా సాధన 11,12 ఏండ్ల వయస్సులోనే మొదలైనది. ఇందులో ఏవిధమైన ప్రదర్శన ధోరణి లేదు. నిద్రపోతున్నప్పుడు, మెలకువగా ఉన్నప్పుడు, నిల్చుని, కూర్చుని, తింటూ, త్రాగుతూ నిరంతరము ధ్యానించేదాన్ని. శరీరము గురించి ఏమీ తెలిసేది కాదు. ఆరోజులలో చాలా విచిత్రస్థితిలో ఉండేదాన్ని."

అస్తిత్వము యొక్క ప్రతీ కణములో అణుపరమాణువులలో నిబిడీకృతమైన అవ్యక్తనాదము ఆమెకు అన్నివేళలా వినిపించేది. ఒకసారి భేరీనాదము వినిపిస్తే, ఇంకోసారి మృదంగము,

**చేయాలనుకున్నది చేయండి కానీ ఇతరులను ఇబ్బందుల పాలు చేయకండి**

వేరొకసారి వీణ, ఇంకోసారి శంఖధ్వని వినిపిస్తూ ఉండేది. అవన్నీ కలిసి ఒక అద్భుతమైన వాద్యబృందముగా ఏర్పడి అలౌకికమైన సంగీతము వినిపించేది. ఆమె దేహములో, మనస్సులో సర్వత్రా అణుపరమాణువుల యొక్క విద్యుత్ కణాల నృత్యము మరియు సంగీతం నిరంతరము వినిపిస్తూ ఉండేది. ఈ లీలామయికి తన అంతఃకరణములో ఈ అణుపరమాణువుల నిరంతర వేధన, ధ్వంసన మరియు క్రొత్తక్రొత్త సముదాయాలుగా ఏర్పడి అనంత పదార్థముల సృష్టి, వికాసము మరియు లయము యొక్క చిత్రములు కనిపించేవి. ఆమె చిత్‌శక్తి యొక్క చైతన్యతలో అన్నీ స్పష్టంగా కన్పించేవి. ఈరోజులలో ఆమెకు తన జన్మ మరియు జీవితము యొక్క అనేక రహస్యములు సాక్షాత్కరించాయి.

ధ్యాన తీవ్రతలో ఆమె సాధనకు సంబంధించిన అనేక దివ్యదృశ్యములను తిలకించారు. గంగానది తరంగాలు మరియు మందిరములోని ఘంటానినాదములతో పాటు కనిపించిన అనేక దృశ్యాలు అస్పష్టంగా ఉండేవి. క్రమ క్రమంగా దక్షిణేశ్వర మందిరములో రామకృష్ణపరమహంసతో జీవించిన దృశ్యము స్పష్టంగా కనిపించింది. పరమహంస దేవునితో పాటు ఆమె భక్తులు శిష్యులతో చుట్టుముట్టబడి ఉండడము గమనించింది. అందరు ఆమెను చూసి 'మా' అని భక్తితో ప్రణమిల్లినట్లు కనిపించేది. ఈ అద్భుత దృశ్యావళిని చూస్తూ ఆమె తనని తాను మరచిపోయింది.

హఠాత్తుగా ఆమె ధ్యానావస్థ చేతనలో దృశ్యపరివర్తన జరిగింది. గంగా తరంగాలు మందిరములోని గంటల రవళి అలాగే ఉన్నవి. కొన్ని దృశ్యములు మారాయి. అంతే, ఆమెకు బెనారస్‌లో ఎక్కడో ఉన్నట్టు కనిపించింది. సంత్ కబీర్ యొక్క జీవితముతో, తన జీవితము ముడిపడి ఉన్నదా అని అనిపిస్తోంది. అతి పేదవాడుగా ఉన్న కబీరుతో పాటు ఆమె ఉన్నది. అనేకులు ఆమెకు శ్రద్ధతో నమస్కరిస్తున్నారు. ఆయన గుడిసె వద్దకు యోగులు, ధనము లేనివాళ్ళు, చదువులేనివాళ్ళు జ్ఞానము పొందడానికి వచ్చేవారు. లోతైన ధ్యానంలో ఉబికివస్తున్న ఈ దృశ్యాలను ఆమె గమనిస్తూ ఉండేది. ఈ కాల శూన్యతలో కాలబోధ యొక్క ప్రశ్నే లేదు.

ఇక్కడ కూడా దృశ్యపరివర్తనలు ఉన్నవి. చిత్‌శక్తి యొక్క లీలావిలాసము ఇక్కడ కూడా సక్రియముగా ఉన్నది. ధ్యానం యొక్క ఈ భావభూమిలో ఎవరైతే కబీరో ఆయనే శ్రీరామకృష్ణ పరమహంస అని, ఆయనే అనేక సంవత్సరాల బట్టీ ఆమెకు కన్పిస్తున్నటువంటి మహాయోగి అని స్పష్టమైనది. ఈయనతోనే తన భవిష్యత్తు యొక్క సూత్రము బంధింపబడి ఉన్నది అని తెలిసినది. ఆ రెండు జన్మలలో సుపరిచితమైన సాన్నిధ్యము ఆమెకు ఈ జీవితములో కూడా దొరకనున్నది అని తెలిసింది. సంత్ కబీర్ యొక్క లీలాసహచరి "లోయీ", శ్రీరామకృష్ణపరమహంస యొక్క లీలాసంగిని "శారదా" ఈమే. ఏ ఆత్మచేతన లోయీగా జన్మించినదో, శారదగా జీవించినదో ఆమె భగవతీ నామరూపము స్వీకరించి, దేహము ధరించింది.

అనేక సంవత్సరాల తీవ్ర ధ్యాన సాధన తర్వాత ఆమెకు తన ప్రశ్నలకు జవాబులు దొరికాయి. ఆమె జీవనచర్య మళ్ళీ బాహ్యరూపంగా సువ్యవస్థితమయ్యింది. కుటుంబసభ్యులందరికీ ఆ స్వాస్థత లభించింది. ఒకే మార్పు మొదటికీ ఇప్పటికీ వారికి కనిపించింది. వారి లాలీ ప్రొద్దున్న తొందరగా స్నానము చేసి శివపూజతో పాటు నియమంగా ధ్యానము చేయడము మొదలుపెట్టింది. తన ఆరాధ్యునితో కలవడానికి ఆమె తీవ్ర ఉత్కంఠతో ఉన్నదని ఎవరికి తెలియలేదు. నిరంతరము ఉత్పన్న మవుతున్న ఈ ఆంతరిక పిలుపు గురించి కుటుంబసభ్యులు ఎవ్వరికీ తెలియదు. ఈ మధ్యన కాలచక్రం వేగముగా తిరుగు తున్నది. ఆరోజులలో పద్ధతి ప్రకారము జస్వంతరావుశర్మ తన ముద్దుల కూతురి యొక్క వివాహము గురించి ఆలోచించ డము మొదలుపెట్టారు. కిశోరి భగవతీ యొక్క అంతర్‌చేతనలో పెల్లుబుకుతున్న అలౌకిక జ్యోతిసాగరంలో ఒక పిలుపు సఘన స్వరంతో మారుమ్రోగుచున్నది. ఆరాధ్యుని చరణముల మీద ఆమె అనురాగము నిరంతరము వృద్ధిచెందుతున్నది. ఆమెలో ఆధ్యాత్మిక ప్రేమ బీజాలు అంకురించడము మొదలయ్యాయి.

### ఆరాధ్యునితో కలిసే భావభూమిక

ఆరాధ్యుని చరణాలలో భగవతీ యొక్క ప్రీతి దృఢమౌతున్నది. ఆమె హృదయంలో నిరంతరము భక్తి యొక్క అంతర్ధార ప్రవహిస్తున్నది. ధ్యానసాధనలో తన పూర్వజన్మల కథ స్పష్టమైనాకే ఆమెలో ఒక విలక్షణ భావపరివర్తన వచ్చింది. ఇంతకుముందు కూడా ఆవిడ చాలా ప్రశాంతముగా ఉండేది. కానీ ఇప్పుడు ఈ శాంతి ఇంకా ఘనీభూతమైనది. ఈరోజులలో ఆమె పూర్తి శాంతముగా, అచంచలంగా ఉండి తన రోజువారి క్రియా

**పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించండి**

కలాపాలలో లీనమై ఉండేది. ఆమె దినచర్యలో పెద్ద వదినకు ఇంటి పనులలో సహకరించుట, రామాయణము, మహాభారతము మొదలగు ధర్మగ్రంథముల స్వాధ్యాయము, తన నియమిత ధ్యానసాధన చేసుకొనడము ముఖ్యమైనవి. ఇంటిలో అందరికంటే చిన్నపిల్ల అయినప్పటికీ కుటుంబంలోని అందరి సభ్యుల బాగోగులను చూసుకునేది. ఎవరికి, ఎప్పుడు, ఏది, ఎంత అవసరమో దానిని చాలా జాగ్రత్తగా గమనించేది.

ఆమె ఇద్దరు అన్నలు దీన్‌దయాళ్ మరియు సున్దరీలాల్ ఆమె గుణములతో సంతుష్టులై ఉండేవారు. వదిన ఆమెను చూసి గర్వపడేది. ఈ మధ్యకాలంలో పెద్దక్క ఓంవతి యొక్క వివాహం అయింది. ఎప్పుడో తప్ప ఆమె వచ్చేది కాదు. ఆమె తన చెల్లెలిని చాలా ప్రేమించేది. అందువల్ల వదినతో, తండ్రితో పట్టుబట్టి లాలీని కొద్దికాలము తనతో పంపించమని బలవంతము చేసేది. ఇక్కడ ఉంటే ఎక్కడికీ వెళ్ళదుకదా! స్థలము మారటం వలన ఆమె మనస్సుకు కూడా ప్రశాంతత లభిస్తుంది. ఓంవతి యొక్క మంకుపట్టుకు ఎలాగోలాగా జస్వంతరావు ఒప్పుకునేవారు. భగవతి కొద్దిరోజులు తన అక్క యొక్క అత్తవారింటికి వెళ్ళివచ్చేది. అక్కడ కూడా ఆమె దినచర్య ఇలాగే ఉండేది. అక్కకి ఇంటిపనులలో సహకరించుట మరియు తన ధ్యానసాధన యొక్క క్రమం యథావిధిగా కొనసాగిస్తూ ఉండేవారు.

ఆరోజులలో కుటుంబసభ్యులు ఆమె కొరకు మంచి యోగ్యుడైన వరుడిని వెతకటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దన్న దీన్‌దయాళ్– తండ్రి జస్వంతరావుల మధ్య దీనిగురించి విస్తారంగా చర్చలు జరుగుతూ ఉండేవి. ఈసారి లాలీ అక్క ఓంవతి ఇంటినుండి తన ఇంటికి తిరిగి వచ్చేసరికి కుటుంబం యొక్క దగ్గరి బంధువు కిషన్‌ప్రసాద్‌గారు వచ్చారు. అప్పుడు ఆయన ఒక వరుడి గురించి చెప్తున్నారు. పండిత్ జస్వంతరావు మరియు ఆయన పెద్దకొడుకు దీన్‌దయాళ్ చాలా ఓర్పుతో, ఉత్సుకతతో ఆయన మాటలు వింటున్నారు. ఆయన చెప్పే మాటలలోని కొన్ని మాటలు భగవతీ చెవిలో కూడా పడ్డాయి. ఆయన ఇలా అంటున్నారు – “జస్వంత్ ఇటువంటి పిల్లవాడు ప్రపంచమంతా వెతికినా నీకు దొరకడు. వీరు ఆవల్‌ఖేడ్‌లో ఉంటారు. చుట్టుప్రక్కల ఊళ్ళలో వారిది పెద్ద జమిందారి. వీరు వంశపారంపర్యంగానే ధనవంతులు.

ఈ మాటలకు అడ్డుపడుతూ జస్వంతరావుగారు ఇలా అన్నారు. “నా గురించి వారికి ఉన్నది ఉన్నట్లు చెప్పావు కదా? ప్రశ్నకి జవాబుగా కిషన్‌ప్రసాద్ ఇలా అన్నారు. ‘ఇందులో దాచడానికి ఏమున్నది? నేను కుర్రాడు యొక్క అన్న రాం ప్రసాద్‌తో మాట్లాడాను. నేను వారికి చెప్పేశాను. జస్వంతరావు యొక్క పూర్వికులు అహమద్‌పూర్ (ఖైర్, అలీగఢ్)లో ఉండే వారు. అక్కడే వారికి ఇల్లు, పంటభూములు ఉండేవి. వారి ముత్తాతల కాలంలో 12 ఊళ్ళకి (జోత్‌లకి) జమిందారుగా ఉండేవారు. వారి కుటుంబానికి మంచి పేరు ఉండేది. కానీ వారి తండ్రి శ్రీపరసాదీలాల్‌శర్మ కాలంలో పరిస్థితులు విషమించాయి. రైతుల క్లిష్ట పరిస్థితులు చూసి ఆయన శిస్తు (పన్ను) తీసుకోలేదు. మెల్లిమెల్లిగా జమిందారీ అంతరించిపోయింది.’ కిషన్‌ప్రసాద్ యొక్క ఈ మాటలు అందరూ జాగ్రత్తగా వింటు న్నారు. ఆయన ఇలా కొనసాగించారు. “మీరు నలుగురు అన్నదమ్ములని రాంప్రసాద్‌కి చెప్పాను. జస్వంతశర్మ, బల్వంత శర్మ, రాందయాళ్‌శర్మ, వాసుదేవప్రసాద్. ఈ నలుగురి అన్న దమ్ముల మధ్య ఒక చెల్లెలు రామశ్రీ ఉండేది. ఆమెకి పెళ్ళి అయ్యింది. ఆమె తన కుటుంబాన్ని తాను చూసుకుంటుంది.”

కిషన్‌ప్రసాద్ తన ధోరణిలో తాను వేగంగా చెప్తూనే ఉన్నారు. తన ధోరణిలో ఉన్న ఆయన వినేవాళ్ళు వరుడి గురించి తెలుసు కోవడానికి ఉత్సాహపడుతున్నారు అనేది గమనించలేదు. దీనదయాళ్ గుర్తుచేసినప్పుడు ఆయన మాటల ధోరణి మార్చాడు. ఆయన ఇలా అన్నారు. ‘అరె! వరుడు గురించి ఏమి అడగాలి? పండిత్ రూప్‌కిశోర్‌శర్మగారి కొడుకు. ఇంక పండిత్ రూప్‌కిశోర్ పేరు చుట్టుప్రక్కలవాళ్ళకి తెలుసు. ఆయన సుపుత్రుడే ఈయన. పేరు శ్రీరామ్. తపస్సు, సాధన, చదువు అన్నింట్లోను మొదటే ఉంటాడు. కొన్నాళ్ళు ఇక్కడే ఆగ్రాలో ఉండి “సైనిక్” అనే పత్రికలో పనిచేశారు. ఇప్పుడు మథురలో వుండి స్వయంగా పత్రిక నడుపుకుంటున్నారు. కాలదేవత ఆయన మొదటి భార్యను తీసుకుపోయింది. ఆమె ద్వారా ఆయనకి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఓంప్రకాశ్, దయావతి మరియు శ్రద్ధ. కానీ మన లాలీ ఎంత గుణవంతురాలంటే అంతా తేలికగానే నిభాయించగలదు.”

కిషన్‌ప్రసాద్ యొక్క ఈ మాటల మీద ఇంటిలో చాలా రోజులు చర్చలు జరిగాయి. రకరకాల ఆలోచనలు, చర్చలు

**ప్రశాంతంగా ఆలోచించి పనులు చేసుకోవడం అలవరచుకోండి**

అనేకసార్లు జరిగాయి. మొదటి భార్య చనిపోవుట, తద్వారా ముగ్గురు పిల్లలు ఉండుట అనేది దీన్‌దయాళ్‌కి కొంచెము రుచించలేదు. ఈ విషయం మీద తండ్రి జస్వంతరావుతో చాలాసేపు మాట్లాడాడు. మాటలలోనే ఆయన ఇలాగ కూడా అడిగారు. 'దాదా! నీ జ్యోతిష్యము ఏమి చెప్తోంది'? జవాబుగా జస్వంతరావు గంభీరులై ఇలా అన్నారు "చూడు! మొదటినుంచి నేను లాలీ ఆ దేవీ అంశ అనే నమ్ముతున్నాను. ఆమె వివాహము ఒక సాధారణ వ్యక్తితో పొత్తు కుదరదు. అతను ఎంత పెద్ద ధనవంతుడైనా సరే. మన లాలీకి సుయోగ్యుడైన వరుడు తపోనిష్ఠుడై, ఆధ్యాత్మిక విద్యాజ్ఞాత అవ్వాలి. నాకు ఈ కుర్రవాడు అన్నివిధాల లాలీకి తగినవాడు అనే అనిపిస్తున్నాడు. పండిత్ జస్వంతరావు మాటలు దీన్‌దయాళ్‌కు రుచించాయి. చివరకి తండ్రి, పుత్రులిద్దరూ కలిసి కన్య యొక్క వదినకు ఈ విషయాలన్నీ తెలిపి 'లాలీ అభిప్రాయము' తెలుసుకోమని ఆమెను కోరారు. ఏమి జరిగినా లాలీ యొక్క ఇష్టంతోనే జరగాలి అని నిర్ణయించుకున్నారు.

వదిన తన భర్త, మామగార్ల యొక్క ఆజ్ఞానుసారము తన ముద్దుల మరదలితో అన్ని విషయాలు చర్చించింది. ఆమె అన్ని మాటలు చాలా శాంతంగా విన్నది. మాటలు అన్నీ చెప్పడమైన తర్వాత ఆమె ఒక్కక్షణం తన అంతర్‌చేతనను ఏకాగ్రము చేసింది. ఈ ఏకాగ్రతతో సత్యము స్పష్టంగా గోచరించింది. ఎవరితోనైతే తన వివాహము గురించి చర్చలు జరుగుతున్నాయో ఆయన యొక్క పనిలో సహకరించడానికే తను దేహధారణ చేసినదని స్పష్టంగా అర్థమైంది. క్రిందటి జన్మలలో భర్తగానూ, మార్గదర్శకుడిగానూ ఉన్న తన ఆరాధ్యదైవమే ఈసారి కూడా తన భర్త కాబోతున్నాడు. తన అంతర్ చేతన యొక్క విషయాలన్నీ కూడా ఆమె గోప్యంగానే ఉంచింది. ప్రత్యక్షముగా ఆవిడ ఇంతే చెప్పింది. "వదినా! దాదాకి నీవు చెప్పు. ఆయన చెప్పినది నాకు ఇష్టమే. ఆయన చేయబోతున్న దానితో నా జీవితము మంగళమయంగా అవుతుంది".

లాలీ యొక్క అంగీకారము, స్వీకృతి తెలుసుకొని కుటుంబం మొత్తము ఆనందించింది. ఉత్సాహ తరంగాలు ఇల్లంతా వ్యాపించాయి. వరపక్షము నుంచి కూడా స్వీకృతి వచ్చేసింది. మంగళమయి పరిణయము కొరకు ఏర్పాట్లు మొదలుపెట్టారు. 18 ఫిబ్రవరి 1945నాడు వివాహము నిశ్చయింపబడినది. పెళ్ళిరోజు నిర్ధారింపబడగానే పండిత జస్వంతరావు మనస్సులో ఆనందంతో పాటు ఒక బాధ కూడా కలిగింది. ఆయనకు జగదంబ పార్వతి పితృగృహము వదిలి భగవాన్ భోలేనాథ్ దగ్గర నివసించడానికి వెళ్ళటానికి సంకల్పము తీసుకున్నదని అనిపించింది. తన బాధను మనస్సులోనే దాచుకుని జస్వంతరావు కూతురి వివాహ ఏర్పాట్లలో మునిగిపోయారు. అందులో గ్రామస్తులైన జ్వాలాప్రసాద్‌గారు చాలా ప్రధానపాత్ర వహించారు. ఆయన మధ్యవర్తిత్వములోనే ఇవన్నీ జరిగినవి.

అనుకున్న తిథిలో వివాహము జరిగింది. వివాహము చాలా సాధారణంగా ఎటువంటి ఆడంబరాలు లేకుండా జరిగింది. ఇది మానవత్వమునకు జీవన ఆదర్శాన్ని నిరూపణ చేసే ఋషియుగ్మము యొక్క మంగళ పరిణయము. ఇది తపస్సు మరియు శ్రద్ధ యొక్క కలయిక. జ్ఞానము మరియు భక్తి యొక్క అద్భుతమైన సాయుజ్యము. భగవతీ మరియు శ్రీరామ్ ఈ శుభఘడియలలో తమ ఆదర్శమార్గాన కలిసి నడవటానికి సంకల్పితులు అయ్యారు. ఆమె ఆరాధ్యుని చరణముల సామీప్యములో భగవతీ జీవితములో ఒక సరిక్రొత్త ఆయామము తెరుచుకుంది. 'మా' యొక్క మాతృత్త్వము అభివ్యక్తి చెందుతున్నది. మాతృత్త్వపు సజల భావనలు రూపుదిద్దుకొనుటకు తయారవుతున్నాయి.

*– అనువాదం: డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ*


**దైవీశక్తుల తోడ్పాటుకై**
**కష్ట నష్టముల నివారణకై**
**చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై**
**జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై**
**జీవితంలో స్థిరపడుటకై**

**యుగశక్తి**  **గాయత్రి**

**మాసపత్రిక చదవండి!**
**చదివించండి !!**

**ప్రతుల కొరకై సంప్రదించండి:**
**ఫోన్: 040-23700722, 9949111175**


**ముందడుగు వేయాలనే తపన ఉండాలి**

# జీవితమనే కమలమును వికసింపచేయగలిగే ఐదు వృత్తులు

ఇంత అద్భుతమైన పరివర్తనను తీసుకురాగలిగే ఐదు వృత్తులు ఏవి? ఆరవ సూత్రములో ఈ తత్త్వమును మహర్షి పతంజలి మరింత సుస్పష్టంగా విశదీకరించారు. ఈ సూత్రములో వారు ఇలా అంటారు.

*ప్రమాణ విపర్యయ వికల్ప నిద్రా స్మృతయః ॥ 1/6*

అనగా ఈ వృత్తులు ఏమంటే – ప్రమాణ (సమ్యక్ జ్ఞానము), విపర్యయ (మిథ్యాజ్ఞానము), వికల్ప (కల్పన), నిద్ర మరియు స్మృతులు. ఈ ఐదు వృత్తులు మనస్సు యొక్క 5 భావనలు, మనస్సు యొక్క 5 రహస్యాలు. ఈ 5 వృత్తులను మనస్సు యొక్క 5 శక్తులుగా కూడా చెప్పవచ్చు. వీటిని సరిగ్గా ఉపయోగించుకుంటే జీవితము సహస్రదళ కమలము వలె వికసించి సుగంధభరితంగా మారుతుంది.

వీటి గురించి చెప్తూ గురుదేవులు ఇలా అంటారు. జీవితమును తెలుసుకోవాలి అంటే మనస్సును తెలుసుకోవాలి. మనస్సును తెలుసుకోవాలి అంటే ఈ ఐదువృత్తులను గురించి తప్పక తెలుసుకోవాలి. ముందుగా మొదటిదానిని గురించి తెలుసుకుందాము. మొదటి వృత్తి 'ప్రమాణ'. సం అనగా సమ్యక్జ్ఞానము. సంస్కృతములో ఈ ప్రమాణ అనే శబ్దానికి చాలా లోతైన అర్థమున్నది. ఆ శబ్దాన్ని మరే ఇతర భాషలోకి అనువదించడం సాధ్యంకాదు. సమ్యక్జ్ఞానము అని మనం దేని గురించైతే చెప్పామో అది 'ప్రమాణ' అనే పదానికి సరైన అర్థం కాదు, పైపైన అర్థాన్నిచ్చేది. అసలు ప్రమాణ అనే పదానికి మూలశబ్దము 'ప్రమ' అనే పదంతోనే వస్తుంది. దీని భావార్థమేమిటంటే సత్య అనుభవము. సంక్షిప్తంగా చెప్పాలంటే ప్రమాణమును యథార్థ అనుభవము వలెనే ఉండేటువంటి సత్యమును అనుభవములోకి తీసుకురాగలిగే శక్తి అని చెప్పవచ్చు.

ఆ శక్తి మనస్సుకు ఉంటుంది అని పతంజలి మహర్షి చెప్తారు. మన మనస్సుకుండే ఉచ్చస్థాయి సామర్థ్యాన్ని ప్రమాణము అంటారని పూజ్యగురుదేవులు చెప్తారు. సామాన్యంగా ఇది అసలు వికసించని, స్వల్పంగా వికసించిన లేదా సగం మాత్రమే వికసించినటువంటి దశలోనే ఉంటుంది. ఈ సామర్థ్యము కనుక సరైన పద్ధతిలో జాగృతమై వికసించినట్లయితే ఏది తెలిసినా అది సత్యమే అవుతుంది. సాధారణంగా మనస్సుకు ఉండే ఈ శక్తి అవికసితంగా ఉండిపోతుంది. దీనిని ప్రయోగించడమనేది కుదరదు. మనస్సు యొక్క శక్తిని అర్థం చేసుకునేందుకు గురుదేవులు ఒక ఉదాహరణ చెప్పేవారు. నువ్వు ఒక ఇంట్లో ఉన్నావు అనుకో, ఆ ఇంట్లో విద్యుద్దీపాలను వెలిగించే స్విచ్‌లు ఎక్కడ ఉంటాయో నీకు తెలియదు. గాఢాంధకారం అలుముకొని ఉన్నది. నువ్వు ఆ ఇంట్లో ఉన్నావు. స్విచ్ గురించి నీకు తెలియదు. అప్పుడు ఎలా ఉంటుంది? ఏదో తిమ్మిని బమ్మిని చేసి పని గడుపుకోవాలి. చాలాసార్లు ఎదురుదెబ్బలు తగులుతాయి. ఒక్కోసారి తల పొడుచుకుంటుంది. కాళ్ళకు దెబ్బలు తగులుతాయి. ఈ అంధకారం వల్ల ఎన్ని కష్టాలు ఎదురవుతాయో చెప్పలేము. ఆ ప్రయత్నానికి ఫలితం అనుకున్నా, గురుకృప అనుకున్నా, ఏదనుకున్నా కరంటు స్విచ్ ఎక్కడో తెలిసింది. అంతేకాదు అది ఆన్ అయింది కూడా. అంతే!! ఆ ఒక్క క్షణంలో మూలమూలల్లో కూడా కాంతి వెదజల్లబడి ఉంది. అన్నివైపులా వెలుగులు నిండిపోయి కనపడుతున్నది. అన్ని బాధలు, కష్టాలు, సమస్యలు ఒక్కసారిగా దూరమైపోతాయి. ఇప్పుడు అన్నీ స్పష్టంగా కనపడుతున్నాయి. ఇప్పుడు సత్యమనేది ప్రశ్నలు వేసేందుకు, జిజ్ఞాసను తీర్చుకునేందుకు ఉపయోగపడే ఒక వస్తువు వలే కాకుండా జీవితంలోని ఒక అనుభవంగా మారింది. అంతే అదే ప్రమాణ అనే వృత్తి. ఇది వికసించింది అంటే చేతిలోకి స్విచ్ వచ్చినట్లే. ఎక్కడా ఎటువంటి పరిస్థితుల్లోను దారితప్పడమనేదే ఉండదు. ఎటువంటి భ్రమలకు, సందేహాలకు స్థానమే ఉండదు.

బుద్ధుడు, మహావీరుడు, శ్రీరామకృష్ణపరమహంస, రమణ మహర్షి, స్వయంగా పరమపూజ్యగురుదేవులు వీరందరికీ ప్రమాణవృత్తి స్వాభావికంగా జాగృతమైంది. గురుదేవులు తమ జీవితకాలంలో వేలాది ప్రదేశాలకు వెళ్ళారు. లక్షలాదిమందిని

**ఆనందంగా ఉన్నవాడే ఇంకొకడి సహాయం చేయగలడు**

కలిశారు. ప్రజలందరినీ కలవడమనే ఈ ప్రక్రియ ఆయన ఎక్కడికీ బైటికి వెళ్ళకుండా ఉన్నప్పటి నుండే ఆగిపోయింది. ఎక్కడ ఎవరు కనిపించినా, వారడిగే ప్రశ్నలకు గురుదేవులు చాలా సహజంగానే సమాధానం చెప్పేవారు. ఒక్కోసారి ప్రశ్నలు అడిగేవారు సంకోచంతో అడగలేకపోయినా సరే గురుదేవులు వారికి సమాధానమిచ్చేవారు. వారి ప్రవచనాలలో ఒకేసారి అనేకమంది ప్రశ్నలకు సమాధానం లభించేది.

ఎవరైనా అలా ప్రశ్నలు అడిగితే ఆయన నవ్వుతూ "అరే భాయి! నువ్వు ఆలోచిస్తావు, తడుముకుంటావు, చిక్కుకుపోతూ ఉంటావు, కానీ నేను అన్నీ స్పష్టంగా చూడగలుగుతాను. నాకు నీవు వేసే ప్రశ్న తెలుసు. సమాధానము తెలుసు. నాకు నీలో ఇప్పటికి ఇంకా పుట్టకుండా, రేపు పుట్టబోయే ప్రశ్నలు కూడా కనిపిస్తున్నాయి. వాటితోపాటు సమాధానాలు కనిపిస్తున్నాయి. అవి నీకు రేపు అవసరమవుతాయి. ఇదే ప్రమాణవృత్తి. ఇది వికసించడం అంటే సహజంగానే 'బోధ' అనేది లభించడం. మరి అలాంటప్పుడు అరువు తెచ్చుకున్న ఆలోచనలు, ఇరికించే రకరకాల తర్కవితర్కాలు, బుద్ధితో చేసే ఖండనలు, జోడింపులు అవసరం అనేది ఉండదు. **గాయత్రీ మహామంత్రాన్ని భావ పూరితంగా చేస్తే కనుక మనస్సుకుండే ఈ శక్తి కొన్ని సంవత్స రాలలో దానంతటదే జాగృతమవుతుంది అని గురుదేవులు చెప్పేవారు.** దానితోపాటే ఈ శక్తిజాగరణలో అవరోధాలను కలిగించే శక్తులు కూడా సమూలంగా నశించిపోతాయి.

అవరోధక శక్తే మనస్సుకున్న రెండవ వృత్తి. దీని పేరే విపర్యయం. విపర్యయం అంటే మిథ్యాజ్ఞానము. మిథ్యాజ్ఞానం అంటే అభిప్రాయము ఒకటి, కనిపించేది మరొకటి. తాడు పాములా కనిపిస్తుంది. స్పృహ లేని చీకటి కారణంగానే జీవితంలో ఇలాంటిస్థితి ఏర్పడుతుంది. భంగు, మత్తుపదార్థాల వంటివి తీసుకున్నవారికి గందరగోళంగా ఉన్న అనుభూతి కలుగుతుంది. ఇదేవిధంగా ఇంద్రియలోలురు, మానసికమైన వాసనలు, కోరికలనే తాపంలో ఉన్నవారినే ఈ మిథ్యాజ్ఞానము ముంచెత్తుతుంటుంది. దానితో జీవితం మొత్తం ఎప్పటికీ దారిలోకి రాని గాడితప్పిన బండికి పర్యాయపదంగా నిలిచి పోతుంది. విపర్యయం అనేది సమాప్తం అయితే ప్రమాణం జాగృతమైనట్లే. యోగసాధకుల ప్రయత్నాలన్నీ ఈ వృత్తివైపు తమను తాము మలుచుకునేలా ఉండాలి. వాసనలు, కోరికలు అనే మత్తు దిగిపోయిన తరువాత మనస్సు యొక్క విపర్యయస్థితి (అంటే అవరోధాలు కల్పించే లక్షణం) చివరిదశకు చేరుకుం టుంది.

మూడవ వృత్తి వికల్పము లేదా కల్పన. ఇది మనస్సుకుండే అద్భుతమైన శక్తి. కానీ సామాన్యులు దీనిని దురుపయోగ పరుస్తూ గాలిలో మేడలు కడుతుంటారు. ఎవరికైతే ఈ శక్తిని కొద్దో, గొప్పో ఉపయోగించుకోవడం చేతనవుతుందో వారు కవులుగా, కళాకారులుగా రాణించగలుగుతారు. ఈ వికల్ప వృత్తిని ఎలాంటి విశిష్టరీతిలో ఉపయోగించుకుంటారో అది వారి గుర్తింపుగా మారుతుంది. వికల్పవృత్తి లేదా కల్పనలు అనేవి సాధారణమైనవి కావని గురుదేవులు అంటుంటారు. ఇది యోగులు, సాధకులు, మనస్వులైనవారి చేతనాశక్తి మాధ్యమంగా మారతాయి. వీటి ద్వారానే వారి ప్రాణము ప్రవహిస్తుంటుంది. పాశ్చాత్య దేశంలో 'కుఎ' అనే మనో వైజ్ఞానికుడు ఉండేవాడు. అనేకానేక ప్రయోగాల ద్వారా ఆయన కల్పనాశక్తి యొక్క చమత్కారాలను నిరూపించారు. ఆయన ఈ శక్తిని నయంకాని మొండివ్యాధులతో బాధపడుతున్నవారిపై ప్రయోగించారు. ఆయన తన ప్రయోగాలు మొదలుపెట్టే ముందు రోగితో ఇలా అనుకోమని చెప్పేవారు.– 'నేను ఆరోగ్య వంతునిగా మారుతున్నాను' అని ప్రతిక్షణం, ప్రతి నిమిషం ఊహించుకుంటూ ఉండు. ఈ ప్రయోగము ద్వారా ఆయన అసాధ్యమనిపించిన లక్షలాది రోగాలను నయం చేశారు.

ఇప్పుడు పాశ్చాత్య దేశాలలో 'ఫెయిత్ హీలింగ్' అనే ఒక సంపూర్ణ ప్రక్రియ తయారైంది. ఇది మరేమీకాదు. మన ఊహాశక్తికి ఉండే ప్రగాఢత. దీనివల్లనే చమత్కారభరితమైన ఫలితాలు కనపడుతున్నాయి. ఊహలు శాశ్వతమైన అనంత తత్త్వాన్ని మనం అనుభూతి పొందేందుకు విశిష్టమైన రీతిలో ఉపయోగపడతాయి. విశ్వమునకు సంబంధించిన ప్రాణాల న్నింటిలోను మానవజాతికి అందించబడిన సర్వశ్రేష్ఠమైన ఊహా శక్తులు ఏవైతే ఉన్నాయో వాటిలో అత్యంత శ్రేష్ఠమైన కల్పనలు ఉపనిషత్తులలో చెప్పబడి ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కదానిని మనం పాటించినా జీవితమునకు సార్థకత చేకూర్చగలుగు తాము. సోऽహం, అహం బ్రహ్మాస్మి వంటి శ్రేష్ఠమైన, మహత్త్వ

**బాధతో ఉన్నవాడు ఇంకొకడికి ఏమి చేయగలడు?**

పూర్ణమైన కాంక్షలను జీవితంలో ధారణ చేసి, ఊహాశక్తి యొక్క సహాయంతో ఆ పరమతత్త్వము యొక్క అనుభూతిని పొంద గలుగుతాము.

మనస్సు యొక్క నాలుగవ వృత్తి నిద్ర. నిద్ర మనస్సుకుండే అద్భుతమైన శక్తి. దీనిని జీవనప్రదాయిని శక్తి అంటారు. వైద్య శాస్త్రజ్ఞులు శరీరానికి నిద్ర అనేది అనివార్యమైన అంశమని కూడా చెప్పారు. అంతేకాదు దీనిలో ఆధ్యాత్మిక కోణము కూడా దాగి ఉంది. కొంతమంది నిద్ర వల్ల కలిగే ఆనందమును కూడా పొందలేరు. ఎటువంటి క్రియాకలాపాలు మనస్సులో ఉండనటువంటి స్థితి. దాని వల్ల మనస్సుకు సంపూర్ణ విశ్రాంతి దొరుకుతుంది. ఇది చాలా సుమధురమైన, సుందరమైన జీవితమును ప్రదానం చేసే ఒక స్థితి. అయితే దీని లాభాన్ని కొంతమందే పొందగలుగుతారు. ఎక్కువశాతం మంది కలలు అనే మకరి (మొసలి) బారినపడి చిక్కుకుపోతారు. వారు నిద్ర అనే ఆనందమయ సంగీతము వినకుండా వంచింపబడు తుంటారు.

శంకరాచార్యులవార్లు 'నిద్రా సమాధిస్థితి' అని అన్నారు. ఎందుకంటే మనస్సు యొక్క విషయముల చింతనే లేని సమగ్ర స్థితియైన నిద్రలో జాగరూకులుగా ఉండగలిగితే సమాధిస్థితి ఫలించినట్లే. సమాధిస్థితిలో ఏం జరుగుతుందో సరిగ్గా అలాగే నిద్రలో కూడా జరుగుతుంది. అంతే మెలకువస్థితి, జాగరూకత ఉండదు. ఆంతరికమైన జాగృతస్థితి సాధించిన తరువాతే శరీరము నిద్రిస్తుంది, మనస్సు విశ్రాంతిని పొందుతుంది. ఆంతరిక చేతన పరిపూర్ణంగా జాగృతమై ఉంటుంది. పరమ పూజ్యగురుదేవుల నిద్ర అలాగే ఉంటుంది. సామాన్య సాధకులకు ఈ స్థితి లోతుల్లోకి మెల్లిమెల్లిగా దిగుతారు. ఈ భావ దశలోకి చేరుకున్న తరువాతనే నిద్ర అనేది సమాధి యొక్క ఆనందోల్లాసముగా మారిపోతుంది.

మనస్సు యొక్క ఐదవ, చివరి వృత్తి స్మృతి. దాదాపు ఈ శక్తిని కూడా దురుపయోగమే చేస్తాము. ఏదైనా ఒక సంఘటన జరిగితే దానిని సరిగ్గా గుర్తుంచుకొని అందులోని సత్యమును తెలుసుకుంటే ఒక మహత్తరమైన ధ్యానసాధన ఆవిర్భవిస్తుంది. అయితే మనలో ఎవరికీ అలా జరుగదు. మన జీవితం అంటే జ్ఞాపకాలు లేదా స్మృతులతో నిండిన ఒక పెద్ద గోడౌన్. ఇందులో లెక్కకు మించిన స్మృతులు అలా వృథాగా పడి ఉన్నాయి. ఏ స్మృతిలో ఏ స్మృతి కలిసిపోయిందో? అనేది చెప్పడం సాధ్యం కాదు. ఈ స్మృతుల గడబిడ అప్పుడప్పుడు కలలను కూడా ఇబ్బంది పెడుతుంటుంది. ఈ స్మృతులను యోగసాధన అనే రూపంలోకి తీసుకురావాలంటే ధ్యాన-సాధన ఒక్కటే సరైన ఉపాయం. బుద్ధభగవానుడు అందుకే ధ్యానమును సమ్యక్ స్మృతి అంటారు. ఈ సాధన ద్వారా మన గతజన్మలు, భవిష్యత్తును గురించి తెలుసుకొని ఒక క్రొత్త సాధనామయ జీవితమును సృష్టించుకోవచ్చు.

*- అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## భార్య సేవలు - కర్తవ్యనిష్ఠ

*గృహస్థ జీవితం గొప్ప పాఠశాల. ఆత్మసంయమనం, పరస్పర సద్భావనలకు సంబంధించిన పాఠాలు ఇక్కడ అభ్యసించబడినంతగా మరెక్కడా సాధ్యం కాదు. భార్య భర్తలిద్దరిలో కనీసం ఒక్కరైనా ఈ విధమైన వ్యక్తిత్వం కలవారై ఉంటే ఆ కుటుంబంలో మనోమాలిన్యం ప్రసక్తే ఉండదు. ఒకసారి హజరత్ ఉమర్ వద్దకు ఒక వ్యక్తి వచ్చాడు. ఉమర్ భార్య గయ్యాళి. ఎవరో వచ్చారని కూడా పట్టించుకోకుండా భర్తను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిపోస్తోంది. ఆగంతకుడు విని సహించలేకపోయాడు. ఆమె అతన్ని తిడుతున్నా, భర్త పెదవి విప్పి ఒక్కమాట కూడా అనక పోవటం అతడికి మరింత ఆశ్చర్యాన్ని కలిగించగా, ఆయన వంక చూస్తూ "అయ్యా! ఇంత మౌనంగా ఎలా ఉండగలుగుతున్నారని ప్రశ్నించాడు. దానికి హజరత్ చిరునవ్వుతో "సోదరా! ఆమె నా భార్య. నా మురికి బట్టలను రోజు ఉతికి శుభ్రం చేస్తుంది. వంట చేసి పెడుతోంది. సమస్త సేవలు చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా స్త్రీ భార్య రూపంలో పురుషుణ్ణి అనేక పాపాల నుండి రక్షిస్తోంది. అటువంటి భార్యకు కనీసం ఎలా బాగుంటే అలా మాట్లాడుకునే హక్కును ఇవ్వటంలో తప్పేముంది? ఇది నా గొప్పతనమేమి కాదు. నా కనీస బాధ్యత" అని బదులు పలికాడు.*

- ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**జీవితంలో వెలుగును నింపుకో**

శిష్య సంజీవని-4

# అంతట గురువే నిండి ఉన్నాడు

శిష్యసంజీవనీలో సద్గురువు యొక్క ప్రేమ అనే రసము నిండి ఉన్నది. శిష్యసంజీవనిని సేవించేవారికి ఈ సత్యము యొక్క రసానుభూతి తప్పకుండా కలుగుతుంది. గురుభక్తితో ఆర్ద్రమైన కన్నులు, గురువు పట్ల ప్రేమతో రోమాంచితమైన తనువు-మనస్సు-అంతరంగము... వీటినిబట్టి శిష్యుడిని తెలుసు కొనవచ్చు. శిష్యత్వ సాధన చేస్తున్నవారి అంతరంగములో నానాటికీ గురుదేవుల రూపు ప్రకాశితమవుతుంటుంది. బాహ్య జగత్తులో కూడా మనకు కనిపించే అందరి రూపములు, ఆకృతులలో సద్గురువు యొక్క చేతనత్వమే నివసిస్తుంటుంది. గురు ప్రేమలో మునకలేసేవారి అస్తిత్వములో ద్వైతము (నీవు-నేను అనే భేదభావము) నశించిపోతుంది. పరస్పరవిరుద్ధమైన రెండు భావములు, రెండు అస్తిత్వములు ఒకే ప్రదేశములో, ఒకే సమయములో ఉండటము అసాధ్యము. ప్రేమ తొణికిస లాడే హృదయములో కోపము ఎప్పుడు తలెత్తదు. భక్తి ఉన్న చోట ద్వేషము మనజాలదు. సమర్పితభావములు జాజ్వల్య మానమైన కాంతిపుంజములో ఈర్ష్య అనే చీకటికి ఎక్కడా తావు ఉండదు.

క్లుప్తముగా చెప్పాలంటే శిష్యుని చేతనత్వములో ద్వైతమనే దుర్బలత్వమునకు స్థానము లేదు. నాది-నీది అనే భేదభావము గానీ, నేను-నువ్వు అనే సరిహద్దురేఖలు కానీ ఇక్కడ పని చెయ్యవు. ఏ కారణము చేతనైనా శిష్యుని అంతరంగములో ఏదో ఒక మూల వీటి ఉనికికి సంబంధించిన సూచనలు కనిపించినట్లయితే వీలైనంత త్వరగా వాటిని తొలగించి వెయ్యాలి. వీటి యొక్క మసకబారిన చిహ్నములు కూడా గురు ప్రేమలో అడ్డంకులుగా మారుతాయి. ద్వైతభావము బాహ్యజగత్తులోనే కాకుండా అంతరంగములను కూడా విడ దీస్తుంది. కాబట్టి ఏ రూపములో ఉన్నప్పటికీ అది శిష్యుడికి శత్రువుగానే పరిగణించబడుతుంది. దీనిని ఇంకొకవిధముగా చెప్పాలంటే 'అంతరంగ చేతనత్వములో తేడాలు ఉన్నప్పుడు ఆ వ్యక్తి యొక్క భౌతిక ప్రపంచములో కూడా ద్వైతమనే దుర్భావమును చూడగలము. అంతర్జగత్తు యొక్క ప్రతిబింబమే బాహ్యజగత్తులో కనపడుతుంది' అనేది సారాంశము. అందు చేతనే శిష్యత్వ మహాసాధనకు చెందిన సిద్ధజనులు ఈ మార్గములో పయనించటానికి సంకల్పించినవారికి శిష్యసంజీవనీకి చెందిన మూడవసూత్రమును హెచ్చరిక నిండినస్వరముతో ఈవిధముగా జారీచేస్తున్నారు. 'ద్వైతభావమును (భేదభావమును) సంపూర్ణంగా తొలగించివెయ్యాలి. చెడ్డవారినుండి, మూర్ఖజనులనుండి దూరముగా ఉండగలనని భావించవద్దు. వాళ్ళు కూడా మీవంటి వారే! గురుదేవుల కన్నా కొంచెము తక్కువగా, భిన్నముగా నీ రూపము ఉన్నట్లే కొంచెము అటు ఇటుగా వారు నీ రూపమే! యావత్ ప్రపంచములో ఉన్నటువంటి పాపము, తత్సంబంధిత మైన లజ్జ నీకు కూడా చెందినదే. నీవు ఈ ప్రపంచములో ఒక భాగానివి, అభిన్న అంగానివి, నీ కర్మఫలము యావత్ ప్రపంచపు మహాకర్మఫలమునకు విడదీయరాని రూపములో సంబంధించినదే అని గుర్తుంచుకోవాలి. జ్ఞానమును పొంద టానికి ముందుగా అపవిత్రమైనవైనా, పవిత్రమైనవైనా... ఏదైనా సరే ఆయా స్థానముల నుండి నువ్వు కూడా నీ ఉనికిని సమానముగా గడిపి తీరవలసినదే అని తెలుసుకోవాలి.

భక్తుడు భగవంతుని భక్తిలో పూర్తిగా లీనమైనప్పుడు భగవంతునికీ-భక్తునికీ మధ్య తేడా ఏమీ ఉండదు. అలా కానప్పుడు ఆ భక్తి అసంపూర్ణమైనదైనా అయ్యుండాలి లేదా అక్కడ అసలు భక్తియే లేకపోవాలి. అక్కడ భక్తుడు-భగవంతుడు పరస్పరము కలిసిపోతారు. ఇద్దరు ఏకరూపమైపోతారు. ఒకే అస్తిత్వములో ఒక్కటై ఉంటారు. ప్రేమ, భక్తి ఈ రెండింటిలో అద్వైతం తొణికిసలాడుతుంటుంది.

సత్యమేమిటంటే యావత్ విశ్వం యొక్క ఉనికి ఒక్కటే. మనలో ఎవ్వరము ఆ ఉనికినుండి వేరుగా, ప్రత్యేకముగా ఉండలేము. మనమేమీ హద్దులున్న ఏదో ఒక ద్వీపం లాంటి వారము కాదు. ఏదో ఒక హద్దు వద్ద మన ఉనికి అంతము కాదు. భగవాన్ మహావీరుడు, బుద్ధభగవానుడు, ఇంకా పతంజలిమహర్షి మొదలైన మహానుభావులు అందరు అహింస యొక్క మహిమను స్తుతించారు. దాని వెనుక ఉన్నది కూడా అద్వైత దర్శనమే. దీనికంతటికీ 'గురువర్యుల చేతనత్వములో నీ నా చేతనత్వములే కాక సమస్త ప్రాణుల యొక్క చేతనత్వములు ఇమిడి ఉన్నవి. కాబట్టి నిన్ను నీవు శిష్యుడిగా భావించుకుంటూ కూడా ఇతరులకు బాధ కలిగించటమో లేదా గాయపరచటమో

**సమాజానికి మేలు చెయ్యాలంటే మంచి మనస్సు చాలు**

చేశావంటే అది వాస్తవానికి గురువును హింసించటమే లేదా నిన్ను నీవు హింసించుకోవటమే అవుతుంది' అని తెలుసుకోవాలి.

ఒక చిన్న ఆలోచన మనలో ఉత్పన్నమైనది అంటే ఆ క్షణములోనే అది సమస్త విశ్వమంతటా వ్యాపిస్తుంది అన్న విషయమును గుర్తుంచుకోవాలి. అతి స్వల్పమైన భావము మన హృదయములో తలెత్తినా యావత్ ప్రపంచమంతట దాని ఝంకారము వినపడుతుంది. నేడు మాత్రమే కాదు... అనంతకాలాల వరకు ఈ ఝంకారము వినపడుతుంది. మన యొక్క ఈ రూపము, ఈ శరీరము నశించిపోయినా, మన పేరు మరుగునపడిపోయినా, మన ఉనికికి నామరూపాలు లేకుండాపోయినా సరే మనము చేసిన ఆలోచన, చేసిన పని, కోరుకున్న కోరిక, మనలో తలెత్తిన భావములు... మొదలైన వన్నీ యథాతథముగా ఈ విశ్వములో వ్యాపిస్తాయి. ఎందుకంటే మనలో ఎవ్వరమైనా సరే ఇక్కడ నశించిపోయినా, మరొక చోట ప్రకటీకృతమౌతాము. ఇక్కడనుండి లుప్తమైపోయినా– మరొక ప్రదేశములో మన బీజము మొలకెత్తుతుంది. మనము చేస్తున్నది ఏదైనాసరే అది నశించిపోదు. మన ఈ శరీరము కూడా నశించదు. ఎందుకంటే మనము ఒకానొక విరాట్ స్వరూపములోని ఒక చిన్న భాగాలము. ఒక అల విరిగిపోయి సముద్రములో కలిసిపోతుంది. మరల ఆ సముద్రములో నుండే మరొక అల ఎగసిపడుతుంది. ఒక అల ఉవ్వెత్తున లేస్తుంది, మరొక అల విరిగిపడిపోతుంది. నిజమునకు అలలు అన్నీ ఒక్కటే... నీటి అడుగున కలిసే ఉంటాయి. ఒక అల ఏ నీటిలో నుండి పైకి లేస్తున్నదో–ఆ నీటిలోనుండే ఇంతకు ముందు జారిపడిపోయిన అల మరల పైకిలేస్తుంది. నీటి అడుగు తలములో ఈ రెండింటి మధ్య ఎలాంటి తేడా ఉండదు. ఇది ఒకే సముద్రములో జరుగుతున్న ఆట! కొద్దిపాటి సమయమునకు ఒక అల రూపమును తీసుకుంది. కాసేపటికి ఆ రూపము మాయమవుతుంది. అల అనే రూపం లేని నీరు అలా స్థిరముగా ఉండిపోతుంది. మనందరము కూడా అల కంటే ఎక్కువైన వాళ్ళమేమీ కాదు... ఈ ప్రపంచములో అన్నీ కూడా అలల వంటివే! చెట్లు, పక్షులు, రాళ్ళు... ఇంకా మనుష్యులు అందరము... అలల వంటి వారమే! మనమంతా ఒక మహా సముద్రము యొక్క అలలమే అయితే కనుక 'ఇక్కడ ద్వైతభావమునకు స్థానము లేదు. ద్వైతభావము సరియైనది కాదని' అన్నదే దీని యొక్క సారాంశము.

పరమేశ్వరునితో ఏకీకృతమైన గురుదేవుల చేతనత్వము ఒక మహాసముద్రము వంటిది. ఈ మొత్తము ఉనికి అంతా వారిలో ఇమిడి ఉన్నది. ప్రత్యేకముగా ఎవరికోసము ఉద్దేశింప బడకపోయినప్పటికీ మన యొక్క ప్రతి ఆలోచన, పని, భావము... అన్నీ కూడా ఆయన వైపుకే పయనిస్తాయి. అందుచేత మనము ఎవరినైనా బాధపెట్టినా, ఎవరికైనా దుఃఖము కలిగించినా మరొక సద్గురువు మనస్సు నొప్పించినా లేదా గాయపరచినా మన గురుదేవులనే బాధపెట్టినట్లవుతుంది. ఇది కల్పన కాదు, వాస్తవము! ఎంతో గొప్ప శిష్యులైన వారి యొక్క జీవితములోని జీవంతమైన అనుభూతిగా దీనిని పేర్కొనవచ్చు. శ్రీరామకృష్ణపరమహంస గురుదేవుల యొక్క శిష్యుడు ఒక ఎద్దును గాయపరిచాడు. తరువాత అతడు దక్షిణేశ్వరమునకు వచ్చి శ్రీరామకృష్ణుల సేవ చేయనారంభించాడు. సేవచేసే సమయములో శ్రీరామకృష్ణులవారి పాదములో సరిగ్గా తాను ఎద్దుకు ఎలాంటి గాయము చేశాడో అలాంటి గాయమే కనపడింది. గాయాన్ని గురించి ప్రశ్నించగా శ్రీరామకృష్ణుల వారు 'అరే! ఇది నువ్వు చేసిన గాయమేకదయ్యా. తెలియనట్లుగా అడుగుతావెందుకు?' అన్నారు. సత్యమును గ్రహించిన ఆ శిష్యుడి అంతరంగము బాధతో నిండిపోయింది.

మహనీయులైన శిష్యుల అనుభవములనే కాంతిలో మనల్ని మనము పరీక్షించుకుందాము. 'నిజముగా మన మనస్సులలో వారిపట్ల నిజమైన భక్తి ఉన్నదా?' అని ప్రశ్నించుకున్నప్పుడు 'అవును' అన్న సమాధానము వస్తే కనుక మన అంతరంగము ప్రతి ఒక్కరి పట్ల ప్రేమతో నిండిపోవాలి. అవతలి వ్యక్తి దుర్మార్గుడైనా/సన్మార్గుడైనా... ఎవరైనాసరే వారిని బాధించే హక్కు మనకు లేదు. ఎందుకంటే మన గురుదేవులు అందరిలో వ్యాపించి ఉన్నారు. అపవిత్రమైనా / పవిత్రమైనా... సమస్త ప్రదేశముల యందు వారి చేతనత్వమే వ్యాపించి ఉన్నది. అందుచేత మన మనస్సులలో ఎవ్వరిపట్ల కూడా ఎలాంటి కోపము, ద్వేషము లేదా దుర్భావనలు ఉండకూడదు. ఎందుకంటే ఈ ప్రపంచములో గురుదేవుల కన్నా భిన్నమైనది ఏదీ లేదు. సమస్త ప్రపంచము ఆయన చేతనత్వములోని భాగములే! ఆయన చేతనత్వమనే మహాసాగరములోని అలలమే మనము. అందుచేత శిష్యత్వమనే మహాసాధనను చేయదలచుకున్న సాధకులు ఎల్లప్పుడు శ్రేష్ఠమైన ఆలోచనలు, భావములు, పనులను చెయ్యటము ద్వారా వారిని అర్చిస్తుండటము చాలా మంచిది.

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*
*శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**విశ్వమే ఒక విద్యాలయం - విశ్వ విద్యాలయం**

# ప్రేమ, స్నేహం, మమతలతో పుష్టిని పొందే ఇంటి భోజనం

ఇంటి భోజనం యొక్క రుచి అందరికీ నచ్చుతుంది. ఏదైనా కారణం వల్ల కొంతకాలం ఇంటికి దూరంగా ఉండ వలసి వచ్చినప్పుడు ఇంటి భోజనం గుర్తుకొస్తుంది. ప్రపంచము లో వందల రకాల రుచికరములైన ఆహార పదార్థములు దొరుకుతూండగా అప్పుడు కూడా ఇంటిలో తయారయిన భోజనం, దాని యొక్క రుచి ముందు వేరే ప్రత్యామ్నాయం ఉండదు. దీనికి కారణము ఏమిటంటే ఇంట్లో తయారైన భోజనంలో ప్రేమ, స్నేహం, మమత అనే భావాలు కలగలిసి ఉంటాయి. మన సామాజిక వ్యవస్థలో భోజనం వండే బాధ్యత మాతృమూర్తుల మీద అనగా ఆడవారి చేతులలో ఉంటుంది. మహిళలు ఇల్లు, కుటుంబము యొక్క పోషణ బాధ్యతలను స్వీకరిస్తారు. **తమ కుటుంబములోనివారి మీద ప్రేమ, అభిమానము, ఇది నా కుటుంబము అనే భావన ఆడవారి చేతి వంటకు అద్భుతమైన రుచిని జోడిస్తుంది.**

ఈరోజులలో చాలా త్వరితగతిలో వికసించిన శిక్షితులైన సమాజములో కూడా తమ ఇంటి యొక్క పోషణాభారం, బాధ్యత స్త్రీలే స్వీకరించడం మనం చూస్తున్నాము. వారికి ఇంకా చాలా పనులు, బాధ్యతలు ఉన్నా కూడా ఉద్యోగనిమిత్తం బయటకు వెళ్ళటం, అలాగే వేరే బాధ్యత ఉన్నా కూడా భోజనం తయారుచేయడమనే పనిని వారు తమ భుజస్కంధాలపై ఎత్తుకుంటున్నారు. ఈ బాధ్యతను స్వీకరించడానికి వారు తాము ఇది చేయగలమా? లేదా? అని సంశయించరు లేక ఇది వారికి భారమని తలచరు. అంతేకాక సంపూర్ణ ఉత్సాహముతో, మనోబలంతో, దృఢచిత్తంతో ఈ పనిని నిర్వహిస్తుంటారు. మహిళలకు అప్పగించిన ఈ బాధ్యత చూసేవారికి చాలా చిన్న విషయముగా, చిన్న పనిగా, తేలికగా కనిపించవచ్చు. కానీ వాస్తవానికి ఇది మన సంస్కృతిలో కలగలిసిన ఉత్తమమైన సంస్కారాలను పెంచి పోషించే 'దార్శనికశక్తి!' ఎందుకంటే **అన్నంతో మనస్సు, మనస్సుతో సంస్కారము మరియు సంస్కారముతో సంస్కృతి యొక్క స్వరూపము తయారవుతుంది.**

మన శాస్త్రములలో మహిళలను ఆ జగజ్జనని అయిన 'మాతా భగవతి' స్వరూపముగా చూస్తారు. వారు భూమి మీద ఒక మహాశక్తి యొక్క ప్రతినిధులుగా ఉన్నారు. అందు వలన వారు ప్రతి రూపములో పవిత్రులు మరియు పూజనీయులు అని చెప్పబడ్డారు. అలాంటప్పుడు వారి చేతులతో తయారైన భోజనం స్వతఃసిద్ధంగా సంస్కారవంతమైనదిగా, శ్రేష్ఠమైనదిగా తయారవుతుంది. ఈ సంస్కారవంతమైన భోజనం క్షుద్బాధను చల్లార్చుతుంది. దీనితోపాటు మనసులోని అనేక సందేహము లకు కూడా పరిష్కారము చూపుతుంది. ఇప్పుడు ఈ భోజన ముతో సంపూర్ణ వ్యక్తిత్వము మరియు జీవితము సంస్కరించబడే ప్రక్రియ కలిసుంది. మహిళల యొక్క ఈ అద్భుతమైన శ్రమ మరియు ధర్మ-అర్థ-కామ-మోక్షమనే నాలుగు పురుషార్థముల వలన మన సంస్కారము మరియు సంస్కృతి ఈరోజు అంతరించిపోకుండా జీవించి ఉన్నది.

ఆడవారు భోజనం తయారుచేయటానికి వారి యొక్క మనస్సులోని భావన మరియు వారి కుటుంబములోనివారి గురించి ఆలోచించి ఒక అవగాహనతో తయారుచేస్తారు. దీనితోపాటు నాలుకకు రుచిగా అనిపించటానికి వారు ఎల్లప్పుడూ జాగరూకతతో రచనాత్మక వ్యూహముతో వ్యవహరి స్తారు. ఈ కారణముతోనే మామూలు రోజులలో వండే వంటతో పోలిస్తే విశేషమైన రోజులలో అనగా పండుగలు-పబ్బాలలో వారు తయారుచేసే ప్రత్యేక వంటకాలు మరియు తినుబండారాల ద్వారా పాకశాస్త్రములో తమకున్న నైపుణ్యమును కనబరుస్తుంటారు. ప్రతి ఇంటి యొక్క ప్రతి కుటుంబము యొక్క భోజన రుచులు వేరువేరుగా ఉంటాయి. దానిలో కూడా ఒక కుటుంబములోని ప్రతి వ్యక్తి యొక్క రుచులు, అలవాట్లు వేర్వేరుగా ఉంటాయి. అలాంటి పరిస్థితిలో మహిళలు మాత్రమే తమ యొక్క పాకశాస్త్ర ప్రావీణ్యముతో, నైపుణ్యముతో అన్ని రకాలైన భోజనానికి సంబంధించిన లేక భిన్నరుచులను గురించి గుర్తుపెట్టుకుంటారు. ఎవరికి ఏమేమి ఇష్టమో ఏమి కావాలో గుర్తుంచుకొని వారికి అది చేసిపెడతారు. ఆడవారి చేతులలో వంశపారంపర్యముగా వచ్చిన జ్ఞానం యొక్క తరగని సంపద మరియు తినుబండారాల సంస్కృతి యొక్క బహు ముఖ విధానములు ఆ చేతులలో ప్రత్యక్ష నివాసముంటాయి. అందుకనే వారి చేతులతో తయారుచేసిన భోజనానికి అద్భుతమైన రుచిని మరియు మానసిక తృప్తిని కలిగించే శక్తి ఉంటుంది.

**దేవ సంస్కృతి అంటే శరీరంలో ఉన్న దేవుడిని గుర్తించడం**

వండటం అనే కళలో పాకశాస్త్రంలో అంతగా ప్రావీణ్యం లేకపోయినా ఈ పద్ధతి యొక్క ముఖ్య ఉద్దేశ్యం అనుభూతిని పెంచి పోషించడమే. కానీ అన్నిరకాల తినుబండారాలను, పదార్థములను కలిపేసి ఒక మిశ్రమముగా తయారుచేయటం కాదు. మహిళల భావనలో తమ కుటుంబము కోసం భోజనం తయారుచేయడం వారు భారంగా కానీ, కష్టంగా కానీ భావించరు. అలాగే అదేమీ వారి వ్యాపకముగా కాక ఇది వారి సామాన్య దినచర్యకు సంబంధించిన ఒక మహత్త్వ పూర్ణమైన, రచనాత్మకమైన పనిగా భావిస్తారు. దీనితో వారి ప్రత్యక్ష సంబంధము వారి కుటుంబ సభ్యుల భావనాత్మక జీవితముతో ముడిపడుంటుంది. ఇంటి భోజనం యొక్క అసలైన రుచి మహిళలకు వారి కుటుంబ సభ్యులపై ఉన్న ఆత్మీయభావన వల్ల వారు వండిన ఆహారం అంత రుచిగా తయారవుతుంది.

మహిళలు పూర్వకాలం నుండి తమకు సంక్రమించిన ఈ బాధ్యతను చాలా చక్కగా నిర్వర్తిస్తున్నారు. చాలాసార్లు అనేక విధాలైన మనస్తత్వాల ప్రభావం వల్ల వశీభూతమై ఈ వంట చేసే ప్రక్రియను కేవలం మహిళల యొక్క భాగ్యముగా, వారి అదృష్టముగా భావించేవారు. దీని ప్రతిఫలముగా మహిళలు సమాజమునకు ఈ వంశపారంపర్య బాధ్యతను సమర్థవంత ముగా నిర్వహించటానికి అనేక కష్టములను భరించారు. కానీ ఇప్పుడు సమాజములోని చదువుకున్న మహిళలకు ఈ విషయము అనుభవంలోకి వచ్చింది. అదేమంటే ఇల్లు-సంసారం మహిళల యొక్క తలరాతగా లేక తప్పనిసరిగా ఆచరించవల్సిన బాధ్యత కాదు. అంతేకాక తన వ్యక్తిత్వములో అంతర్లీనముగా ఈ విశేష గుణం ఉంది. దానివల్ల జీవిత మంతా, సమాజమంతా పోషించబడి సంస్కరించబడుతుంది.

గతంలో ఏయే పరిస్థితులు మరియు ఎలాంటి ఆలోచనలు వారికి ఉన్నాగానీ ఇప్పుడు సమయము వచ్చింది. మహిళల యొక్క ఈ ప్రత్యేకమైన బాధ్యత యొక్క గొప్పతనం గుర్తించాలి మరియు స్వీకరించాలి. వారి ఈ బాధ్యతలలో వీలైనంతవరకు సహాయం చేస్తూ మరియు పనులలో భాగం పంచుకొంటూ తమ పాత్రను పోషించాలి. వారికి ఈ పనులన్నీ చేసినందుకు ఏవిధమైన పారితోషకం ఇవ్వకపోయినా వారిని ప్రోత్సహిస్తూ వారికి కావల్సిన సాధనాసామగ్రిని సమకూర్చడంలో భాగస్వామిగా తన పాత్రను స్వీకరించాలి. మహిళల యొక్క ఈ బాధ్యత పట్ల చులకన చూపక గౌరవభావమును వ్యక్తీకరించవచ్చు. ఇంటి భోజనం యొక్క రుచి అందరికీ చాలా నచ్చుతుంది. కానీ దీనితోపాటే ఈ రుచికరమైన భోజనం వండటంలో నావంతు పాత్ర ఏమై ఉంటుంది? అని ప్రతి వ్యక్తి తన మనసులో ఒక భావనను జాగృతం చేసుకోవాలి. మన ఇంట్లో మరియు కుటుంబములో ఎక్కడ మహిళల యొక్క గృహ సంబంధమైన బాధ్యతలలో మన వంతు సాయం చేయగలగాలి.

ఈ పరివర్తన చెందిన సమాజములోని ఆచార వ్యవహార ములలో అనువైన మార్పులు వచ్చాయి. ఆడవారికి ఇంట్లో నాలుగు గోడల మధ్య ఉంచి మూసిన తలుపులు తెరుచు కుంటున్నాయి. ఇక్కడ విషయం వారి చదువు గురించి కావచ్చు, వారి స్వాతంత్ర్యం గురించి కావచ్చు. మహిళల సమక్షములో అభివృద్ధికి సంబంధించిన అన్ని అవకాశములు ఉన్నాయి. అలాంటప్పుడు ఇంటి భోజనం యొక్క రుచిని కాపాడటం కచ్చితముగా వారి ముందు ఒక పెద్ద సవాలుగా ఉండవచ్చు. వారు ఈ పనిని చేయాలనుకొని కూడా సమయము చిక్కక ఈ వంట చేసే బాధ్యతను నిర్వర్తించడములో అసమర్థులవుతారు. అలాంటప్పుడు కుటుంబములోని వ్యక్తులందరు వారి సహకార మును కచ్చితముగా అందించాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుంది.

మహిళలు భోజనములోని రుచిలో వారి యొక్క మమతానురాగాలు, స్నేహము మరియు అణకువతో మాయ చేసినట్లుగా అందరి మనస్సులను దోచుకుంటారు. దీనివల్ల మన సంస్కృతి యొక్క శ్రేష్ఠమైన సంస్కారాలను పెంచి పోషించ టానికి అవసరమైన శక్తి, మనస్సులోని భావవ్యక్తీకరణకు మార్గము ఎప్పటికీ క్షీణించకుండా, సమయ ప్రభావానికి లోనుకాకుండా ఎప్పుడు శాశ్వతముగా ఉంటుంది. ఇంటి భోజనం యొక్క రుచి నాలుకకు మరియు నోటికి మాత్రమే పరిమితం కాలేదు. ఈ రుచిలో మనందరి ఆరోగ్యము, సుఖము, సంస్కారవంతమైన జీవితము యొక్క సారము కలిసిమెలసి ఉండే విధముగా ప్రతి ఒక్కరు తమకు తాము ఇంటి భోజనం యొక్క రుచిని పెంచి పోషించే ప్రయత్నమును నిరంతరము చేస్తూనే ఉండాలి.

*– అఖండజ్యోతి, ఏప్రిల్ 2015*

*అనువాదం: శ్రీమతి స్వప్న*

**మీరు ఎంత మౌనంగా ఉంటే అంత బాగా పాఠం అర్థమవుతుంది**

### పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మికత యొక్క అసలైన సంపదలు-2

*భగవంతుడు మానవుడి లోపల ఎన్నో శక్తిసామర్థ్యములను దాచి ఉంచాడు. అవి ప్రకటీకృతమైనప్పుడే మనిషి తన యొక్క అసలైన శక్తిని తెలుసుకొనగలుగుతాడు అని అనేక ఉదాహరణల ద్వారా పరమపూజ్య గురుదేవులు వెల్లడించినట్లు గత సంచికలో చదివి ఉన్నారు. వీటన్నింటికన్నా అసలైన సంపద 'ఆధ్యాత్మిక సంపద!' దానిని పొందిన వ్యక్తి మహాపురుషులు, దైవీవ్యక్తుల కోవలోనికి చేరగలుగుతాడు. ఆధ్యాత్మికత అంటే ఏదో గారడి చెయ్యటమో లేదా ప్రజల దృష్టిని ఆకర్షించేటందుకు చేసే ఏదో ఒక బొమ్మలాట లాంటిది కాదని; ఆధ్యాత్మికతకు నిజమైన అర్థము మనిషి, అతనిలోని చేతనత్వము సంపూర్ణముగా రూపాంతరము చెందటమని పూజ్యగురుదేవులు స్పష్టముగా తెలియజేస్తున్నారు. అందుచేతనే సమర్పణ కారణముగానే హనుమంతుడు అవతారపురుషునిగా గణతికెక్కాడు' అని కూడా పూజ్యగురుదేవులు ప్రవచిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాం!*

**ఆధ్యాత్మికత యొక్క అసలైన విలువ**

ఆధ్యాత్మికత యొక్క లోతుల గురించి గానీ, స్వర్గమోక్షాల గురించి కానీ చర్చించగలిగేటంత జ్ఞానము మీకు లేదని, ఆ దిశగా మీరు మీ శక్తిని, సమయమును ఎంత మాత్రం వెచ్చించలేదని మాకు తెలుసు. కొద్దిపాటి విగ్రహారాధనలో నైనా, మాల పట్టుకుని జపం చెయ్యటాని కైనా మీరు మనస్సు నిలపలేరు. ఈ విషయమై స్వల్పమైన అవగాహన కూడా మీకు లేదు. సిద్ధుల గురించి మీకు అసలే తెలియదు. సిద్ధులు అంటే ఏదో గారడి అని, గారడీ చేసేవాళ్ళనే సిద్ధ పురుషులని మీరు భ్రమపడుతుంటారు.



**సిద్ధులు - గారడీ నుండి వచ్చేవి కావు**

గారడీవాళ్ళు ఏమి చేస్తారు? అగ్గిపుల్ల లేకుండానే దీపాలను వెలిగిస్తారు. గాలిలో చేతులను త్రిప్పి రకరకముల వస్తువులను సృష్టిస్తారు. చెవులనుంచి గుడ్లగూబను, నోటిలో నుండి కోతి పిల్లను తెప్పిస్తారు. వీటిని తమాషాలని, గారడి అని అంటారు గానీ అవి సిద్ధులు ఎంతమాత్రము కావు. సిద్ధులు గురించిన అసలైన జ్ఞానము మీకు లేదు.

ఆధ్యాత్మికత యొక్క భౌతికపక్షము గురించి మాత్రమే మీకు చెప్పబోతున్నాను. దీనివలన మనిషికి లాభము కలుగుతుంది. ఇది మానవులకు వరాలను ప్రసాదించి మనిషికి జీవితములో సుఖ సంతోషములను చేకూరుస్తుంది.

**ఆధ్యాత్మికత అంటే ఏదో తమాషా కాదు**

అద్భుతములు చేసి చూపించడము అంటే రాముడిని, హనుమంతుడిని, వినాయకుడిని చూపించమంటారు. అంటే మీకు ఆధ్యాత్మికతను గురించి సరియైన అవగాహన లేదని కచ్చితముగా తెలుస్తున్నది. ఆధ్యాత్మిక సిద్ధులు అంటే ఏదో అద్భుతములు చెయ్యటము కాదు. గురుగోవిందసింగ్ ఏమైనా సిద్ధులు చేసి చూపించాడా? సమర్థగురు రామదాసు సిద్ధులను ప్రదర్శించాడా? అలా చూపించకపోయినను వారు వారివారి సమయములలో సిద్ధపురుషులుగా ప్రఖ్యాతి చెందారని మీకు తెలుసు.

**భౌతికవాదుల దృష్టికోణములో ఆధ్యాత్మికత యొక్క అర్థము**

'ఎలాగైనాసరే మా భౌతిక జీవితము సుఖముగా, సంతోష ముగా ఉండాలి' అన్న విషయమును మాత్రము మీరు సరిగ్గానే అర్థము చేసుకున్నారు. మీ కోరిక ఇంతవరకే పరిమితము. అందుకే మేము మిమ్మల్ని భౌతికవాదపక్షం వైపే తీసుకుపోతు

**దైవీ స్పందనలకు అనుగుణంగా జీవించాలి**

న్నాము. మన ప్రాచీనులు ఈనాడు ఉండుంటే కనుక మిమ్మల్ని 'స్వచ్ఛమైన భౌతికవాదులు' అని పిలిచి ఉండేవారు. భౌతిక వాద వర్గమునకు చెందిన వీరికి ఆధ్యాత్మికత యొక్క దశ-దిశ ఎంతమాత్రము తెలియవు. మనిషికి తన వ్యక్తిత్వమును ఎలా ఔన్నత్యపరచుకోవాలో తెలియదు. అందుకనే మన ప్రాచీనులు నేటి తరానికి ఆధ్యాత్మికతను గురించి వివరించి చెప్పటము కూడా వ్యర్థమే' అంటుండేవారు. పూజలు, పారాయణలు, జాగరణలు మేము చేస్తున్నాము అని మీరు భావించవచ్చు కానీ పూజాపునస్కారములు వేరు-ఆధ్యాత్మికత వేరు.

## దృష్టికోణములో మార్పు తెచ్చుకొనటమే ఆధ్యాత్మికత

'జీవితమును ఎలా జీవించాలి? ఆలోచనావిధానము, దృష్టికోణము ఎలా ఉండాలి?' అన్న విషయమును తెలియ చెప్పేదే ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికత అంటే ఏదో కిటుకు(టెక్నిక్) కాదు. అది ఒక తాత్త్విక చింతన. పాలలో వెన్న ఉన్న రీతిలో అది మనిషి జీవితములో ఆహారము మొదలుకొని ఆలోచించడము వరకు ప్రతి పనిలోను ముడివడి ఉంటుంది.

భౌతిక జీవితములో ఆధ్యాత్మికత లాభదాయకమౌతుందా? లాభం అంటే సాధారణముగా మానవులు కోరుకునే డబ్బు, పదవి, గౌరవం. ఈ మూడూ లభిస్తే చాలు జనం సంతృప్తి చెందుతారు. ఆధ్యాత్మికతను అనుసరించడము వల్ల మా జీవితములో ఎంతో అద్భుతము జరిగింది అని సంతోష పడతారు. గాయత్రీమాత దయ మాకు సిద్ధించింది, ఆమె ఆశీర్వాదములు లభించాయి అనుకుంటారు.

మన ప్రాచీనుల జీవితాలను సమగ్రముగా అధ్యయనము చేస్తే ఆధ్యాత్మికతను గురించి మీరు ఎటువంటి అపోహలో ఉన్నారో అర్థమవుతుంది. ఆధ్యాత్మికత ప్రాపంచిక జీవనాన్ని సుఖమయము చెయ్యగలదు అన్న మీ భ్రమ తొలగిపోతుంది. సాధారణముగా మనుష్యులు 'ఎంత ఏకాగ్రతగా చేద్దామన్నా పూజలో నా మనస్సు లగ్నం కావటం లేదు' అంటూ ఉంటారు. అంటే మీ అచేతన మనస్సులో ఈ పూజ పట్ల మీకు దృఢమైన విశ్వాసము లేదు. ఈ పూజలు, జపాలు ఎందుకు ఉపయోగ పడనివి' అన్న భావన మీ హృదయములో నిద్రాణముగా ఉంటుంది. ఈ సందేహమును నివృత్తి చేసుకొనటము చాలా మంచిది. పదిహేనురోజుల పాటు స్థిరముగా జపం చెయ్యటానికి ఏకాగ్రతతో ప్రయత్నించండి. అలా జపం చెయ్యటము వలన మీకు ఏమాత్రము మేలు కలిగిన కొనసాగించండి. లేదంటే వదిలివెయ్యవచ్చు. మీరు ఈ సందేహమును సమూలముగా తొలగించివెయ్యండి. నిజానికి ఆధ్యాత్మికత అనేది ఎంతో విలువైనది. యుగయుగముల నుండి దాని విలువ చెక్కు చెదరనిది. ఈ ప్రపంచములో ఉన్న సమస్త సంపదలకన్నా బుద్ధి, తెలివితేటల కన్నా ఇంకా విలువైనది.

ఆధ్యాత్మికత యొక్క ఈ విలువను కనుక మీరు అర్థము చేసుకుంటే ఈ మార్గములో పయనించే ప్రయత్నము చేస్తారన్నది మా నమ్మకము. అసలు మీకు దాని విలువే తెలియనప్పుడు ఇంక ప్రయత్నించేటందుకు అవకాశమెక్కడ?

## ఆధ్యాత్మికత సిద్ధులకు సజీవ ఉదాహరణ

ప్రాచీన భారతదేశములో ఆధ్యాత్మికమార్గము పైన పయనించి లాభాన్వితులైనవారి గురించి తెలుసుకుందాము. ఇందుకు హనుమంతుడే ప్రథమసాక్షి! ఆధ్యాత్మికత ఆయన జీవితములోకి ప్రవేశించక ముందు హనుమంతుడు సుగ్రీవుడనే వానరరాజు యొక్క మంత్రిగా ఉండేవాడు. సుగ్రీవుడికి వెన్నంటి ఉంటు, ఆయన యొక్క సమస్త కార్యములను చక్కబెడుతుండేవాడు. ధనుర్బాణములను ధరించి వస్తున్న రామలక్ష్మణులను ఋష్యమూక పర్వతము పైనుండి చూసి ఎంతో భయపడి ఎవరో రాజకుమారులు సుగ్రీవుడి పైకి యుద్ధమునకు వస్తున్నారని, వాలి వాళ్ళను పంపించి ఉంటాడని అనుమానించి పెద్ద కష్టమే ఎదురైందని భయపడ్డాడు. కానీ సుగ్రీవుడి ఆదేశము మేరకు వారిని సమీపించాడు. కొంచెము తెలివిగా ఆలోచించి బ్రాహ్మణవేషము ధరించి వారి చెంతకు వెళ్ళి రామలక్ష్మణుల ద్వారా వారిని గురించి తెలుసుకొన్న పిదప చేతులు జోడించి నమస్కరించాదు.

**విప్రరూప ధరి కపి తము గయఉ । మాథనాయి పూఛత అసబయఉ ॥** ఇక అక్కడినుండి ఆయన రామభక్తుడైనాడు. అనన్యభక్తి తత్పరుడై రామకార్యమును సాధించాడు. అటువంటి ఆధ్యాత్మికత వైపు కనుక మీరు ఆకర్షించబడితే మీ జీవితమునకు సంపూర్ణముగా చికిత్స జరుగుతుంది. మీరు ఆధ్యాత్మికత యందు స్థిరమైన విశ్వాసమును పొందగలిగితే మీ జీవన విధానమే మారిపోతుంది. ఎవరో యజమాని వద్ద భయ

**జ్ఞానం సంపాదించకుండా ఎంత సాధన చేసినా లాభం లేదు**

పడుతూ పని చెయ్యవలసిన అవసరము ఉండదు. మీరు ఒక గొప్ప వ్యక్తిగా పరిణతిచెందుతారు.

### ఆధ్యాత్మిక సిద్ధితో హనుమంతుడి జీవితము మారిపోయింది

శ్రీరామచంద్రుడు ఆయన జీవితములోకి ప్రవేశించక ముందు హనుమంతునికి తన శక్తి ఏమిటో తెలియదు. శ్రీరాముని ఆగమనముతో ఆయన మహాశక్తిమంతుడైనాడు. మట్టికుప్పకు ఎలాంటి విలువ ఉండదు. కానీ ఆ మట్టిలోని ప్రతి అణువుకు చాలా విలువ ఉంటుంది. అణువు లోపల ఉండే న్యూక్లియస్ ఇంకా విలువైనది. న్యూక్లియస్ విస్ఫోటనము చెందటం వల్లనే కదా హిరోషిమా-నాగసాకీ నగరములు విధ్వంసమైనాయి. అదేవిధముగా ఆధ్యాత్మికత అనేది మనిషి లోపల ఉండే 'న్యూక్లియస్'గా చెప్పుకోవచ్చు. ఒక వ్యక్తి స్వయముగా జాగృతము చెంది తనలోని ఆధ్యాత్మికతను తేజోవంతము చెయ్యగలిగితే అది 'ఎటామిక్ భట్టీ' వలె మారిపోగలదు.

ఆంజనేయుడు తన శక్తితో ఏకంగా సంజీవనీపర్వతమునే పెకలించి వాయువేగముతో యుద్ధభూమికి తీసుకువచ్చాడు. ఆయన శరీరము ఎంత శక్తివంతమైనదో మన ఊహకు కూడా అందదు. రెండవది ఆయన ధైర్యం! అసమాన ధైర్య సాహసములతో నూరుయోజనముల సముద్రమును లంఘించి లంకను చేరుకున్నాడు. మహాబలాఢ్యులైన లక్షలాదిమంది రాక్షసులను ఎదుర్కొన్నాడు. 'రామభక్తి' అనే ఆధ్యాత్మికశక్తి ఆయనలో స్థిరముగా నెలకొని ఉండటము చేతనే ఇదంతా సాధ్యమైంది.

### నిజమైన శక్తి ఆధ్యాత్మికతయే!

ఆధ్యాత్మికతను కలిగియుండటము వల్ల శక్తివంతులైనవారు ఒకరిని మించి మరొకరు ఎందరెందరో ప్రాచీన భారతీయ చరిత్రలో మనకు లభిస్తారు. ఆంజనేయునికి ఎన్నెన్ని మందిరాలు ఉన్నాయి. ఎంతటి పూజా నివేదనలు జరుగుతున్నాయో మీకు తెలుసు. *(సశేషం)*

*- అఖండజ్యోతి, నవంబరు 2016*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

---

## ప్రతీకారం వద్దు

*ద్రౌపది యొక్క ఐదుగురు పుత్రులను ద్రోణపుత్రుడు అశ్వద్ధామ చంపేశాడు. అందువలన పాండవుల కోపం కట్టలు త్రెంచుకొన్నది. ఎలాగైనా అశ్వద్ధామను పట్టి తెచ్చి, ద్రౌపది ఎదుట అతని శిరస్సును ఖండించి ఆ మాతృమూర్తి హృదయానికి ఊరట లభింపచేయాలని అనుకొన్నారు. కానీ వివేకవంతురాలైన ద్రౌపది వారి ప్రయత్నాన్ని వారిస్తూ, పుత్రశోకాన్ని మించినది ఈ లోకంలో మరేదీ లేదు. నేను అనుభవిస్తున్న ఈ పుత్రశోకం మీ గురుపత్నికి కలిగించడం వలన నా బిడ్డలు తిరిగిరారు. కాబట్టి ప్రతీకారానికి బదులు గురు ఋణాన్ని, గురుపత్ని అయిన ఆ మాతృమూర్తి ఋణాన్ని తీర్చడానికి చేసే ప్రయత్నంలో భాగంగా అశ్వద్ధామను క్షమించి వదలివేయండని పాండవులకు బోధ చేసింది. ప్రేమతో నిండిన హృదయం దారుణమైన ప్రతీకారాన్ని జయించింది.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

## ఋణం తీర్చాకనే సన్యాసం

*మగధ దేశంలోని ఒక పెద్ద వ్యాపారి సన్యాసదీక్షను ఇమ్మని కోరుతూ బుద్ధుని వద్దకు వచ్చాడు. విషయాన్ని విన్న బుద్ధుడు వ్యాపారితో నాయనా! ముందు నీవు ఉదారుడు గాను, సజ్జనుడుగాను మారాలి. తరువాత నీ సదాచరణ ద్వారా కుటుంబసభ్యుల దుర్గుణాలను నివారించాలి. ప్రతివ్యక్తి ముందుగా కుటుంబ ఋణాన్ని తీర్చుకోవాలి. ఈ ఋణం తీర్చగలిగిన వారికే సన్యాస ధర్మాన్ని నిర్వర్తించే యోగ్యత, సంఘాన్ని సేవించే సామర్థ్యం లభిస్తాయి. కాబట్టి ఇంటికి తిరిగి వెళ్ళి ఈవిధంగా చేసిన తరువాత రమ్మన్నాడు. బుద్ధుని ఆదేశం మేరకు వ్యాపారి ఇంటికి తిరిగి వెళ్ళి, గృహస్థుగా జీవిస్తూ మహాత్ముల జీవిత గాథలను చదువుతూ, వారి జీవన విధానాన్ని అనుసరించి జీవించసాగాడు. ఆ తరువాత ఆయనకు సంఘారామంలో సగౌరవంగా ప్రవేశం లభించింది.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**ఏ మాట మాట్లాడినా మృదువుగా మాట్లాడాలి**

నావారితో నా మాట

# తొమ్మిది సంవత్సరాల మాతృశక్తి శ్రద్ధాంజలి నవసృజన మహాపురశ్చరణ-2



**మొదటి మూడు సంవత్సరాల ప్రణాళిక గురించి వివరంగా తెలుసుకుందాం**

2026వ సం॥ మూడు గొప్ప సంయోగాలతో రాబోతోంది. మాతాజీ జన్మ శతాబ్ది, అఖండజ్యోతి వెలిగి వంద సంవత్సరాలు, స్వామి అరవిందో ప్రకటించిన సిద్ధి దినం (24 డిసెంబరు 1926) పూర్తయి వంద సంవత్సరాలు. ఈ సాధనా త్మక మహాపురుషార్థం పూర్తయ్యేసరికి మనతో మరో 12 కోట్ల మంది కలుస్తారు. ఈవిధంగా సత్యయుగం తిరిగి రావాలనే మన సంకల్పం పూర్తవడానికి దగ్గర పడుతుంది. మొదటి మూడు సంవత్సరాల సాధన గురించిన వివరాలు ఇప్పుడు చదువుదాం. మన లక్ష్యాన్ని చేరడానికి దీనిని ఎలా చేయాలి అని తెలుసుకుందాం.

**ఉపాసన**

మన సాధకులు, పరిజనులు, పాఠకులు నిత్యం ఉపాసన చేస్తూనే ఉంటారు; కాని మన యుగనిర్మాణ ఆలోచనాసరళితో అవిచ్ఛిన్నంగా కలిసిపోయే గాయత్రీ ఉపాసకులను మనం ఇప్పుడు కలుపుకోవాలి. దానికోసం సాధనాక్రమం క్రింద ఇవ్వబడుతోంది. ఇది ఎంతో సరళమైనది. అందరు సులువుగా చేయగలిగినది.

**1) ఆత్మబోధ-తత్వబోధ సాధన:** ప్రతిరోజు ఒక కొత్త జన్మ అనేభావనతో ఆత్మబోధ సాధన ప్రతి ఉదయం చేయబడుతుంది. మనం మన స్వరూపాన్ని, ఈశ్వరీయ అనుగ్రహాన్ని, జీవితం యొక్క ప్రాముఖ్యతని ఒకరకంగా మరచిపోయాం. మనల్ని మనం మరచిపోవడం హాస్యాస్పదం కాదా! పొద్దున మేల్కొన్న వెంటనే ఒకసారి అసలు ఈ మానవ జన్మ ఎందుకు లభించిందో గుర్తుతెచ్చుకోండి, ఒక్క ఐదు నిమిషాలు పరమాత్మ అనుగ్రహాన్ని స్మరించి, రోజంతా చేయవలసిన పనుల ప్రణాళిక వేసుకుని, మనసులోనే మరింత ఉన్నతంగా మారడానికి అవసరమైన విధానానికి రూపురేఖలు తయారుచేసుకోండి. ఆత్మవిస్మృతి నుండి మేలుకుని లక్ష్యం వైపుకి నడిపించే ప్రక్రియ ఆత్మబోధ. తెల్లవారాక పరుపు మీద కానీ, కుర్చీ మీద కానీ కూర్చుని సావకాశంగా చేసుకోవచ్చు.

**తత్వబోధ సాధన :** రాత్రి పడుకోబోయే ముందు చేసుకునేది. ప్రతీ రాత్రి ఒక కొత్త మృత్యువు అని గుర్తుచేసుకునే ప్రక్రియ. మృత్యువు సమీపించినప్పుడు జీవితాంతం మనం చేసిన పనులు సహజంగా గుర్తుకువస్తాయి. అలాగే నిద్రపోయే ముందు కూడా మనం రోజంతా చేసిన వాటిని గుర్తుచేసుకోవాలి. ఎవరినైనా నొప్పించామా? పొద్దున చేద్దామనుకున్నది పూర్తి చేశామా? ఒక కొత్త జన్మ లభిస్తే విజయం సాధించడానికి ఏ ప్రణాళిక వేస్తామో అటువంటిదే మరునాటికోసం వేసుకోవాలి. ఈ రోజు జీవితాన్ని ప్రసాదించిన పరమాత్మకు నమస్కరించుకుంటూ, ఏ చింతా లేకుండా నిద్రపోవాలి. ఇలా పడుకోవడం ఒకరకమైన యోగ నిద్ర. చాలామంది రాత్రి పడుకున్నప్పుడు గుండెపోటుతో మరణిస్తారు. మీ యోగనిద్ర – ప్రభువు చరణాలపై సర్వం అర్పించడం అనే భావన మర్నాడు మిమ్మల్ని నూతన ఉత్తేజంతో నింపుతుంది. ప్రతి రోజు 5 నుండి 10 నిమిషాలు దీనికి కేటాయించాలి. రోజంతటి మూల్యాంకనం, మృత్యువు సమయంలో భగవంతుని చింతన, ఇదే ఈ సాధన సారం.

**గాయత్రీ జపం :** స్నానం తరువాత గాయత్రీ జపం అనేది ఉపాసనలోని తరువాత అంశం. పరిజనులందరు నిత్యం 5 మాలలు జపం చేయాలి. వరుసగా మూడు సంవత్సరాలు. వీలుకానివాళ్ళు 50 సార్లు మంత్రలేఖనం లేదా 5 సార్లు గాయత్రి చాలీసా పఠనం చేయాలి. వీటిలో ఏదో ఒకటి చేస్తే సరిపోతుంది. సమయం కేటాయించగలిగినవారు మూడు చేయవచ్చు. జపం ద్వారా ఆత్మ పరమాత్మను పిలుస్తుంది. ఒకరకంగా మనం ఇది మరచిపోయాం. జీవితయాత్రలో పడి మనం పోగొట్టుకున్న ఆ అమూల్యమైనదాన్ని వెతకడం కోసం చేసేది ఈ జపం, స్మరణ, పిలుపు. నోటిని అగ్నిచక్రం అన్నారు. ఆరగింపుకే కాదు, ఈ దివ్యకుండం నుండి వాక్శక్తి కూడా ఉద్భవిస్తుంది. ఈ అగ్నిచక్రం స్థూలంగా ఆరగింపు, సూక్ష్మంగా ఉచ్చారణ,

ఏమి చెయ్యకుండా మేము ఎదుగుతామంటే మీరు ఎదుగలేరు

కారణరూపంలో చైతన్యాత్మక దివ్యప్రవాహం ఉత్పన్నం చేస్తుంది. గాయత్రీమంత్రానికి అద్భుత సామర్థ్యం ఉన్నది. తేజస్విత, శ్రేష్ఠత్వం, దివ్యత్వం పై ధ్యాస జపాన్ని శక్తివంతం చేస్తుంది. జపంతోపాటు సవితాశక్తిని ధ్యానిస్తూ ఉండాలి. సద్బుద్ధి కోసం లెక్కలేనన్ని ప్రార్థనలున్నాయి, కానీ అన్నింటికన్నా శక్తివంతమైనది గాయత్రీ మంత్రం. జపం చేయలేనివారు మంత్రలేఖనం, గాయత్రీ చాలీసా పఠనం చేయవచ్చు. వీటి ద్వారా కొత్త సాధకులను ఉపాసకులు కలుపుకోవచ్చు.

ధ్యానం-రోజు ఈ మూడింటిలో ఏదైనా ఒక ధ్యానం తప్పక చేయాలి.

- మూడు శరీరాల ధ్యానం
- ప్రాణసంచార సాధన ధ్యానం
- పంచకోశ జాగరణ ధ్యానం.

ఈ ధ్యానవిధానాలన్నీ గురువుగారి వాణిలో రికార్డ్ చేయబడి ఉన్నాయి. వాటినే ఉపయోగించాలి. ధ్యానంతో ఉపాసనా జపానికి ప్రాణం వస్తుంది. నిజానికి ధ్యానం అంతర్జగత్తు యాత్ర చేయిస్తుంది. మన మనస్సును, మెదడును, వ్యక్తిత్వాన్ని సదాలోచనల స్నానం చేయిస్తుంది. ధ్యానానికి ముందు గురువుగారు రాసిన పుస్తకం ఒకటి తప్పకుండా చదవండి. "ఉపాసన యొక్క రెండు చరణాలు-జపం, ధ్యానం." 40 పేజీల ఈ పుస్తకంలోని ప్రతి అక్షరం హృదయాంగమం చేసుకోదగ్గవి. ధ్యానం వల్ల జపంలో ప్రాణప్రతిష్ఠ బాగా జరిగి ఉపాసన సరిగ్గా సంపన్నమవుతుంది. ఉపాసన చేసే సమయంలో స్వాధ్యాయానికి రెండు ముఖ్య పుస్తకాలు-

1. నేను ఏమిటి? (1940)
2. మహాకాలుడు, యుగప్రత్యావర్తన ప్రక్రియ (1936).

సాధన అంటే మనల్ని మనం అభ్యసించి చేరుకోవడం. మనపై మన నియంత్రణ. ఉపాసన ఇంతసేపు చేయాలని నిర్ధారించబడి ఉంటుంది, కాని సాధన 24 గంటలు చేయాలి. నాలుగు సంయమాలు ఇందుకు దోహదపడతాయి-

1. సాప్తాహిక ఉపవాసం - ఆదివారం కానీ గురువారం కానీ ఒక పూట ఉపవాసం.
2. అణువ్రతం - ఆహార నియంత్రణ, మౌనం, సత్సంకల్పాల పఠనం మొదలైనవి. వాటిని పాటించాలి కూడా.

## వ్యక్తిగత సాధనలో స్వాధ్యాయానికి కొన్ని పుస్తకాలు

(1) మన యుగనిర్మాణ సత్సంకల్పాలు. (2) గాయత్రీ సూర్యోపస్థానం. (3) అచేతన, చేతన, సూపర్ చేతన మనసు - వాఙ్మయం 22 (4) ప్రాణశక్తి ఒక దివ్య విభూతి - వాఙ్మయం 18. (5) గాయత్రీ మహావిజ్ఞానం (మూడు భాగాలు)

మనకి స్వాధ్యాయం కోసం మూడు సంవత్సరాలు దొరికింది. సాధన, ఉపాసన సంపూర్ణంగా చేసుకోవచ్చు. తరువాతి చరణానికి మనం సిద్ధం కావచ్చు. స్వాధ్యాయం చేస్తూ నోట్సు వ్రాసుకోవడం అనే అభ్యాసం చేయాలి. అలా చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరిగి, రచనా సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఈ అవధిలో ఏమేమి పూర్తి చేయగలిగాము? అనేది కూడా మన నోట్సు ద్వారా తెలిసిపోతుంది.

ఆరాధన - ఆ పరబ్రహ్మ, పరమాత్మ యొక్క సాక్షాత్ స్వరూపమైన ప్రపంచానికి చేసే సేవా సాధననే ఆరాధన అంటారు. దీనిని మూడుభాగాలుగా విభజించాము. 1) యువశక్తి, 2) నారీశక్తి, 3) ప్రౌఢ సాధకులతో సహా మన పరిజనులందరు.

ఆరాధన ద్వారా ప్రజలందరికీ చేరువ కావాలని అనుకుంటున్నాము. ఈ సమయం మహాకాలుని పిలుపు విని సేవా సాధన ద్వారా పీడితులను అన్ని రకాలుగా ఆదుకోవాలి. సౌకర్యాలు కల్పించటం, పీడ నివారణ, పతన నివారణలలో అంతిమ సాధన అన్నిటికన్నా శ్రేష్ఠమైనదిగా భావిస్తారు. దీనినే లక్ష్యంగా చేసుకుని, అందరికీ కార్యప్రణాళిక తయారు చేయబడింది.

**యువశక్తి -**

1) విద్యాలయాల్లో సామూహిక భావనను వికసింపచేయడం, విద్యార్జన సామర్థ్యం మెరుగుపరచడం, సంవేదన విస్తరణలలో విభిన్న పక్షాలపై చర్చ. దీని కోసం పరమపూజ్య గురువుగారి ఆలోచనలను ఆధారంగా ఉంచుకుని, చిన్న చిన్న దృష్టాంతాలు, కథానికల ద్వారా విద్యార్థులలో అభిరుచి పెంచడం అనేది మూల లక్ష్యం. దానితో పాటే అనేక విషయాల మీద చర్చలు, వాదనలు, కథలు-కావ్యాల ప్రస్తుతి, ఆట పాటలు మొదలైన పోటీల ఏర్పాటు చేయవచ్చు.

**రోగములు భావనలలో ఉన్న వికృతుల వలన వస్తున్నాయి**

2) మహావిద్యాలయాలలో లైబ్రరీల స్థాపన జరగాలి. వక్తృత్వ కళ, ప్రజ్ఞాగీతాలు మొదలైనవాటి పోటీలు, యుగసాహిత్యం ఆధారంగా చర్చల కార్యక్రమాలు ఏర్పాటు చేయవచ్చు. అనేక విషయాల మీద పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు తయారుచేసి చూపించి, శిబిరాలను ఏర్పాటు చేయవచ్చు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరు కలిసి 'అఖండజ్యోతి' క్లబ్ మరియు స్వాధ్యాయ మండలి స్థాపించి పరస్పర చర్చలను ఏర్పాటు చేసుకోవచ్చు. అన్ని మహావిద్యాల యాలలో ఒక ఆధ్యాత్మిక స్వాధ్యాయ మండలి స్థాపన జరగాలి. అన్ని కాలేజీలలోని యువత సక్రియ మవ్వాలి.

3) వైజ్ఞానిక ఆధ్యాత్మికత మీద యువత దృష్టి సారించాలన్నది మన లక్ష్యం. 21వ శతాబ్దానికి ధర్మం వైజ్ఞానిక ఆధ్యాత్మికత. దీనికి సంబంధించి అనేక సబ్జెక్టులు తయారుచేయవచ్చు. ఆలోచనాపరులు, బుద్ధిజీవులను పిలిపించి మన యువతకు వారినుండి సంక్షిప్తంగా వివరణ ఇప్పించి, వాటిని కార్యా న్వితం చేయడానికి చర్చలు చేయవచ్చు. పలుచోట్ల యుగ సాహిత్యం స్టాళ్ళు ఏర్పాటు చేయాలి. ఈ విషయాల గురించి విశ్లేషించడానికి పరిశోధకులను ఆహ్వానించాలి. దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో, బ్రహ్మవర్చస్‌లో జరిగిన పరిశోధనల మీద చర్చలు జరిగాలి, ప్రతినెల వాటిపై సమీక్ష వేసుకోవాలి.

4) గ్రామీణ/జిల్లా/ప్రాంత స్థాయిల్లో 'దియ' ద్వారా యువ సంగఠనల వ్యవస్థ ఏర్పడుతూ ఉండాలి.

5) యువసంగఠనల రీతి-నీతి అనే పుస్తకంలో ఇవ్వబడ్డట్టుగా కార్యక్రమాలు విధిగా ఏర్పాటు కావాలి. 'ఉత్తిష్ఠత్ జాగ్రత్' అనే పుస్తకాన్ని ఆధారం చేసుకోవాలి. సప్తక్రాంతి ఆధారంగా రాష్ట్ర నవనిర్మాణానికి పంచ అభియానాలు-యువజాగృతి అభియాన్, వృక్షగంగా అభియాన్, గ్రామ తీర్థయోజన, బాల సంస్కారశాల అభియాన్, భాగీరథీ జలాభిషేక అభియాన్‌లలో అందరు పాల్గొనాలి. ఆరాధనా పరమైన ఈ కార్యక్రమాలు దేశ భవిష్య స్వరూపాన్ని నిర్ధారిస్తాయి. మనం కనీసం ఒక శాతం (దేశంలో 70 కోట్ల మంది యువత ఉంది) యువతతో మొదలుపెట్టి 9 సంవత్సరాలల్లో 10 శాతానికి చేరుకోవాలి.

6) విద్యాలయాలలో ఫీజు లేకుండా కోచింగ్ వ్యవస్థ ఏర్పడాలి. ఖర్చులకు మాత్రం సరిపడా డబ్బును వసూలు చేసి ఈ పుణ్యకార్యాన్ని పూర్తిచేయాలి. ఫీజులు కట్టలేక చాలామంది విద్యార్థులు తమ ప్రతిభను కనబరచలేకపోతున్నారు.

7) యోగ ప్రశిక్షణ - హోలిస్టిక్ హెల్త్ విషయాలపై శిక్షణ పలుచోట్ల ఏర్పాటు చేయాలి. దేవసంస్కృతి విశ్వ విద్యాల యం నుండి సహాయం తీసుకోవచ్చు. ప్రతిరోజు ఉదయం పలుచోట్ల యోగా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయవచ్చు. ఆరోగ్యవంతమైన యువత మాత్రమే భారతదేశ వికాశానికి ఆధారం కాగలదు.

8) రాజకీయాలకు దూరంగా ఉంటూ దేశనిర్మాణం కోసం యువత గుణాత్మకంగా, సంఖ్యాపరంగా కూడా ఎదగాలి. ప్రతిసంవత్సరం 5 శాతం వృద్ధి జరగాలి. అప్పుడు 2020 నాటికి మనం 15 రెట్లు ఎక్కువ యువశక్తిని ప్రదర్శించ గలం.

9) పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ల దగ్గర నుండి చేసిన ఏర్పాట్లన్నిటి రికార్డుల డిజిటైజేషన్ జరగాలి. అందరు కంప్యూటర్లను ఉపయోగించడం నేర్చుకోవాలి. సోషల్ మీడియాని సరైన విధంగా వాడడం అందరికీ రావాలి. సోషల్ మీడియాని మనం రచనాత్మకంగా వాడుకోవాలి. మన యువతకు అందులో శిక్షణ లభిస్తేనే అది సాధ్యం. అందరు టెక్-సావీ కావాలి.

నారీశక్తి-జనశక్తిలో సగమైన నారీశక్తిపై విశేషంగా ధ్యాస పెట్టాలి. మిషన్‌లోని ప్రతి కార్యక్రమంలో నారీశక్తి యోగదానం చాలా శాతం ఉంది. ఇంకా చెప్పాలంటే పురుషుల కన్నా ఎక్కువే. కానీ సామాజిక-ఆధ్యాత్మిక ప్రయోజనాలలో వీరి యోగదానం తక్కువే. ధార్మిక కార్యక్రమాలు, కర్మకాండలు, యజ్ఞాలు మొదలైనవాటిల్లో నారీశక్తి ఉపస్థితి ఉంటుంది; కానీ ఇప్పుడు వారు రెండు వైపుల బాధ్యతని స్వీకరించాలని మేము కోరుకుంటున్నాం. ఈ విషయాల గురించి వచ్చే సంచికలో నారీశక్తి మరియు పరిజనుల భూమిక గురించి చదవండి.

*- అఖండజ్యోతి జూన్, 2017*

*అనువాదం: ఎం.వి.ప్రసాద్*

**ఇతరులను మార్చాలనుకోవడం భ్రమ మనం మారడమే ఉత్తమమైన మార్గం**

# టమాట (రామములగ) ఒక ప్రకృతిసిద్ధమైన ఆరోగ్య సంరక్షణి

టమాటను పండువలే భావించి తినడం అధిక లాభదాయకం. ఈ ఫలము అత్యంత శక్తిదాయకమైన యాంటిఆక్సిడెంట్లతో కూడి ఉన్నది. దీనిలో ఎ,బి,సి,ఇ విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. ఆవశ్యకమైన అన్ని ఖనిజ లవణాలు, పోషకతత్వాల భాండాగారము. దీనికి తోడు విటమిన్ 'సి' పుష్కలంగా కలిగి ఉండి, శరీరానికి కావలసిన ఇనుప ధాతువును సరిపడినంతగా అందించును. దీనితో రక్తములో హిమోగ్లోబిన్ పరిమాణము వృద్ధి చెందుతుంది. అట్లే క్యాల్షియం, ఫాస్ఫరస్‌లు నిండి ఉన్న ఈ ఫలము శరీరములోని ఎముకలను పటిష్ట పరచును. శరీరంలోని రక్తాన్ని పెంపొందించుట ద్వారా రక్తహీనత వలన ప్రాప్తించెడి రోగాల నుండి రక్షణ కల్గిస్తుంది.

ఆధునిక రోగ చికిత్సా విజ్ఞానం ప్రకారం మధుమేహ రోగికి టమాట సేవనం ద్వారా రక్తములోని చక్కెర శాతం నియంత్రించబడి రోగ నిదానానికి తోడ్పడుతుంది. టమాట సేవనం జీర్ణశక్తిని వృద్ధి చేసి ప్రేగులకు బలాన్ని చేకూర్చుతుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. టొమాటాలోని లాయికోపెన్ పేరుగల తత్వం క్యాన్సరు రోగం నుండి విముక్తిని కల్గించగలదు. అట్లే నేత్రాలను శక్తివంతం గావిస్తుంది. హృద్రోగాల నుండి విముక్తి లభిస్తుంది. రక్తనాళంలో పేరుకుపోయిన యూరిక్ యాసిడ్‌ను వెలికి పంపిస్తుంది. రక్తములోని ఆమ్లశాతం తగ్గి, రక్తములో ఉత్పన్నమయ్యే విషపదార్థములు నివారింపబడతాయి.

టొమాటోలను సలాడ్ రూపంలోగాని, ఫలాల రూపంలో గాని సేవించిన అధిక లాభం చేకూరుతుంది. ఇట్లు కాక భోజనంతో పాటు కూరగా సేవించిన పూర్తిగా జీర్ణము కాదు. పులుపు ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి.

టొమాటోల కూరలో లేక పచ్చడిలో కొద్ది బెల్లాన్ని లేక ఖండసారి చక్కెర కాని కలిపి సేవించిన మంచిది. దీనివలన పులుపు శాతం తగ్గి గుణకారి అవుతుంది. మధుమేహ వ్యాధి రోగులు దీనిని సేవించకూడదు.

## ఉపయోగాలు

**అజీర్తి నివారణకై:** ఎర్రని టొమాటోలకు కొంచెం చక్కెర, నల్ల మిరియాల పొడితో సైంధవ లవణాన్ని కలిపి సేవించిన మంచి లాభం చేకూరుతుంది.

**ఆకలి మందగించినచో:** ఎర్రని టొమాటోలను ముక్కలుగా చేసి, వానిపై శొంఠిచూర్ణాన్ని సైంధవ లవణాన్ని చేర్చి సేవించిన జఠరాగ్ని పెరిగి ఆకలి పెరుగుతుంది.

**నోరు తడియారిపోవుట:** దాహం బాగా ఉన్నప్పుడు ఎర్రని టొమాటోల తాజారసాన్ని 150 గ్రాములు తీసికొని దీనిలో బెల్లాన్ని లేక చక్కెరను 1-2 మాత్రల సైజులో లవంగాలను నలిపి కలిపి సేవించిన లాభకారి.

**చర్మ రోగములకు:** ఎర్రని టొమాటోల రసాన్ని 100 గ్రాముల చొప్పున ఉదయం, సాయంత్రం త్రాగినచో వికారము వలన చర్మంపై ఎర్రని పూతగా వచ్చిన చిన్న చిన్న పొక్కులు నివారింపబడతాయి. ఇట్టి రోగులు తెల్లని ఉప్పును వాడరాదు. ఉప్పు అవసరమైనచో సైంధవ లవణమును వాడుట మంచిది.

**మలబద్ధక నివారణ:** మైదా, పంచదార, నూనెతో చేసిన తినే పదార్థాలు తినడం వలన మలబద్ధక రోగులు రోజురోజుకు ఎక్కువవుతున్నారు. టొమాటోలను సలాడ్ రూపంలోకాని లేక టొమాటో సూప్ లేక రసం రూపంలో సైంధవ లవణంతో, జీలకర్ర, మిరియాలు నల్ల ఉప్పు రుచికి తగ్గట్లుగా చేర్చి రోజూ సేవించిన ప్రేవుల నరాలలో బలం చేకూరుతుంది.

ముదిరిపోయిన మలబద్ధక రోగులకై గోధుమ చపాతీలు పచ్చని ఆకుకూరలతో చేర్చి ప్రతిదినం తినాలి. సలాడ్ (పచ్చి కూరలు) భోజనంతోపాటు తప్పనిసరిగా తీసుకోవాలి.

**మధుమేహ నివారణకై:** వర్తమాన చికిత్సా శాస్త్రానుసారం తాజా పెరుగుతో టొమాటోలను సేవించిన రక్తములోని చక్కెర శాతం తగ్గించుటలో ఉపయోగకారి.

1) రోజూ 250 గ్రాముల ఎర్రని టొమాటోల సలాడ్‌ను సేవించాలి. పొట్టుతీయని గోధుమపిండితో చేసిన రొట్టెలను ఆకుపచ్చని కూరలతో తినాలి. మెంతికూర, మెంతి ఆకులకూర, శనగ పప్పుతో కాకరకాయ కూర, క్యాబేజీ కూర, ముల్లంగి, వంకాయ, క్యారెట్, టొమాటో మున్నగునవి సేవించవచ్చు.

**సద్విమర్శలు మన లోపాలను సరిచేసుకోవడానికి పనికి వస్తాయి**

పాలకూర, బఠాని, అలచందలు మున్నగువానిని తీసికొన వచ్చును. పటికబెల్లం, వరిఅన్నం, బెల్లం, చక్కెర, అరటిపండ్లు, బంగాళాదుంపలు మున్నగు తీపికలిగిన పదార్థములు, తియ్యని పండ్లు సేవింపరాదు. 2) రోజూ ఉదయాన్నే కీరదోస, రెండు కాకర, రెండు టొమాటోల రసం తీసి త్రాగిన లాభకారి.

**దంతములు మరియు చిగుళ్ళ వ్యాధి నివారణకై:** టొమాటో రసాన్ని లేక సూప్‌ను రోజుకు 2-3 సార్లు త్రాగుటచే దంత రోగములన్నీ సమసిపోగలవు. వికారమునకు సంబంధించిన అన్ని రోగములు దూరమవుతాయి.

**జ్వరం తరువాత కలిగే నీరసం నివారణకై:** జ్వరం తగ్గిన తదుపరి జీర్ణానికి తోడ్పడెడి రసాల ఉత్పత్తి శరీరంలో సన్నగిల్లినప్పుడు ఆకలి తగ్గి, అరుచి పెరిగి, ఆహారం తినబుద్ధికాదు. టొమాటో, ముల్లంగి, అల్లం తరిగి దీనిలో సేంద్యా లవణాన్ని, నిమ్మరసాన్ని చేర్చి చపాతీలతో సేవించిన లాభకారి.

**నోటిలో బొబ్బలు నివారణకై:** టొమాటో నీటిలో కలిపి తడవ తడవకు పుక్కిలించిన లాభకారి.

**గుండె స్పందన పెరిగినప్పుడు:** రెండు టొమాటోల రసాన్ని నీటిలో కలుపుకొని, 4 గ్రాముల అర్జునచూర్ణాన్ని చేర్చి సేవించిన లాభకారి.

**అపెండిసైటిస్ నివారణకై:** 250 గ్రాముల టొమాటో రసంతో పాటు 1-2 గ్రాముల అల్లం కొద్దిపాటి సైంధవ లవణాన్ని చేర్చి తిన్నచో లాభకారి. వేసవిలో టొమాటో షర్బత్ త్రాగిన లాభదాయకం.

**సెగ గడ్డల నివారణకై:** టొమాటోల పచ్చని ఆకుల గుజ్జును పసుపుతో కలిపి నేతితో కలిపి నులివెచ్చగా చేసి సెగగడ్డపై కట్టినచో త్వరితంగా గడ్డ తయారై పగిలి చీము వెలికివచ్చి నయమవుతాయి.

**పొట్టలో నులిపురుగుల నివారణకై:** టొమాటో లేక తాజా రసాన్ని ఒక గ్లాసు పరిమాణంలో తీసికొని, రెండు గురుగింజల ఇంగువను వేడిచేసి రసంలో కలిపి పరగడుపున రోజు త్రాగినచో లాభకారి.

**తలలో గడ్డల నివారణకై:** టొమాటో రసంలో కర్పూరం, కొబ్బరి నూనె కలిపి గడ్డకు పట్టించిన లాభకారి.

**ఆస్టియోపోరోసిస్ (Osteoporosis):** ఎముకలకు సంబంధించిన వ్యాధి. ఇది సామాన్యంగా 40 సంవత్సరముల వయస్సు పైబడిన వారికి రావచ్చును. స్త్రీలలో క్యాల్షియం త్వరితగతిన తగ్గిపోవుటవలన పంచదార, తెల్లని ఉప్పు సేవించుట వలన ఉత్పన్నమయ్యెడి దుష్ప్రభావాల కారణంగా ఈ వ్యాధి వస్తుంది. దీనికి తోడు ఆధునిక జీవనశైలి కూడా మరో కారణం. దీని నివారణకై 4 నెలలపాటు రెండు కప్పుల టొమాటో రసాన్ని రోజు త్రాగినచో ఆస్టియోపోరోసిస్ వ్యాధి నివారణకు తోడ్పడు తుంది. ఒక కప్పు టొమాటో రసంలో 15 మిల్లీగ్రాముల లాఈకోపెన్ తత్వము లభిస్తుంది. ఇది బలహీనమైన ఎముకలను దృఢపరచుటలో తోడ్పడుతుంది. తదుపరి రోజు శుద్ధవాయువు ప్రసరించే ప్రదేశంలో ప్రాణాయామం చేస్తూ తెల్ల పంచదార వాడకాన్ని విరమించి దాని స్థానంలో దేశవాళీ ఖండసార చక్కెరను వాడుట ఉత్తమం. తాజాఫలాల రసాన్ని నిత్యం సేవించండి.

**హెచ్చరిక:** మంటమీద కాల్చిన టొమాటోకూర వాడకంతో అజీర్ణం, గ్యాస్, హైపర్ ఎసిడిటి మున్నగు దుష్ప్రభావములు ఉత్పన్నమవుతాయి. దీని నుండి రక్షణ పొందుటకై ఎర్రని టొమాటోల గుజ్జును పప్పు తదితర కూరలతో వండినచో పైనుదహరించిన దుష్ప్రభావాల నుండి రక్షించుకొనగలము. మంట మీద కాల్చిన కూరలలో విటమిన్ 'సి' నశించుననెడిది అక్షరసత్యం. టొమాటోలను పండ్లగానే సేవించుట ఉత్తమం. ఎర్రని టొమాటోలను పచ్చడిగా చేసికొని సేవించిన లాభకారి. ఎసిడిటి ఎక్కువగా ఉన్న వ్యక్తులు పులుపుతో కూడిన టొమాటో సేవనం మంచిది కాదు.

## యుగ నిర్మాణానికి మూలాధారం గాయత్రి

*యుగ నిర్మాణానికి మూలాధారం గాయత్రి. ప్రాణములను ఉన్నతం చేసే సాధన గాయత్రీ సాధన. గాయత్రీ ఉపాసన వల్ల అంతరంగం వేగవంతం అవుతుంది; అంతరంగంలోని మాలిన్యం, అంధకారం, అవివేకం అంతరిస్తాయి. సాధకునికి సృష్టి రహస్యం అవగతం అవుతుంది. అతడి భావనలలో దేవత్వం వికాసం పొందుతుంది. అతడి కార్యాలలో శుచిత్వం, పవిత్రత చోటుచేసుకుంటాయి. ఫలితంగా - శాంతి, సువ్యవస్థ, ప్రసన్నత, సంతృప్తులతో నిండిన జీవన గంగ సమాజంలో ప్రవహిస్తుంది.*

**విమర్శలు మనలను తీర్చిదిద్దుకోవడానికి ఉపకరిస్తాయి**

# అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018 (కౌంట్‌డౌన్-6)

## 2018 జనవరి 5 నుండి 8 వరకు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రము, మంగళగిరి పట్టణము, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.

అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞము నిర్వహణ తేదీలు 2018 జనవరి 5,6,7 మరియు 8గా ఖరారు చేయబడ్డాయి. దీనిలో భాగంగా ఈ మహాక్రతువు యొక్క శక్తి కలశాన్ని 2017 మే 15వతేదిన ఆదరణీయ డా॥ ప్రణవ్ పండ్యా మరియు శ్రద్ధేయ శైలాబాలపండ్యా పుణ్యదంపతుల పవిత్ర హస్తాల మీదుగా పూజింపబడిన తదుపరి శాంతికుంజ్, హరిద్వార్‌లో ఆదరణీయ శ్రీమతి మరియు శ్రీ అశ్విని సుబ్బారావు-మహేశ్వరి దంపతులకు అందజేయబడింది.

తొమ్మిది రోజుల సంజీవిని సాధనా శిబిరానికి ఏతెంచిన తెలుగు గాయత్రీ పరివార్ సభ్యుల హర్షధ్వానాల మధ్య జేజేలు మార్మోగగా శంఖనాదంతో శక్తి కలశము, ప్రఖర ప్రజ్ఞ-సజల శ్రద్ధల వద్దకు తీసికొనిరాబడి, అచ్చట కొలువుదీరింది.

ఆ స్థానంలో వారము రోజులు ఉంచబడి సూక్ష్మరూపములో ఉపస్థితులై ఉన్న పరమపూజ్యగురుదేవులు, పరమ వందనీయ మాతాజీల దివ్యాశీస్సులతో కూడిన దివ్యశక్తుల సంతరించు కొన్న ఈ శక్తికలశం మే నెల 21 రాత్రి 8 గం॥లకు మంగళగిరి పట్టణము, ఆంధ్రప్రదేశ్ పరిజనుల జయజయ ధ్వానాల మధ్య తన సుదీర్ఘ ప్రయాణాన్ని ప్రారంభించుతూ, తొలుత గాయత్రీతీర్థములో వేంచేసి ఉన్న గాయత్రీమాత ఆశీస్సులను అందుకొని, తదుపరి సప్తఋషుల ఆశీస్సులను అందుకొని బయలుదేరింది. వెనువెంటనే వరుణదేవుడు తన ఆనందాన్ని వ్యక్తీకరిస్తూ చిరుజల్లులతో హరిద్వార్ పట్టణ పొలిమేర్ల దాటేంత వరకు శక్తికలశాన్ని అనుసరిస్తూ ప్రకృతిని చల్లబరచాడు.

దీనికి మరింత ఆనందాన్ని జోడిస్తూ ప్రకృతి, అయా చితంగా ఒక 20 సీట్ల టయోటా ఏ.సి. మినీ బస్సును సంసిద్ధంగా ఉంచి, దివ్యాశీస్సులతో, దివ్యశక్తులతో నిండి ఉన్న శక్తికలశ సుదీర్ఘ ప్రయాణం మరింత సుఖమయంగా ఉండాలని కొత్త ఢిల్లీ వరకు ఏర్పాటు చేసింది.

పై వానికి తోడుగా ప్రయాణం మరింత సుఖప్రదమయ్యే రీతిలో శీతలీకరణగావించబడిన, పంచభూతాల గుర్తు చేసే పంచమ (5వ బోగి) రైలుపెట్టెలో ప్రవేశద్వారానికి అతి సమీపంలో స్థానాన్ని కల్పించుకొని మార్గమధ్యంలో శక్తికలశ సందర్శనానికై వచ్చిపోయేవారికి అనువుగా ఆశీనురాలైనది.

మార్గమధ్యంలో కొత్త ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో, భారతదేశ సార్వ భౌమత్వాన్ని అనుక్షణం కాచి సంరక్షి స్తున్న త్రివిధ దళాలైన సైనిక దళము, వాయుసేన మరియు నావికాదళాలకు చెందిన వారు సకుటుంబ సమేతంగా విచ్చేసి తమ భక్తి ప్రపత్తుల ప్రకటిస్తూ శక్తికలశాన్ని దర్శించుకొని, వందన సమర్పణ గావించుట మరపురాని ఒక మధురానుభూతి.

ఆ రీతిగా త్రివిధ దళాల సలాములందుకొన్న శక్తి కలశము పరమపూజ్యగురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య తమ కిశోర వయస్సులో దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, తన దేశభక్తిని చాటుకొన్న చారిత్రక ఖ్యాతిగాంచిన ఆగ్రా నగరాన్ని చేరుకొంది. అచ్చట స్వాగతం పలికిన గాయత్రీ పరివార్, శక్తికలశాన్ని సందర్శించి తన్మయులైపోయారు.

తదుపరి గ్వాలియర్ స్టేషన్‌కు చేరుకొంది. అమిత సంఖ్యలో పరిజనులు జయజయ ధ్వానాలు పలుకుతూ శక్తికలశాన్ని సందర్శించారు. మహిళలు కూడా అధిక సంఖ్యలో విచ్చేశారు. అశ్వమేధ యజ్ఞానికి 20 దినాలు ముందుగావచ్చి సమయ దానము ఇస్తామన్నారు.

అటుపిమ్మట మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధానియైన భోపాల్ నగర రైలుస్టేషనుకు కలశం చేరింది. భావసంవేదనలతో నిండిన భక్త పరిజనులు శక్తి కలశ సందర్శనతో శక్తివంతులై స్టేషను ప్రాంగణం ప్రతిధ్వనించేలా జయజయధ్వానాలు చేశారు. తోటి ప్రయాణికులు అప్రయత్నంగా ముకుళిత హస్తాలతో ప్రణామం చేశారు.

తెలంగాణా రాష్ట్రములో 23వ తేదిన ప్రవేశించిన శక్తి కలశానికి సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని పరివార్ స్వాగతం పలికి పుష్పమాలలు సమర్పించారు.

**చేస్తున్న పనిని ఎంత బాగా చెయ్యగలిగితే అంతా బాగా చెయ్యాలి**

తదుపరి వరంగల్లు పట్టణ రైలుస్టేషనులో శ్రీ సురేష్‌కుమార్ మరియు భూమానందం నాయకత్వంలో దాదాపు 20 మంది పరిజనులు కలశాన్ని దర్శించారు. స్టేషన్‌మాష్టారిని కోరి రైలును అదనంగా రెండు నిమిషాలపాటు నిలిపి కలశాన్ని శిరస్సుపై ధరించి తమ భక్తి ప్రపత్తుల వెల్లడించారు.

అటుపిమ్మట 20 నిమిషాల ఆలస్యంగా రైలు విజయవాడ నగర రైలుస్టేషనుకు చేరింది. అచ్చట దాదాపు 100 మంది పరిజనులు కలశానికి స్వాగతం పలికి స్టేషను వెలుపలికి తీసికొని వచ్చి ప్రచార రథముపై కూర్చుండబెట్టిరి. అచ్చటి నుండి లబ్బీపేటలోని గాయత్రీ పరివార్ ట్రస్టు కార్యాలయానికి కలశాన్ని చేర్చి అచ్చట పూజాదికాల నిర్వహించి హారతి ఇచ్చుట జరిగింది. అచ్చట 125 మంది వరకు హాజరైనారు.

సాయంత్రము 4 గంటలకు ప్రచార రథముపై ఆశీనురాలైన కలశము ఉండవల్లి సెంటరులో శ్రీమతి గౌతమి మరియు శ్రీ చెన్నకేశవరావుల నాయకత్వంలోని పదిమంది పరిజనుల హారతినందుకొని మంగళగిరి పట్టణములో వేంచేసి ఉన్న ద్వాపర యుగమునాటి శ్రీ లక్ష్మీనృసింహస్వామి సన్నిధానానికి చేరింది. అచ్చట వేంచేసి ఉన్న అశేజ ప్రజావాహిని జయజయ ధ్వానాలతో లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోనికి ప్రవేశించి, పంచ ప్రదక్షిణలు పూర్తిగావించుకొని మూలవిరాట్టు చెంత పూజలందుకొని, క్షేత్రపాలుని శక్తిని అందిపుచ్చుకొని, రాజేశ్వరి అమ్మవారి ఆశీస్సులనందిపుచ్చుకొని పురవీధులలో నారీమణులు ఇంటింట స్వాగతం పలుకుతుండగా ఊరేగుతూ, మంగళ వాయిద్యాల ఘోషల నడుమ అశ్వమేధ గాయత్రీ మహా యజ్ఞ వేదిక ప్రాంగణమైన ఎన్.ఆర్.ఐ. వైద్యకళాశాల ప్రాంగణానికి చేరింది. అచ్చట ఏర్పాటు చేయబడిన గౌతమిమహర్షి పర్ణశాలలో ఒక స్థిరనివాసంపై ఆసీనురాలై విరాజమానమై ఉన్నది.

పది మోటారు సైకిళ్ళపై గాయత్రీ పరిజనులు అగ్రభాగాన నడువగా తెలుగు నారీమణులు రెండు వరుసలలో బారులు తీరి నడచుచుండగా, మంగళవాయిద్యాలతో శక్తి కలశము మంగళగిరి పట్టణ రాజవీధి గుండా ఊరేగుతూ, భక్తజనుల నీరాజనలనందుకొంటూ నయనానందకరంగా పయనించింది.

ఎన్.ఆర్.ఐ. వైద్య కళాశాల మరియు వైద్యశాల అధిపతులు పర్ణశాలకు విచ్చేసి తమ భక్తి ప్రపత్తుల చాటుకొని, భోజన ప్రసాదముల స్వీకరించి వెళ్ళుట జరిగింది.

*- యుగశక్తి గాయత్రి వార్తా ప్రతినిధి*

---

## మొదటి సూత్రం

*ఒక ధర్మ ప్రచారకుడు మఠాధిపతికి ఫిర్యాదు చేసి ఇంతకాలంగా ఉపదేశాలు చేస్తూనే ఉన్నా, మీకు లభించినంత ప్రజాదరణ లభించటం లేదు. ఎవ్వరు నా అనుయాయులుగా మారటం లేదు. ఇప్పుడు ఏమి చేయాలో సెలవివ్వమని అర్థించాడు. విషయాన్ని విన్న మఠాధిపతి మర్నాడు ప్రచారకులందరిని ఆహ్వానించి రెండు పాత్రలను నీటితో నింపి, ఒక దానిలో ఉప్పు వేరొకదానిలో నూనె వేసి వారిముందు ఉంచి గమనించమన్నాడు. ఉప్పు నీటిలో కరిగిపోయింది. నూనె నీటిపై తేలి ఆడుతోంది. ఉపదేశకులు అర్థం కానట్లు మఠాధిపతి వంక చూశాడు. "నీటిపై తేలే నూనె వలె ప్రజల శిరస్సు నెక్కి ఉండటానికి ప్రయత్నించకండి. నీటిలో కరిగిన ఉప్పులాగ జనసముదాయంలో కలిసి జీవించటానికి ప్రయత్నించండి" అన్నాడు మఠాధిపతి. ప్రజలకు అర్థమవుతోందా లేదా, ప్రజలు మారుతున్నారా లేదా, ప్రజలకు ఏమైనా లాభాన్వితులవు తున్నారా లేదా అనే ఆలోచన ఏమాత్రం లేకుండా తమ గొప్పతనాన్ని ప్రజల ముందు ప్రదర్శించటం వలన సమాజానికి ఒరిగేదేమీ లేదు. వారితో కలసిపోవటం, వారు తాను వేరు అనే భావన రాకుండా చూసుకోవటం, ప్రజల దుఃఖాలలో తోడుగా ఉంటూ సహాయసహకారాలనందించటం ప్రచారకులు అమలుపరచవలసిన మొట్టమొదటి సూత్రం. ప్రపంచంలో శక్తివంతమైన దేశాలుగా చెప్పబడేవన్నీ కూడా ఈ విశ్వకుటుంబ భావనవల్లనే ఉన్నతిని సాధించాయి. ప్రాణత్యాగం చేయటానికి ఇష్టపడ్డారేగాని, వ్యక్తిగత ప్రతిష్టకు సుఖ సౌకర్యాలకు లొంగలేదు. దేశప్రగతితో సదా పెనవేసుకొని పనిచేశారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**ఏదీ శాశ్వతం కాదు, ఏ కష్టం కలకాలం ఉండదు**

వార్తలు

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## ఓడరేవులో

04.06.2017న గాయత్రీ జయంతి, వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య మహాప్రయాణ దిన సందర్భమున చీరాల సమీపంలోని ఓడరేవు శ్రీరామహంస సహ్యాద్రి ఆశ్రమములో 66 కుండముల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. ఈ మహాయజ్ఞములో 66 కుండముల బాధ్యత 66 కుటుంబములు, బంధువులు, మిత్రులు తీసుకున్నారు. శ్రీ సుబ్బారావు-పార్వతి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాయజ్ఞాన్ని శ్రీ పటేల్-సుమ దంపతులు నిర్వహించారు. ఈ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న 350 మంది గాయత్రీదీక్ష స్వీకరించారు. అన్నప్రసాద వితరణకు ఆశ్రమవాసులైన శ్రీ సుబ్బారావుగారు సహకరించారు.

## మియాపూర్-హైదరాబాద్‌లో

హైదరాబాద్ మియాపూర్‌లోని శ్రీ శిరిడీ సాయిబాబా మందిర 13వ వార్షికోత్సవ సందర్భమున అఖండ గాయత్రీ జపము, నవకుండీ గాయత్రీ మహాయజ్ఞము, సాయంత్రం దీపయజ్ఞం మందిర పూజారి మల్లప్పగారు, మందిర కమిటి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించబడినాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు జరిగిన అఖండ గాయత్రీ జపంలో 140 మంది పాల్గొన్నారు (జపసంఖ్య 25596)

నవకుండముల గాయత్రీ యజ్ఞమును శ్రీ హీర్‌సింగ్ బృందం నిర్వహించారు. ఈ కార్యక్రమములో సుమారు 100 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమమునకు శ్రీమతి సుబ్బులు, శ్రీమతి గీతారాధిక, శ్రీమతి దివ్యశ్రీ సహాయ సహకారములను అందించారు. రూ.1100/- గురుదేవుల సాహిత్య విక్రయం జరిగింది.

## చేతనాకేంద్రము-హైదరాబాదులో

04.06.2017 గాయత్రీ జయంతి సందర్భంగా సప్తకుండీ గాయత్రీ యజ్ఞాన్ని గాయత్రీ చేతనాకేంద్రములో నిర్వహించారు. 100 మంది పరిజనులు ఈ వేడుకలలో పాల్గొని పూజ్య గురుసత్తా పట్ల, గాయత్రీమాత పట్ల తమ భక్తి ప్రపత్తులను చాటుకొన్నారు. యజ్ఞాన్ని శ్రీ భరద్వాజ మరియు శ్రీమతి పద్మగార్లు నిర్వహించారు. ప్రసాద వితరణను కుమారి సంగీత, సుశీలమ్మగార్లు నిర్వహించారు.

## కోమటినేనివారిపాలెం-గుంటూరు జిల్లాలో

గాయత్రీ జయంతి వేడుకలను ఈసారి సాందీపుని ఆశ్రమము, కుందూరువారిపాలెంలోకాక, కోమటినేనివారి పాలెం, గుంటూరు జిల్లాలో 54 కుండములతో గాయత్రీ మహాయజ్ఞాన్ని నిర్వహించారు. ఈ యజ్ఞాన్ని శ్రీ డి.వి.ఆర్. మూర్తి చీరాల మరియు శ్రీ పేరిశాస్త్రి, కుందూరువారిపాలెం వారి సారథ్యంలో నిర్వహించుట జరిగింది. కోమటినేని రాజేష్, కోమటినేని పెద్దారావు మరియు మండలి సాంబశివగార్లు పూనుకొని యజ్ఞ సాఫల్యానికి కావలసిన ఏర్పాట్లు చేయుటలో అవిరళ కృషి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యజ్ఞానంతరము ప్రసాదవితరణ జరిగింది.

## తెనాలి-గుంటూరు జిల్లాలో

11 జూన్, 2017న 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞము తెనాలిలోని నవోదయ కళ్యాణమండపంలో నిర్వహించబడింది. 10వ తేదిన కలశయాత్ర జరిగింది. తెనాలి వాస్తవ్యులు శ్రీ సాంబశివరావు దంపతులు కలశపూజనం చేసి దేవ ఆవహనం చేశారు. తదుపరి భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ యజ్ఞాన్ని శాంతికుంజ్ ప్రతినిధులైన శ్రీ ఉమేష్ శర్మ మరియు ప్రశాంతిశర్మ దంపతులు నిర్వహించారు.

ఈ యజ్ఞ నిర్వహణకై డా॥ శ్రీరామ్ గాయత్రీ శక్తిపీఠము తెనాలి వారు అవిరళ కృషి సల్పారు.

అనంతరము శ్రీ ఉమేష్‌శర్మ దంపతులు కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి, యజ్ఞ విధివిధానాల నేర్పించుటకై శిక్షణా తరగతులు నిర్వహించెదమని చెప్పారు.

**ఉన్న దాంట్లో ఇతరులకు కొంచెం ఇవ్వగలిగితే చాలు**